సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 190

సోమవారం 25-3-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



ముంబై మరో'సారీ'...

వరుసగా 12వ ఏడాది ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో పరాజయం - 12లో



పెట్టుబడులకు రక్షణ ఉందా?

స్మాల్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌కు స్ట్రెస్ టెస్ట్.. ప్రతి నెలా విడుదల కానున్న డేటా -13లో



31న విపక్షాల మహా ర్యాలీ

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ ఈ నెల 31న ఢిల్లీలో మహా ర్యాలీ నిర్వహించాలని ఇండియా కూటమి నిర్ణయించింది.

వివరాలు 6లో ►



ఈడీ కస్టడీ నుంచే పరిపాలన

ఈడీ కస్టడీలో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తాగునీటి సరఫరా తదితర సమస్యలను పరిష్కరించాలంటూ ఆదేశాలు జారీ చేశారు.

వివరాలు 6లో ►



ముంబై రూ.3 కోట్ల డ్రగ్స్ సీజ్

నెల వ్యవధిలో రూ.3.25 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని, 12 మందిని అరెస్ట్ చేసినట్లు ముంబై పోలీసులు తెలిపారు.

వివరాలు 6లో ►



లోక్‌సభ బరిలో వీరప్పన్ కుమార్తె

గంధపు చెక్కలు, ఏనుగు దంతాల స్మగ్లర్ వీరప్పన్ కుమార్తె విద్యారాణి తమిళనాడులోని కృష్ణగిరి నుంచి పోటీ చేయబోతున్నారు.

వివరాలు 6లో ►

'ఎల్లో' కల్లోలం

30కి పైగా స్థానాల్లో భగ్గుమంటున్న టీడీపీ నేతలు

సీట్లు రాక పలుచోట్ల రెబల్స్‌గా మారిన తెలుగు తమ్ముళ్లు

వారిని బుజ్జగించేందుకు శతవిధాలా యత్నిస్తున్న చంద్రబాబు

- ఎంత సర్ది చెప్పినా టికెట్ దక్కించుకున్నవారిని ఓడిస్తామంటున్న అసంతృప్తులు
- పైకి పార్టీ కోసం పనిచేస్తామని చెబుతున్నా లోలోన రగిలిపోతున్న వైనం
- పొత్తుల్లో పోయిన 31 స్థానాల్లోనూ గందరగోళమే
- రెడ్డిగూడెంలో బలప్రదర్శన చేపట్టిన టికెట్ దక్కని దేవినేని ఉమ
- ఏలూరు ఎంపీ టికెట్‌పై రాజీలేని పోరాటం చేస్తున్న బీజేపీ
- గోపాలపురంలో మద్దిపాటికి తప్పని అసమ్మతి బెడద



సాక్షి, అమరావతి/రెడ్డిగూడెం/శ్రీకాకుళం/ద్వారకా తిరుమల/ఏలూరు (టూటౌన్): రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ అసమ్మతితో అట్టుడుకుతోంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు మూడు విడతల్లో 138 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఇప్పటివరకూ 30కి పైగా నియోజకవర్గాల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. ఆయా నియోజకవర్గాల్లో సీట్లు దక్కని నేతలు అధినేతపై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. వాళ్ల అనుచరులు ఆందోళనలు, నిరసనలతో హోరెత్తిస్తున్నారు. పలుచోట్ల అసమ్మతి నాయకులు స్వతంత్రంగా బరిలోకి దూకేందుకు వెనుకాడేది లేదని హెచ్చరిస్తున్నారు. వారిని బుజ్జగించేందుకు చంద్రబాబు వరుసగా సమావేశాలు నిర్వహిస్తూ... సీనియర్ నేతలను వారి వద్దకు పంపుతూ... కొందరితో రాయబారాలు నడుపుతూ... సర్దిచెప్పేందుకు శత విధాలుగా యత్నిస్తున్నారు. కొందరైతే అధినేతను కలిసేందుకు కూడా ఇష్టపడటంలేదు. కాదూకూడదని వెళ్లినవారు ఆయన ముందు పార్టీ కోసం పనిచేస్తామని చెబుతున్నా బయటకు వచ్చాక తమ అసంతృప్తిని వెళ్లగక్కుతూనే ఉన్నారు. ఇవి గాకుండా

మిగతా 14వ పేజీలో ►



శవాలపై పేలాలు

టీడీపీ సర్కారు నిర్వాకాలను వైఎస్సార్‌సీపీకి ఆపాదిస్తూ రామోజీ క్షుద్ర రాతలు

రాజకీయ లబ్ధి కోసం చావులనూ వదలని రాజ గురివింద

- పచ్చమూక భూ మాయకు చేనేత కుటుంబం బలి
- 2015లో ఆన్‌లైన్‌లో చేర్చినట్లు మోసం.. 2017లో మరో మహిళ పేరుతో ఆన్‌లైన్‌లోకి
- ప్రభుత్వ భూమికి పట్టాలిచ్చినట్లు వంచన
- భూమి దక్కకపోవడం, వ్యసనాలు, రూ.40 లక్షలకు పైగా అప్పులతో కుటుంబాన్ని కడతేర్చి.. సుబ్బారావు బలవన్మరణం

10లో

ఈ ప్రభుత్వానికి అంటగట్టడం అవివేకం..



"మా గ్రామంలో ముగ్గురు చనిపోవడం చాలా బాధాకరం. అప్పుల బాధలు సుబ్బారావును చుట్టుముట్టాయి. ఆయన భూమి ఆన్‌లైన్ వ్యవహారం టీడీపీ హయాంలోనే జరిగింది. దాన్ని ఈ ప్రభుత్వానికి అంటగట్టడం అవివేకం. సుబ్బారావు తండ్రి చలపతి మూడేళ్ల క్రితం చనిపోయారు. వృత్తికి దూరమైన సుబ్బారావు మద్యం వ్యసనాలతో అప్పుల్లో కూరుకుపోయి తనువు చాలించాలనుకున్నాడు. భార్య, కుమార్తెను హత్య చేయటాన్ని జీర్ణించుకోలేకపోతున్నాం.

– పన్నెల చంద్రశేఖర్, గ్రామపెద్ద, కొత్తమాధవరం, ఒంటిమిట్ట



మంగళగిరిలో టీడీపీ 'కోడ్' ఉల్లంఘన

- ఓటర్లకు బల్ల బండ్లు, తోపుడు బండ్లు, కుట్టు మిషన్ల పంపిణీ
- ఓ ప్రదేశంలో వాటిని నిలిపి.. ఓటర్లే వాటిని తీసుకెళ్లేలా ఒత్తిడి
- అధికారులకు అనుమానం రాకుండా కొనసాగుతున్న ప్రలోభాలపర్వం

3లో



ఉచిత విద్యకు దరఖాస్తు గడువు పెంపు

రాష్ట్రంలోని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి విద్యాహక్కు చట్టం కింద దరఖాస్తు గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈనెల 31 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించింది. ఇప్పటివరకు 49,208 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 38,150 మంది పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు.

14లో



కన్నుల పండువగా సత్యదేవుని రథోత్సవం

కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామి, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి రథోత్సవం ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా ఆలయ ప్రాకారంలో రథంతో మూడు సార్లు ప్రదక్షిణ నిర్వహించారు.

5లో

'సంధ్య' నిర్వాకాలతో ఎగుమతులకు దెబ్బ

డ్రగ్ మాఫియా వల్ల ప్రమాదంలో మత్స్య పరిశ్రమ

ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్

మహారాణిపేట: సంధ్య ఆక్వా ఎక్స్ పోర్ట్స్ కంపెనీ దిగుమతి చేసుకున్న 25 వేల కిలోల ఇన్‌యాక్టివ్ డ్రై ఈస్ట్‌లో నిషేధిత మాదక ద్రవ్యాలు ఉన్నాయని ప్రాథమిక దర్యాప్తులో తేలడం మత్స్య ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం విశాఖ ఫిషింగ్ హార్బర్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ అక్రమ రవాణా వల్ల 20 ఏళ్ల క్రితం కంటైనర్ టెర్మినల్ నిర్మాణానికి భూమి ఇచ్చిన మత్స్యకారుల త్యాగానికి విలువ లేకుండా పోయిందన్నారు. భూములిచ్చిన 766 మంది మత్స్యకారులకు

మిగతా 3వ పేజీలో ►



విశాఖలో మీడియాతో మాట్లాడుతున్న వాసుపల్లి జానకీరామ్ తదితరులు

ఆ బాక్సుల్లో ఫైళ్లు!

3లో

- అనుమానాస్పదంగా 'సంధ్య' బస్సు
- పోలీసుల తనిఖీ.. బాక్సుల నిండా ఫైళ్ల కట్టలు ఉన్నట్లు నిర్ధారణ
- సీబీఐ అధికారులకు నివేదిస్తామన్న పోలీసులు

'పార్టీ' లేదా పుష్పా?

ఏపీలో బీజేపీకి అభ్యర్థులే కరువైన రీతిలో ఎంపీల లిస్టు

ఆరింట్లో నరసాపురం తప్ప అన్ని సీట్లూ వలస నేతలకే

- కండువా కప్పుకున్న రోజే వరప్రసాద్‌కు తిరుపతి సీటు
- కడప నుంచి అనకాపల్లికి వచ్చి సీఎం రమేశ్ పోటీ
- ఈ మధ్యే చేరిన కిరణ్‌కుమార్‌రెడ్డికి రాజంపేట
- పురందేశ్వరికి రాజమండ్రి, కొత్తపల్లి గీతకు అరకు
- జీవీఎల్, సోము వీర్రాజు, విష్ణు... అంతేనా!

సాక్షి, అమరావతి : ఏళ్ల తరబడి పార్టీనే నమ్ముకుని దానికోసమే అహరహం శ్రమిస్తున్న అసలు సిసలైన బీజేపీ నేతలకు ఊహించినట్లుగానే షాక్ తగిలింది. పొత్తులో బీజేపీకి కేటాయించిన ఆరు లోక్‌సభ సీట్లలో ఒక్క నరసాపురం మినహా మిగిలిన అరకు, అనకాపల్లి, రాజమహేంద్రవరం, రాజంపేట, తిరుపతి స్థానాలను వలస పక్షులే దక్కించుకున్నాయి. దీంతో బీజేపీకి అసలైన పార్టీ అభ్యర్థులే కరువయ్యారా అన్న అంశం ఇప్పుడు కరడుగట్టిన కమలనాథుల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఎందుకంటే.. 2019లో టీడీపీ ఘోరంగా ఓటమి చవిచూసిన తర్వాత చంద్రబాబు డైరెక్షన్‌లో హుటాహుటిన బీజేపీ తీర్థం పుచ్చుకున్న ఆయన నమ్మినబంటు సీఎం రమేశ్‌కు అనకాపల్లి ఎంపీ స్థానం కేటాయించారు. ఈయన నిజానికి వైఎస్సార్ జిల్లా వ్యక్తి. ఎక్కడో రాయలసీమ నుంచి ఉత్తరాంధ్రకు వలస నేతను దిగుమతి చేయాల్సిన ఖర్మ ఏంటని 20–30 ఏళ్లుగా పార్టీలోనే కొనసాగుతున్న వారు

మిగతా 3వ పేజీలో ►



అరకు అందాలను వీక్షిస్తున్న అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి



అరకు అందాలకు 'అమెరికా' ఫిదా

- తూర్పు కనుమల్లో పర్యటించిన అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి తదితరులు
- విశాఖ తీరంలో రెండు వారాలపాటు భారత్–అమెరికా సైనిక విన్యాసాలు
- ఈ నెల 18 నుంచి కొనసాగుతున్న త్రివిధ దళ విన్యాసాలు

14లో

ఇదండీ బాత్



తనకి పడని రంగులు పోశాడట!



ఆపరేషన్ సందర్భంగా ఆస్పత్రిలో మహమ్మద్. చిత్రంలో తల్లిదండ్రులు, వైద్యులు(ఫైల్)



ఆపరేషన్ అనంతరం మహమ్మద్

నిరుపేద కుటుంబంలో వెలుగులు

తొమ్మిదేళ్ల మహమ్మద్‌కు కొత్త జీవితాన్ని ప్రసాదించిన సీఎం జగన్

- పాఠశాలలో ప్రమాదవశాత్తు కిందపడి పూర్తిగా చితికిపోయిన బాలుడి స్వరపేటిక, శ్వాసనాళం.. అరుదైన శస్త్ర చికిత్సకు రూ.6 లక్షలకు పైగా ఖర్చు
- ఇటుక బట్టీలో కూలి పనులు చేసుకునే ఆ కుటుంబానికి స్తోమతకు మించిన భారం
- అరుదైన శస్త్రచికిత్సకు పూర్తి ఖర్చులు భరించిన రాష్ట్ర ప్రభుత్వం
- మరో శస్త్ర చికిత్సతో త్వరలో మాటలు వస్తాయన్న వైద్యులు

- వివరాలు 5లో



కంగనా, నవీన్ జిందాల్‌కు బీజేపీ టికెట్లు

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మరో 111 మంది అభ్యర్థులతో బీజేపీ ఆదివారం ఐదో జాబితా విడుదల చేసింది. కేంద్ర మంత్రి అశ్వినీకుమార్ చౌబే, ఎంపీ వరుణ్ గాంధీకి ఈసారి టికెట్లు నిరాకరించింది. బాలీవుడ్ నటి కంగనా రనౌత్ అభ్యర్థిత్వం ఖరారయ్యింది. ఆమె హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీ నుంచి బరిలోకి దిగారు. ఆదివారమే బీజేపీలో చేరిన కాంగ్రెస్ మాజీ ఎంపీ నవీన్ జిందాల్ హరియాణాలోని కురుక్షేత్ర నుంచి పోటీ చేయబోతున్నారు.

6లో

కుల బంధంతోనే బాబుకు జేపీ భజన

మేధావి ముసుగులో కుల కుటిలత్వం

- చంద్రబాబు కోసమే జయప్రకాశ్ నారాయణ్ అసత్య ప్రచారం
- కూటమికి ఆయన వంత పాడడం దారుణం
- రంగాను చంపించిన వ్యక్తులతో కాపులు వెళ్లొద్దు
- ఏపీ చలనచిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పోసాని కృష్ణమురళి

సాక్షి, అమరావతి: మేధావి ముసుగులో జయప్రకాశ్ నారాయణ్ కుల కుటిలత్వాన్ని ప్రదర్శిస్తున్నారని ఏపీ చలన చిత్రాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పోసాని కృష్ణమురళి మండిపడ్డారు. ఐదేళ్లు అధికారం ఇస్తే చంద్రబాబు ఏపీని సర్వనాశనం చేశారన్నారు. ఈ నిజం తెలిసినా.. అంగీకరించేందుకు జేపీకి కుల బంధం అడ్డొస్తోందని.. అందుకే ఆయన బాబుకు భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇదంతా ఎన్నికల ముందు జేపీతో చంద్రబాబు ఆడిస్తున్న డ్రామాగా అభివర్ణించారు. హైదరాబాద్‌లో

మిగతా 14వ పేజీలో ►



క్లుప్తంగా...

మంగళగిరిలో టీడీపీ 'కోడ్' ఉల్లంఘన

- ఓటర్లకు తోపుడు బండ్లు, బల్ల రిక్షాలు, కుట్టు మిషన్ల పంపిణీ
- ఓ ప్రదేశంలో వాటిని నిలిపి.. ఓటర్లే వాటిని తీసుకెళ్లేలా ఒత్తిడి

మంగళగిరి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కుమారుడు నారా లోకేశ్ పోటీ చేస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో ఆ పార్టీ కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతోంది. ఓటర్లకు తాయిలాల రూపంలో బల్ల రిక్షాలు, తోపుడు బండ్లు, కుట్టు మిషన్‌లను పంపిణీ చేస్తోంది. ఈ పంపిణీ తతంగంపై అధికారులకు అనుమానం రాకుండా టీడీపీ నాయకులు వినూత్న పద్ధతిని అనుసరిస్తున్నారు. తయారు చేయించిన బల్ల రిక్షాలు, తోపుడు బండ్లను ఏదో ఒక ప్రాంతంలో ఉంచుతారు. ఆ ప్రాంతాన్ని ఓటర్లకు చెప్పి అక్కడకు వెళ్లి వాటిని తీసుకెళ్లాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో పలువురు ఓటర్లు బండ్లు ఉన్న ప్రాంతానికి వెళ్లి వాటిని తీసుకెళుతున్నారు. కుట్టుమిషన్లను టీడీపీ కార్యకర్తలే బైక్‌లపై పెట్టుకుని ఓటర్ల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తుండటం విశేషం. ఎన్నికల అధికారులు మరింత నిఘా పెంచి టీడీపీ ప్రలోభాలపర్వాన్ని అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అనుమతి లేకుండా టీడీపీ కార్యాలయం ఏర్పాటు

- అడ్డుకున్న పోలీసులతో విశాఖ ఎంపీ అభ్యర్థి భరత్ వాగ్వాదం




కార్యాలయంలోకి ప్రవేశించకుండా మోహరించిన పోలీసులు

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు టీడీపీ నేతలు యత్నించారు. అక్కడికి వచ్చిన పోలీసులపై తెలుగు తమ్ముళ్లు వాగ్వాదానికి దిగారు. ఎన్నికల నేపథ్యంలో టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి భరత్ తన క్యాంపు కార్యాలయాన్ని ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులో ఏర్పాటు చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవానికి పోలీసుల అనుమతి తీసుకోవాల్సి ఉంది. అయితే ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఆదివారం ఉదయం 10.30 గంటలకు కార్యాలయాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పార్టీ శ్రేణులకు, మీడియా ప్రతినిధులకు సైతం ఆహ్వానాలు పంపారు. ఈ విషయం తెలుసుకున్న ఎంవీపీ పోలీసులు అక్కడికి చేరుకుని అనుమతులు లేకుండా ఇలాంటి కార్యక్రమాలు చేస్తే కేసులను ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. దీంతో భరత్, టీడీపీ శ్రేణులు పోలీసులపై వాగ్వాదానికి దిగారు. అనంతరం అక్కడికి భారీగా పోలీసు బలగాలు తరలిరావడంతో భరత్‌తో పాటు అతని అనుచరులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

27 నుంచి చంద్రబాబు ఎన్నికల ప్రచారం

- 'ప్రజాగళం' పేరుతో సన్నాహాలు



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు ఈ నెల 27వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ప్రజాగళం పేరుతో నిర్వహించే ఈ ప్రచారంలో బహిరంగ సభలు, రోడ్‌షోలు నిర్వహిస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి. రోజుకు 3 నుంచి 4 నియోజకవర్గాల్లో ఆయన పర్యటిస్తారని పేర్కొన్నాయి. 27న చిత్తూరు జిల్లాలో పర్యటన ప్రారంభం కానుంది. 31వ తేదీ వరకు పర్యటనలు ఖరారయ్యాయి. 27న పలమనేరు, నగరి, నెల్లూరు రూరల్‌లో ప్రచారం నిర్వహించనున్నారు. 28న రాప్తాడు, శింగనమల, కదిరి, 29న శ్రీశైలం, నందికొట్కూరు, కర్నూలు, 30న మైదుకూరు, ప్రొద్దుటూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, 31న కావలి, మార్కాపురం, సంతనూతలపాడు, ఒంగోలులో చంద్రబాబు ప్రచారం చేస్తారని టీడీపీ వర్గాలు వివరించాయి.

'పార్టీ' లేదా పుష్పా?

▶ మొదటి పేజీ తరువాయి



ప్రశ్నిస్తున్నారు. అలాగే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, చంద్రబాబుకు వదిన అయిన పురందేశ్వరి కూడా 2014లో కేంద్రంలో కాంగ్రెస్ పరాజయం పాలయ్యాక బీజేపీలోకి వచ్చిన వ్యక్తే. ఈమెకు రాజమహేంద్రవరం టికెట్ దక్కింది. అలాగే, రాజంపేట టికెట్ దక్కిన మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఈమధ్యే బీజేపీలో చేరారు. అరకు అభ్యర్థి కొత్తపల్లి గీత అయితే గతంలో వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపీగా గెలిచి పార్టీ ఫిరాయించారు. ఆ తర్వాత ఆమె జనజాగృతి పేరుతో సొంత పార్టీ పెట్టుకుని అనంతరం దానిని బీజేపీలో విలీనం చేశారు. ఇక గూడూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే వరప్రసాద్ అయితే బీజేపీ కండువా కప్పుకున్న రోజే పార్టీ ఆయనకు తిరుపతి టికెట్ కేటాయించింది. ఇలా.. ఒక్క నరసాపురం అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ మినహా మిగిలిన అందరూ వలస నేతలకే టికెట్లు దక్కాయి. ఎక్కువగా తన మనుషులకే టికెట్లు వచ్చేలా చంద్రబాబు చక్రం తిప్పారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. దీంతో పొత్తులున్నా.. లేకున్నా ఈ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీచేసేందుకు రెండు మూడేళ్లుగా ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలు చేసుకుంటూ పోతున్న జీవీఎల్, సోము వీర్రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి వంటి బీజేపీ సీనియర్లు ఎంపీ అభ్యర్థుల జాబితా చూసి తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. ఇక నిన్నటివరకూ కనీసం పార్టీ సభ్యత్వం కూడా లేని తిరుపతి జిల్లా గూడూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే వరప్రసాద్‌కు ఒక్కసారిగా తిరుపతి లోక్‌సభ సీటు దక్కడం వారిని తీవ్ర ఆశ్చర్యానికి గురిచేయడమే కాక పార్టీలో ఈ విషయం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

బాబు, పవన్ చుట్టూ వరప్రసాద్ చక్కర్లు

వాస్తవానికి.. వరప్రసాద్‌కు ఈసారి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ టికెట్ ఇవ్వకపోవడంతో గత కొంతకాలంగా ఆయన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చుట్టూ తిరుగుతున్నారు. 20 రోజుల క్రితం బీజేపీ, టీడీపీ, జనసేన మధ్య పొత్తు కుదరక ముందు తిరుపతి లోక్‌సభ సీటును జనసేనకు కేటాయించాలని భావిస్తున్న సమయంలో చంద్రబాబు సూచన మేరకు వరప్రసాద్ నెలరోజుల క్రితమే మంగళగిరి జనసేన కార్యాలయంలో పవన్‌ను కలిశారు. ఆ తర్వాత.. పొత్తులో బీజేపీ కూడా చేరడంతో తిరుపతి లోకసభ సీటు బీజేపీ కోటాలోకి వెళ్లింది. దీంతో చంద్రబాబు డైరెక్షన్‌లోనే వరప్రసాద్ మళ్లీ బీజేపీ చుట్టూ తిరగడం మొదలుపెట్టినట్లు కమలనాథులు చర్చించుకుంటున్నారు. ఇందులో భాగంగానే.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఐదారు రోజులుగా ఢిల్లీలో వరప్రసాద్‌ను వెంటబెట్టుకుని కొందరు జాతీయ పెద్దల వద్ద లాబీయింగ్ చేసినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఆమె ప్రతిపాదన మేరకే బీజేపీ జాతీయ నాయకత్వం వరప్రసాద్‌కు బీజేపీలో చేరక మునుపే తిరుపతి లోక్‌సభ సీటు కేటాయించిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

బీజేపీలో చేరేందుకు బద్వేలు అభ్యర్థి 'నో'..

పొత్తులో బీజేపీకి కేటాయించిన పది అసెంబ్లీ స్థానాల్లో బద్వేలు నియోజకవర్గం కూడా ఒకటి. ఈ స్థానంలో బీజేపీకి సరైన అభ్యర్థి కూడా లేనందున ఆ సీటును బలవంతంగా బీజేపీకి అంటగట్టారని మొదటి నుంచి పార్టీలో ఉన్న బీజేపీ సీనియర్ నేతలు చెబుతున్నారు. ఆ సీటులో బీజేపీ తరఫున పోటీచేసేందుకు పురందేశ్వరి ముగ్గురు పేర్లను జాతీయ నాయకత్వానికి ప్రతిపాదించారని.. ఆ ముగ్గురూ ఇప్పటిదాకా పార్టీలో చేరని వారేనని వారంటున్నారు. ఇప్పుడు ఆ ముగ్గురిలో ఒకరైన రోశన్న పేరుకు ఢిల్లీ పెద్దలు ఆమోదం తెలిపారు. దీంతో రోశన్నను బీజేపీలో చేర్చేందుకు పార్టీ రాష్ట్ర నేతలు, జిల్లా నాయకులు ఆదివారం ప్రయత్నించగా, ఆయన అందుకు విముఖత చూపారని పార్టీలో చర్చ జరుగుతోంది. దీంతో ఈ సీటు వ్యవహారాన్ని కొద్దిరోజులు వాయిదా వేయాలని భావిస్తున్నారు.

సీనియర్ల ఆగ్రహావేశాలు..

పొత్తు ఉన్నా, లేకపోయినా పార్టీ తరఫున పోటీచేసేందుకు 30 ఏళ్లుగా పార్టీలో ఉన్న చాలామంది ఆసక్తి వ్యక్తంచేశారని.. అలాంటప్పుడు పార్టీకి మంచి అభ్యర్థులున్న నియోజకవర్గాలే కేటాయించాలని పట్టుబట్టి ఉండొచ్చు కదా అని పలువురు సీనియర్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. కానీ, చంద్రబాబు ఇస్తామన్న నియోజకవర్గాలను ఒప్పుకుని, ఇప్పుడా స్థానాల్లో పార్టీ సభ్యత్వంలేని వారికి సీట్లు కేటాయిస్తే, ఏళ్ల తరబడి పార్టీనే నమ్ముకున్న నాయకుల పరిస్థితి, పార్టీ పరువు ఏం కావాలని పార్టీ హార్డ్‌కోర్ సీనియర్లు రగిలిపోతున్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థులు వీరే

బీజేపీ ఎంపీ అభ్యర్థులు..	
అరకు	కొత్తపల్లి గీత
అనకాపల్లి	సీఎం రమేష్
రాజమహేంద్రవరం	పురందేశ్వరి
నరసాపురం	భూపతిరాజు శ్రీనివాసవర్మ
రాజంపేట	ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి
తిరుపతి	వరప్రసాద్

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో బీజేపీ పోటీచేసే లోక్‌సభ అభ్యర్థులను ఆ పార్టీ అధిష్టానం ఆదివారం రాత్రి ప్రకటించింది. తెలుగుదేశం, జనసేన పొత్తులో భాగంగా బీజేపీకి మొత్తం ఆరు లోక్‌సభ, 10 అసెంబ్లీ స్థానాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పార్టీ తరఫున లోక్‌సభకు పోటీచేసే అభ్యర్థుల పేర్లను బీజేపీ వెల్లడించింది.

విజయవాడ 'పశ్చిమ'కు సుజనాచౌదరి?

మరోవైపు.. అసెంబ్లీకి పోటీచేసే బీజేపీ అభ్యర్థుల పేర్లు కూడా ఖరారైనప్పటికీ వాటిని ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గానికి అనూహ్యంగా కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరి పేరు ఖరారైనట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే, కైకలూరు నుంచి కామినేని శ్రీనివాస్, విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం నుంచి విష్ణుకుమార్‌రాజు, ధర్మవరంలో సత్యకుమార్, జమ్ములమడుగు నుంచి ఆదినారాయణరెడ్డి పేర్లు కూడా దాదాపు ఖరారు అయినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఆ బాక్సుల నిండా ఫైళ్లు!

అనుమానాస్పదంగా 'సంధ్య' బస్సు

- పోలీసుల తనిఖీ.. అట్టపెట్టెలుగా నిర్ధారణ
- సీబీఐ అధికారులకు నివేదిస్తామన్న పోలీసులు



బస్సులో అట్ట పెట్టెల్లో ఉన్న ఫైళ్లు

పిఠాపురం: మూడు రోజులుగా కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం కొత్త మూలపేట ఎస్ఈజెడ్ కాలనీలో నిలిపివేసిన సంధ్యా ఆక్వా కంపెనీకి చెందిన బస్సు అనుమానాస్పదంగా కనిపించడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కొత్తపల్లి ఎస్ఐ స్వామినాయుడు సంధ్యా ఆక్వా కంపెనీ ప్రతినిధులను విచారించగా బస్సు బ్రేక్ డౌన్ కావడంతో అక్కడ నిలిపి ఉంచినట్లు చెప్పారు. బస్సులోని అట్ట పెట్టెల్లో పలు ఫైళ్ల కట్టలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అనుమానాస్పద వస్తువులేవీ కనిపించలేదని, ఈ అంశాన్ని దర్యాప్తు చేస్తున్న సీబీఐకి తెలియజేస్తామని ఎస్ఐ చెప్పారు. తనిఖీల అనంతరం బస్సును ఆక్వా కంపెనీలోకి తరలించారు.

'సంధ్య' నిర్వాకాలతో ఎగుమతులకు దెబ్బ

▶ మొదటి పేజీ తరువాయి

ప్రత్యామ్నాయ ఇంటి స్థలాలు ఇస్తామన్న మాటను ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. దేశ అభివృద్ధి కోసం విశాఖ పోర్ట్ యాజమాన్యానికి భూములిస్తే వారు ప్రైవేటు వ్యక్తులకు కంటైనర్ టెర్మినల్ నిర్మాణానికి భూములు అప్పగించారన్నారు. కంటైనర్ టెర్మినల్‌లో ప్రైవేట్ సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ భద్రత ప్రమాణాలు పాటించకపోవడంతో అంతర్జాతీయ స్మగ్లర్లు అక్రమ వ్యాపారాలకు విశాఖను ఎంచుకుంటున్నారన్నారు. దీనివల్ల విశాఖ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తినడమే కాకుండా మత్స్య ఎగుమతులపై ప్రభావం చూపుతుందన్నారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన దేశాలు భారత మత్స్య పరిశ్రమకు రాయితీలు, ప్రోత్సాహకాలు రద్దు చేయాలని నిర్ణయించడం ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ యాజమాన్యం నిర్వాకాలతో మత్స్య పరిశ్రమ, మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. సంధ్యా ఆక్వా సంస్థతో పాటు విశాఖ కంటైనర్ టెర్మినల్, జేఎం బక్షి సంస్థలను దీనికి బాధ్యులుగా చేసి సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు కంటైనర్ దిగుమతులను విశాఖ పోర్ట్ అథారిటీ స్వయంగా పరిశీలించాలని కోరారు. దిగువ స్థాయి కస్టమ్స్ అధికారులు ప్రమేయం లేకుండా ఇదంతా జరగదని, వీసీటీపీఎల్, జేఎం భక్షి సంస్థలు ఇందుకు బాధ్యత వహించాలన్నారు. విశాఖకు దిగుమతి అవుతున్న ప్రతి కంటైనర్‌ను పూర్తిగా స్కానింగ్ చేసిన తర్వాత దేశంలోకి అనుమతించాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు దూడపోలయ్య, గుంటు దానయ్య, వాసుపల్లి రాజు పాల్గొన్నారు.

విశాఖ డ్రగ్స్ వ్యవహారం చంద్రబాబు వర్గీయులదే

- ఆయనపై మోదీకి నమ్మకం లేదు
- ఈ ఎన్నికల్లో టీడీపీకి 6 సీట్లకు మించి రావు
- ఓటమి భయంతోనే వికృత చేష్టలు, అసత్య ఆరోపణలు
- వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): విశాఖపట్నంలో వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ వ్యవహారంలో సంబంధం ఉన్న వ్యక్తులు టీడీపీ, చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వారేనని విచారణలో తేలిందని వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి చెప్పారు. నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్‌కు కంటైనర్‌లో మాదక ద్రవ్యాలు తీసుకొచ్చిందని.. ఈ విషయంలో తమ పార్టీ నేతలు, తనపై టీడీపీ అసత్య ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. ఎదుటివారిపై బురదజల్లి తప్పించుకోవాలనేదే చంద్రబాబు పాలసీ అని మండిపడ్డారు. డ్రగ్స్ దిగుమతి చేసుకున్న కంపెనీపై సీబీఐ విచారణ జరుగుతోందని చెప్పారు. టీడీపీతో పొత్తు పెట్టుకున్న ప్రధాని మోదీ సైతం బాబును నమ్మరన్నారు. మొక్కుబడిగా మాత్రమే పొత్తు పెట్టుకున్నారని చెప్పారు. పార్టీ పార్లమెంటరీ నేతగా ఏ దేశంలో ఎవరు అధికారంలోకి వచ్చినా వారిని అభినందిస్తూ తాను ట్వీట్ చేస్తానని, ఇందులో భాగంగానే బ్రెజిల్‌లో నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడికి ట్వీట్ చేశానని చెప్పారు. దాన్ని అనుకూలంగా చేసుకుని తనకు సంబంధాలు అంటగట్టి నిందారోపణలు చేయడం చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని చెప్పారు.

ఇతరులకూ అదే వర్తిస్తుంది చంద్రబాబూ!

1999లో చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో హైదరాబాద్‌లో దొంగనోట్ల వ్యవహారం వెలుగు చూసిందని, రామకృష్ణగౌడ్ అనే వ్యక్తి ప్రధాన నిందితుడని విజయసాయిరెడ్డి గుర్తు చేశారు. చంద్రబాబుతో నిందితుడు రామకృష్ణగౌడ్ దిగిన ఫొటోను అప్పట్లో పత్రికలు ప్రచురిస్తే.. తనతో చాలామంది ఫొటోలు దిగుతుంటారని, ఆ వ్యక్తి చేసిన వ్యవహారంతో తనకు సంబంధం లేదని ఆయన తప్పించుకున్న అంశాన్ని గుర్తు చేశారు. ఇదే విషయం ఇతరులకూ వర్తిస్తుందని చంద్రబాబు గుర్తించాలని సూచించారు. బ్రెజిల్‌లో భారతదేశ దౌత్యాధికారి పేరు చివర రెడ్డి ఉండటంతో ఆ వ్యవహారాన్ని తమ పార్టీకి అంటగడుతున్నారని మండిపడ్డారు. ఈ నియామకాలు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతాయనే విషయాన్ని ఆయన తెలుసుకోవాలని హితవు పలికారు.

టీడీపీ కూటమికి వచ్చేది 6 సీట్లే

ఈ ఎన్నికల్లో టీడీపీ కూటమికి 160 సీట్లు వస్తాయని చంద్రబాబు భ్రమపడుతున్నాడని, నిజానికి వారికి 6 సీట్లకు మించి రావని విజయసాయిరెడ్డి స్పష్టంచేశారు. చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలన్నారు. టీడీపీకి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థి దొరకలేదని, చివరకు వైఎస్సార్‌సీపీ నుంచి వెళ్లిన వ్యక్తికి టికెట్ కేటాయించడం ఆ పార్టీ దివాళాకోరు రాజకీయాలకు అద్దం పడుతోందని విమర్శించారు. ఓటమి భయంతో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఇతర చోటా నేతలు నైతిక విలువలను మర్చిపోయి, వీధి రౌడీల్లా చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. తమ పార్టీ నేతలు ప్రసన్నకుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ చేసినవి అసత్య ఆరోపణలు కావని, అవి వాస్తవాలన్నారు. విద్యతో వ్యాపారం చేసే నారాయణపై నగర ప్రజలకు నమ్మకం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్యాపింగ్ కేసులో రిమాండ్‌కు ముగ్గురు అధికారులు

- ముగిసిన ప్రణీత్‌రావు కస్టడీ..
- అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలతో కలిపి కోర్టు ఎదుట హాజరుపర్చిన సిట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో శనివారం అరెస్టు చేసిన అదనపు ఎస్పీలు నాయిని భుజంగరావు, మేకల తిరుపతన్నల తోపాటు కస్టడీ ముగిసిన డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావులను సిట్ అధికారులు ఆదివారం నాంపల్లి క్రిమినల్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి ప్రణీత్‌రావుకు బుధవారం వరకు, భుజంగరావు, తిరుపతన్నలకు ఏప్రిల్ 6వ తేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో.. వారిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. భుజంగరావు, తిరుపతన్నలను తమ కస్టడీకి ఇవ్వాల్సిందిగా కోరుతూ సిట్ అధికారులు కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేయనున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటివరకు తొమ్మిది మందికి సిట్ నోటీసులు జారీ చేసి, విచారణకు పిలిచింది. ఈ కేసులో ప్రధానాంశం ఫోన్ ట్యాపింగ్ కావడంతో 'టెలిగ్రాఫిక్ యాక్ట్'ను కూడా జోడించాలని అధికారులు నిర్ణయించారు.

ముగ్గురి కోసం లుక్ఔట్ సర్క్యులర్

పంజగుట్టలో నమోదైన ఈ ట్యాపింగ్ కేసులో శనివారం వరకు ప్రణీత్‌రావు మాత్రమే నిందితుడిగా ఉండేవారు. సిట్ దర్యాప్తు, ప్రణీత్‌రావు వెల్లడించిన అంశాల ఆధారంగా భుజంగరావు, తిరుపతన్నలను కూడా నిందితులుగా చేర్చినట్లు సిట్ కోర్టుకు తెలిపింది. వీరితోపాటు ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు, ఓ మీడియా సంస్థ అధిపతిని కూడా నిందితులుగా చేర్చినా.. విదేశాల్లో తలదాచుకున్నారు. దీంతో ఆ ముగ్గురి కోసం అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఓడరేవులకు అధికారులు లుక్ఔట్ సర్క్యులర్ (ఎల్ఓసీ) జారీ చేశారు.

వేసవి ప్రయాణానికి 'ఎదురుచూపులే'

వేసవి సెలవులకు అరకొర రైళ్లే ● అన్ని రైళ్లలో వందల్లో వెయిటింగ్ లిస్ట్

ఇప్పటివరకు ప్రత్యేక రైళ్లు ప్రకటించని దక్షిణమధ్య రైల్వే



సాక్షి, హైదరాబాద్ : వేసవి సెలవుల్లో పర్యాటక ప్రదేశాలకు, పుణ్యక్షేత్రాలకు వెళ్లాలనుకునే నగరవాసులకు ఈసారి ఎదురుచూపులు తప్పేలా లేవు. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే రెగ్యులర్ రైళ్లలోనే వెయిటింగ్ లిస్టు ఇప్పటికే వందల్లోకి చేరింది. సాధారణంగా ప్రతి ఏటా పిల్లలకు పరీక్షలు ముగియగానే ఇంటిల్లిపాది నచ్చిన ప్రదేశాలకు వెళ్తుంటారు. సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీ కూడా బాగానే ఉంటుంది. ఇందుకనుగుణంగా దక్షిణమధ్య రైల్వే వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసేది. హైదరాబాద్ నుంచి విశాఖ, తిరుపతి, బెంగళూరు, ఢిల్లీ, జైపూర్, పాట్నా తదితర ప్రాంతాలకు నగరవాసులు భారీగా తరలి వెళ్తుంటారు. టూర్లతో పాటు పెళ్లిళ్లు, వేడుకలకు రాకపోకలు సాగించే వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. మార్చి నుంచి జూన్ తొలివారం వరకు సాధారణ రోజుల్లో కంటే ప్రయాణికుల సంఖ్య రెట్టింపుస్థాయిలో ఉంటుంది. అయితే ఈసారి ఎన్నికలు కూడా తోడుకావడంతో ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా.

ఎన్నికల రద్దీ....

ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్తాన్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం లక్షలాది మంది నగరానికి వలస వచ్చారు. వీరిలో చాలామంది నిర్మాణ రంగంలో పని చేస్తున్నారు. వీరంతా ఈసారి ఎన్నికల కోసం సొంత ఊళ్లకు వెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే సికింద్రాబాద్–దానాపూర్, సికింద్రాబాద్–వారణాసి, సికింద్రాబాద్–పాట్నా తదితర రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. ఎన్నికల నాటికి ఈ రద్దీ మరింత పెరగనుంది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు ఇప్పటివరకు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయకపోవడం ప్రయాణికులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

వందల్లో వెయిటింగ్....

హైదరాబాద్ నుంచి విశాఖకు రాకపోకలు సాగించే అన్ని ప్రధాన రైళ్లలో వెయిటింగ్ లిస్టు భారీగా నమోదవుతోంది. అలాగే తిరుపతి,చెన్నై, బెంగళూరు, ముంబయి ఢిల్లీ, తదితర నగరాలకు రాకపోకలు సాగించే రైళ్లన్నీ నిండిపోయాయి. ప్రతీ ఏటా ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని మార్చి మొదటివారం నాటికే కనీసం 50 నుంచి 100 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేసేది. కానీ, గత కొంతకాలంగా ముందస్తుగా ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ప్రకటించడం లేదు. ప్రయాణికుల రద్దీ మేరకు అప్పటికప్పుడు రైళ్లను నడుపుతున్నారు. ఇక వివాహ వేడుకలకు, పర్యాటకానికి కేరాఫ్‌గా భావించే జైపూర్‌కు కూడా నగరవాసులు భారీగా తరలి వెళ్తుంటారు. కానీ హైదరాబాద్ నుంచి జైపూర్ వరకు డిమాండ్‌కు సరిపడా రైళ్లు అందుబాటులో లేవు. దీంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను వెదుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా రైల్వే అధికారులు మేల్కొని వేసవి రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అయోధ్య, ఆగ్రా వెళ్లాలనుకున్నాం...

''ఈ సారి అయోధ్యతో పాటు ఆగ్రా, ఢిల్లీ, తదితర ప్రాంతాల్లో పర్యటించాలనుకుంటున్నాం.కానీ ఏప్రిల్‌లో మేం బయల్దేరవలసిన తేదీల్లో వెయిటింగ్ జాబితా ఉంది. వెయిటింగ్ లిస్ట్‌లో టికెట్ బుక్ చేసుకుని చివరి నిమిషం వరకు ఎదురుచూడలేం. ఆర్థికంగా భారమే అయినా ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది.''

–ఆనంద్, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి

బాబు అవినీతి.. రాష్ట్రం అధోగతి!

- దేశ చరిత్రలో అతిపెద్ద అవినీతి సామ్రాజ్య సృష్టికర్త చంద్రబాబు
- 'మహా దోపిడీ' పుస్తక సమీక్షలో చంద్రబాబు నీతిబాహ్య చరిత్రపై మేధావుల ఆగ్రహం



పుస్తక సమీక్షలో పాల్గొన్న విజయబాబు, కృష్ణంరాజు తదితరులు

సాక్షి, అమరావతి: దేశ చరిత్రలో అతిపెద్ద అవినీతి సామ్రాజ్య సృష్టికర్త చంద్రబాబు అని సామాజిక, ఆర్థిక, న్యాయ విశ్లేషకులు ఆరోపించారు. గతంలో ముఖ్యమంత్రులుగా పని చేసిన జయలలిత, లాలూ ప్రసాద్ యాదవ్, ఓం ప్రకాశ్ చౌతాలా, మధు కోడా, అశోక్ గెహ్లాట్ అవినీతి కేసులతో పోలిస్తే చంద్రబాబు దోపిడీ ఊహకు కూడా అందదన్నారు. దేశంలో మరే ఇతర నాయకుడికి సాధ్యపడని విధంగా రూ.6.25లక్షల కోట్లు అవినీతి చేశారన్నారు. అందుకే సమాజాన్ని జాగృతం చేసే సంకల్పంతో 'మహా దోపిడీ' పుస్తకాన్ని ఆధారాలతో సహా ప్రజల్లోకి తీసుకొచ్చినట్టు చెప్పారు. రాజధాని పేరుతో గ్రాఫిక్స్ బొమ్మలు చూపించి రూ.లక్షల కోట్లు దోచేసిన టీడీపీ అండ్ కో.. ఇప్పుడు ఆ అవినీతి ఫలాలు అనుభవించాలని కూటములు కడుతున్నాయని మండిపడ్డారు. వీరికి అధికారం ఇస్తే రాష్ట్రం అధోగతేనని హెచ్చరించారు. అధికార భాష సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు రచించిన 'మహా దోపిడీ' పుస్తకంపై విస్తృత స్థాయి సమీక్ష విజయవాడలోని ఓ హోటల్‌లో మేధావి వర్గం ఆధ్వర్యంలో జరిగింది. అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నిజాలకు సమాధి కడుతున్న పచ్చమీడియా లోకంలో ఇలాంటి పుస్తకాల ద్వారానే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయన్నారు. మేధావి వర్గాలకు చెందిన వ్యక్తులు సైతం పెత్తందార్ల కనుసన్నల్లో, కులాల ప్రాపకంలో దిగజారి వ్యవహరిస్తున్నారని, ఏపీలో అభివృద్ధిని పొగిడిన నోటితోనే.. అవినీతి పాలకులే గొప్పవారంటూ కీర్తించడం సిగ్గుచేటని ఆరోపించారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు మాట్లాడుతూ చంద్రబాబు అవినీతి అతని చిన్నప్పటి నుంచే మొదలైందని డీజిల్ దొంగతనం, ఓ నాటకంలో పాత్ర కోసం శనగల మూట లంచంగా ఇవ్వడం తదితరాలను ఉదహరించారు. సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో రెండేళ్లు కరోనాతో యుద్ధం చేయాల్సి వచ్చిందని, అనంతరం మూడేళ్లలో ప్రతిపక్షాల కుటిల ఎత్తులు, ఎల్లో మీడియా విష ప్రచారాన్ని ఎదుర్కొంటూ సంక్షేమాంధ్రగా తీర్చిదిద్దడంలో విజయం సాధించారని చెప్పారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నిరుద్యోగం తగ్గుదల, ఉద్యోగ కల్పన, వ్యవసాయం, ఎగుమతులు, పరిశ్రమల వృద్ధి తదితరాలను గణాంకాలతో వివరించారు. పుస్తక రచయిత, అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయ్‌బాబు మాట్లాడుతూ అభివృద్ధి చేస్తాడని నమ్మి అధికారం చేతిలో పెడితే చంద్రబాబు అవినీతి సామ్రాజ్యాన్ని సృష్టించాడని అన్నారు. 'మహా దోపిడీ' పుస్తకంలో చంద్రబాబు అవినీతిని ఉదాహరణలతో చర్చించానని చెప్పారు. ఒక క్రిమినల్ చేసిన అవినీతిని పుస్తకంలో రాస్తే తనపై క్రిమినల్ కేసులు పెట్టాలని టీడీపీ అంటోందని, తనపై వ్యక్తిత్వ హననానికి పాల్పడుతోందని ఆరోపించారు. దర్యాప్తు సంస్థలు చంద్రబాబు అవినీతిని నిరూపిస్తే కోర్టులు విధించే శిక్షలు ఊహించలేమని, దమ్ముంటే టీడీపీ నాయకులు మహా దోపిడీపై చర్చకు రావాలని సవాల్ చేశారు. చంద్రబాబు అవినీతి చరిత్రలో పవన్ కళ్యాణ్‌కూ రెండు పేజీలున్నాయన్నారు. సీబీఐ కేసుల్లో ఉన్న వ్యక్తులు పవన్‌కళ్యాణ్‌కు ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో రూ.21 కోట్లు ఇవ్వడం కూడా అవినీతిలో భాగమేనని పేర్కొన్నారు. ఏపీ అడ్వొకేట్స్ ఫోరమ్ కన్వీనర్ బి.అశోక్‌కుమార్, న్యాయవాది ఎస్.జ్యోతి మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ డీబీటీ ద్వారా రూ.2.70లక్షల కోట్లు, నాన్ డీబీటీ ద్వారా 1.79లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు.



అన్ని గొప్ప ఆలోచనలూ నడుస్తున్నప్పుడు పురుడు పోసుకుంటాయి.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 25 మార్చి 2024

సంగీతంలో అపశ్రుతి

సంగీతంలో సప్తస్వరాలు ఉన్నాయి. పశుపక్ష్యాదుల ధ్వనుల నుంచి ఇవి పుట్టినట్లు ప్రతీతి. శ్రుతి లయలు స్వరాల గమనానికి దిశానిర్దేశం చేసి, సంగీతాన్ని మనోరంజకం చేస్తాయి. సంగీతానికి ఆధారభూతమైన సప్తస్వరాలైనా, శ్రుతిలయాదులైనా– అన్నీ ప్రకృతి నుంచి పుట్టినవే!

ప్రకృతికి కులమతాలు లేవు. ప్రకృతి నుంచి పుట్టిన సంగీతానికి కూడా కులమతాలు లేవు, సరిహద్దులు లేవు. చక్కని సంగీతానికి శ్రావ్యతే గీటురాయి. సంగీత కళను శాస్త్రబద్ధం చేసిన తొలి రోజుల్లో సంగీతానికి సంబంధించిన శాస్త్రీయ సంప్రదాయాలు కొన్ని ఏర్పడ్డాయి. తర్వాతి తరాలలో కొందరు సంగీత విద్వాంసులు పూర్వసంప్రదాయాలను, చాదస్తాలను తోసిపుచ్చి, తమదైన సృజనతో కొత్త ఒరవడికి నాంది పలికారు.

తొలినాళ్లలో ఏకరీతిలో ఉన్న భారతీయ సంగీతంలో పద్నాలుగో శతాబ్దం నాటికి విభజన ఏర్పడింది. భారతీయ సంగీతంలో హిందుస్తానీ సంగీతం, కర్ణాటక సంగీతం ప్రధాన శాఖలుగా ఏర్పడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా సంగీతంలో ఎన్ని శాఖలు ఉన్నా, అవన్నీ శైలీభేదాల వల్ల ఏర్పడినవి మాత్రమే! కర్ణాటక సంగీతానికి పురందరదాసు పితామహుడిగా పేరుగాంచారు. ఆయన తర్వాతి కాలంలో త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి 'కర్ణాటక సంగీత త్రిమూర్తులు'గా పేరుపొందారు. వీరందరూ ఎవరి స్థాయిలో వారు ప్రయోగాలు చేసిన వారే గాని, పూర్వ శాస్త్రగ్రంథాల్లోని పాఠాలకు కట్టుబడి, వాటినే తు.చ. తప్పకుండా వల్లెవేసిన వారు కాదు. వారంతా మడిగట్టుకుని పూర్వగ్రంథాల్లోని పద్ధతులకే పరిమితమై ఉన్నట్లయితే, ఈనాడు కర్ణాటక సంగీతం ఇంతటి ఉత్కృష్ట స్థాయికి చేరుకునేదే కాదు.

ముత్తుస్వామి దీక్షితార్ సాహసోపేతమైన ప్రయోగాలే చేశారు. ఈస్టిండియా కంపెనీ అధికారి కర్నల్ జేమ్స్ బ్రౌన్ ప్రోత్సాహంతో ఇంగ్లిష్ సంగీత బాణీలకు సంస్కృత రచనలు చేశారు. ఈస్టిండియా కంపెనీ బ్యాండ్ ఆర్కెస్ట్రాలో ఉపయోగించే వయొలిన్‌ను చూసి ముచ్చటపడి కర్ణాటక సంగీత కచేరీల్లోకి తీసుకువచ్చారు. ముత్తుస్వామి సోదరుడు బాలుస్వామి తొలిసారిగా కర్ణాటక సంగీత కచేరీలో వయొలిన్ వాయించారు. పాశ్చాత్య శైలిలో 'నోటు స్వరాలు' కూర్చి సంప్రదాయ కచేరీల్లో వినిపించడం ప్రారంభించారు. ముత్తుస్వామి దీక్షితార్ చేసిన ప్రయోగాలు ఆనాటి సంప్రదాయవాదులకు మింగుడుపడనివే! చాదస్తపు విమర్శలకు భయపడి ముత్తుస్వామి తన ప్రయోగాలను విరమించుకున్నట్లయితే, ఆయన అనామకంగానే కాలగర్భంలో కలిసిపోయేవారు.

ముత్తుస్వామి దీక్షితార్ తర్వాతికాలంలో కూడా కొందరు విద్వాంసులు క్లారినెట్, శాక్సాఫోన్, మాండొలిన్, గిటార్, వయోలా, పియానో వంటి పాశ్చాత్య వాద్యపరికరాలను కర్ణాటక సంగీత కచేరీలకు పరిచయం చేశారు. త్యాగరాజు కాలం నాటికి అప్పటి తంజావూరు సంస్థానంలో పాశ్చాత్య సంగీతానికి కూడా సమాదరణ ఉండేది. త్యాగరాజు రాజాశ్రయానికి దూరంగా తన సంగీత సాధన కొనసాగించినా, ఆయనపైనా పాశ్చాత్య సంగీత ప్రభావం లేకపోలేదు. త్యాగరాజు ఏటా వేసవిలో ఎక్కువగా తిరువయ్యారులో గడిపేవారు. అక్కడ ఉన్నప్పుడే ఆయన పాశ్చాత్య సంగీతాన్ని ఆస్వాదించారు. త్యాగరాజు ఆ తర్వాతి కాలంలో శంకరాభరణ రాగంలో కూర్చిన 'వరలీలా గానలోలా', 'సారస నేత్ర', సుపోషిణి రాగంలో కూర్చిన 'రమించు వారెవరురా' వంటి కొద్ది కీర్తనల్లో పాశ్చాత్య సంగీత ధోరణులు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

ప్రయోగాలు లేకుండా ఏ కళా, ఏ శాస్త్రమూ అభివృద్ధి చెందదు. మన కాలానికి చెందిన మంగళంపల్లి బాలమురళీకృష్ణ కూడా కర్ణాటక సంగీతంలో ఎన్నో ప్రయోగాలు చేసి శ్రోతలను మెప్పించారు. సంగీత సంప్రదాయం ప్రకారం ఆరోహణ అవరోహణలలో ఒక రాగానికి కనీసం ఐదేసి స్వరాలు ఉండాలి. ఆరోహణ అవరోహణలలో ఐదు కంటే తక్కువ స్వరాలను ఉపయోగించి ఆయన కొత్త రాగాలను సృష్టించారు.

నేటితరంలో టి.ఎం.కృష్ణ తనదైన శైలిలో సంగీతంలో ప్రయోగాలను కొనసాగిస్తున్నారు. సంప్రదాయ కచేరీ నమూనాలోనే మార్పులను తీసుకొచ్చారు. వర్ణాలు, కృతులు, తిల్లానాలు వంటి వాటితోనే సాగే కర్ణాటక సంగీత కచేరీల్లో టి.ఎం.కృష్ణ క్రైస్తవ గీతాలను, ఇస్లాం గీతాలను, తమిళ కవుల గేయాలను కూడా పాడటం ద్వారా కొత్త ఒరవడికి నాంది పలికారు. కచేరీల్లో టి.ఎం. కృష్ణ ఈ మార్పులను తెచ్చినప్పటి నుంచి మతతత్త్వవాదులు ఆయనపై విమర్శలు గుప్పిస్తూ వస్తున్నారు. టి.ఎం.కృష్ణ సంగీత రంగానికి మాత్రమే పరిమితం కాకుండా; దేశంలోని సామాజిక పరిణామాలపై ఎప్పటికప్పుడు స్పందించే తీరు, దళితవాడలకు వెళ్లి కచేరీలు చేస్తూ సంగీతాన్ని సామాన్యుల చెంతకు చేరుస్తున్న పద్ధతి కూడా వారికి కంటగింపుగా మారింది. ఇదివరకు టి.ఎం. కృష్ణకు రామన్ మెగసెసె అవార్డు వచ్చినప్పుడు రుసరుసలు వినిపించాయి. ఇటీవల ఆయనకు మ్యూజిక్ అకాడమీ 'సంగీత కళానిధి' అవార్డును ప్రకటించింది. దీనికి నిరసనగా గాయనీమణులు రంజని, గాయత్రి మ్యూజిక్ అకాడమీలో ఈసారి కచేరీ చేయబోమంటూ, అకాడమీ అధ్యక్షుడికి లేఖ రాశారు. మ్యూజిక్ అకాడమీ అధ్యక్షుడు ఎన్. మురళి ఆ లేఖకు ఇచ్చిన సమాధానంలో వారి తీరును తప్పుపట్టారు. టి.ఎం.కృష్ణపై అక్కసు వెళ్లగక్కుతున్న వారంతా ఆయన సంగీత సామర్థ్యాన్ని గురించి మాట్లాడకుండా, ఆయన సంప్రదాయాన్ని మంటగలిపేస్తున్నాడంటూ గగ్గోలు పెడుతుండటం గమనార్హం. రంజని, గాయత్రి వంటి వారి తీరు సంగీత ప్రపంచంలో ఒక అపశ్రుతి. అయితే, సంగీతం ఒక స్వరవాహిని. ఇలాంటి అపశ్రుతులను సవరించుకుంటూ తన ప్రవాహాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది.

ఇప్పుడు అవసరం ఏముంది?

కామెంట్



కరణ్ థాపర్

ఒడిశాలో ఎన్నికల స్నేహానికి బీజేపీ, బీజేడీ సిద్ధమవుతున్నాయా? పొత్తు కుదరలేదని తాజా వార్త. కాదు... కుదరవచ్చని ఊహాగానం. ఇప్పటికింకా పూర్తి స్పష్టత లేదు. దోస్తీ మాట నిజమే అయితే, ఒక ప్రశ్న ఉదయిస్తుంది! "అసలు ఈ రెండు పార్టీలూ కలవాల్సిన అవసరం ఏముంది?" రాష్ట్రంలో సర్కార్ ఏర్పాటుకై బీజేడీకి బీజేపీ అవసరం లేదు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి బీజేపీకి బీజేడీ అవసరం లేదు. మరి ఏ ప్రయోజనాలు ఆశించి మోదీ, పట్నాయక్‌లు స్నేహహస్తాలు చాస్తున్నారు. 2008 నాటి క్రైస్తవుల హత్యోదంతాల అనంతరం 2009లో బీజేపీతో తెగతెంపులు చేసుకున్న పట్నాయక్... పదిహేనేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు ఎందుకు ఆ పార్టీతో నెయ్యానికి చర్చలు జరిపారు? అడగవలసిన ప్రశ్నలెన్నో ఉన్నాయి!

గతాన్ని గుర్తు చేయటం రాజకీయ నాయకులకు ఇష్టం ఉండదు. అది వారికి "ఒక పరదేశం". ఎల్.పి.హార్ట్లీ చెప్పిన విధంగా, "వారు అక్కడ పనులను భిన్నంగా చేస్తారు". సరిగ్గా అలానే చేసే ఉద్దేశంతో నేనివాళ ఉన్నాను. భారతీయ జనతా పార్టీతో నవీన్ పట్నాయక్ కొత్తగా పొత్తు కుదుర్చుకోవాలని చూస్తున్నట్టు వినగానే పదిహేను సంవత్సరాల క్రితం ఆయన చెప్పిన మాటల్ని జ్ఞాపకం చేసుకోవాలని నాకు అనిపించింది. వాటిని మీకు గుర్తు చేసి, మీ సొంతంగా ఒక అభిప్రాయానికి వచ్చేందుకు మిమ్మల్ని వదిలేస్తాను.

2008లో కొంధమాల్‌లో జరిగిన క్రైస్తవుల దారుణ హత్యోదంతాల అనంతరం నేను నవీన్ పట్నాయక్‌ను ఇంటర్వ్యూ చేశాను. ఆ హత్యలు దేశాన్ని కుదిపి వేయటమే కాకుండా, పట్నాయక్ ప్రతిష్ఠను పదేపదే దెబ్బతీశాయి. తేరుకోవటానికి ఆయన తలకిందులుగా తపస్సు చేయవలసి వచ్చింది. "నా దేహంలోని ప్రతి అస్థికా మతంతో సంబంధం లేనిది. ఆ అస్థికల్లో ఏవైనా దెబ్బతిని ఉంటాయని నేను అనుకోను" – అని, లౌకికవాదిగా తనకై తను ఆయన ఒక ఉనికిని ఇచ్చుకున్నారు.

ఆరు నెలల తర్వాత, 2009 సార్వత్రిక ఎన్నికలకు ముందు, బీజేపీతో తనకున్న తొమ్మిదేళ్ల పొత్తును విచ్ఛిన్నం చేసుకున్నారు. అప్పుడు మళ్లీ నేను ఆయన్ని ఇంటర్వ్యూ చేశాను.

పట్నాయక్: "బీజేపీతో తెగతెంపులు చేసుకోవటం తప్పనిసరి అయింది. ఎందుకంటే, నా రాష్ట్రానికి వారినిక ఏమాత్రంగానైనా ఆరోగ్యకరమని నేను పరిగణించటం లేదు. కొంధమాల్ తర్వాత అది ప్రతి ఒక్కరికీ స్పష్టమై ఉంటుందని అనుకుంటున్నాను."

థాపర్: "కొంధమాల్ తర్వాత ఎలాంటి పరిస్థితుల్లోనూ బీజేపీతో కొనసాగలేమని మీరు చెబుతున్నారా?"

పట్నాయక్ : "కొనసాగటం చాలా చాలా కష్టంగా మారింది."

థాపర్: "అంటే కొంధమాల్ ఒక విధంగా మీ పొత్తు విచ్ఛిత్తికి కారణం అయిందనేనా?"

పట్నాయక్ : "నిజానికి, అంతే."

(ఈ సంభాషణ మరింతగా ముందుకు సాగింది. చెప్పాలంటే, అలా జరగాలన్న ఆసక్తి ఆయనలో కనిపించింది.)

థాపర్: కొంధమాల్ ఘటనలతో పట్టణ ప్రాంత మధ్య తరగతి ప్రజలు మిమ్మల్ని నరేంద్ర మోదీతో పోల్చడం ప్రారంభించారు. కొంతమంది మిమ్మల్ని రెండవ నరేంద్ర మోదీ అని కూడా అన్నారు. అది మిమ్మల్ని కలవరపరిచిందా? నొప్పించింది కూడానా?"



ప్రధాని నరేంద్ర మోదీ, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ (ఫైల్ ఫొటో)

పట్నాయక్: "నన్ను నేను ఎప్పుడూ కూడా వ్యక్తిగతంగా అలా చూసుకోలేదు. నేను ఎల్లవేళలా లౌకికవాద ధోరణిలోనే ఆలోచిస్తాను. నాది పూర్తిగా లౌకికవాద నేపథ్యం. కనుక నేను దానిని నాపై వచ్చిన సరైన ఆరోపణగా ఏనాడూ పరిగణించలేదు."

థాపర్: "దానర్థం... నరేంద్ర మోదీతో పోల్చడం మిమ్మల్ని బాగా గాయపరచేదిగా ఉండి ఉండాలి."

పట్నాయక్: "నా మీద అలాంటి ఆరోపణ వస్తుందని నేను అస్సలు నమ్మలేకపోయాను."

(కొంధమాల్ తర్వాత పట్నాయక్ బీజేపీని ఎలా చూశారన్నది స్పష్టం అయింది. అయితే ఆయన చెప్పాలనుకున్నది ఇంకా ఉండింది. అక్కడితో ముగించలేదు.)

థాపర్: "కొంధమాల్ తర్వాత నేను మిమ్మల్ని ఇంటర్వ్యూ చేసినప్పుడు మీ శరీరంలోని ప్రతి అస్థికా మత రహితమైనదేనని మీరు చెప్పారు. అది నిజమేనని... మీరిప్పుడు బీజేపీతో తెగతెంపులు చేసుకోవటమన్నది రుజువు చేస్తోందని మీరు చెప్పగలరా?"

పట్నాయక్: "మీరేమనుకుంటున్నారు కరణ్? నేనేమిటో మీకు ఎప్పటి నుండో తెలుసు."

థాపర్: "అది నిజమేనని రుజువు చేస్తోందని నేను చెప్పగలను."

పట్నాయక్: "థ్యాంక్యూ."

(మరొక ప్రశ్న అడగవలసిన అవసరం ఉందని నా ప్రవృత్తి చెప్పింది. అది ఆయనపై ముష్టిఘాతాన్ని విసిరింది.)

థాపర్: "ఆ పని (బీజేపీతో తెగతెంపులు) మీరు మనస్ఫూర్తిగా చేసినదే కదా?"

పట్నాయక్: "చివరికొచ్చేటప్పటికి ఎవరి నమ్మకాలపై వారు నిలబడతారు. కాదా చెప్పండి? ఎవరి నమ్మకాలపై వారు నిలబడి తీరాలి కూడా."

(అయిపోయింది – స్పష్టంగా, క్లుప్తంగా, నిశ్చయంగా పట్నాయక్ తనేమిటో చెప్పేశారు. ఆయన నమ్మకాలు తమను తాము పునరుద్ఘాటించుకున్నాయి. పాత పట్నాయక్ ప్రత్యక్షమయ్యారు. బీజేపీతో జతపడి ఉండటం అన్నదిక చరిత్రే.)

థాపర్: "తను నమ్మిన సిద్ధాంతాలపై నిలబడేందుకు నవీన్ పట్నాయక్‌కు తొమ్మిదేళ్లు పట్టిందని చాలామంది అంటారు. మిమ్మల్ని బాగా ఎరిగిన వారికి మీరు లౌకికవాదులు, ఉదారవాదులు, నవీనులు. నిజంగా మీరు బీజేపీతో పొత్తు పెట్టుకున్నారంటే, ఆ పొత్తు దీర్ఘకాలం సాగిందంటే వారికి ఆశ్చర్యంగా ఉంటుంది. మీ నమ్మికలు ఏమిటో మీరు కనుగొనడానికి ఎందుకు మీకంత ఎక్కువ సమయం పట్టింది?"

పట్నాయక్: "గత పన్నెండేళ్లలో బీజేపీకి అనేక లౌకికవాద పక్షాల పొత్తు ఉండటం మీరు చూసే ఉంటారు. మమతా బెనర్జీ లేదా హెగ్డే లేదా ఫరూఖ్ అబ్దుల్లా, చివరికి జార్జిఫెర్నాండెజ్, నితీశ్‌కుమార్. అనేక మిత్ర పక్షాలూ ఉండేవి. అంతేకాదు, ఒడిశాలో మన అదృష్టవశాత్తూ మొదటి ఎనిమిదేళ్లలో ఎలాంటి మతపరమైన సంఘటనలూ జరగలేదు. కొంధమాల్ జరగనంత వరకు మొత్తంగా పరిస్థితే మారలేదు."

ప్రస్తుతం ఒకే ఒక ప్రశ్న మిగిలింది. పరిస్థితి ఏం మారింది? బీజేపీతో తెగతెంపులు చేసుకుని, ఆ తర్వాత బాగా పని చేసిన పట్నాయక్ తిరిగి ఇప్పుడు వారి ఆలింగనం కోసం ఎందుకు వెనక్కు నడవాలని తపిస్తున్నారు? వారి అవసరం లేకుండానే ఆయన మళ్లీ గెలుస్తారు కదా!

అయితే విషయం అది కాదు. ఆయన తెగతెంపులు చేసుకున్న బీజేపీ ఎల్.కె. అద్వానీ నేతృత్వం లోనిది. ఆయనిప్పుడు తిరిగి వెళ్లాలని చూస్తున్నది నరేంద్ర మోదీ సారథ్యం లోనిది. నేను మరింతగా చెప్పాల్సిన అవసరం ఉందంటారా?

పట్నాయక్ మళ్లీ బీజేపీతో ఎందుకు పొత్తు కుదుర్చుకోవాలని అనుకున్నారో నాకెప్పటికైనా తెలుస్తుందా అని నా సందేహం. కానీ తను యూ–టర్న్ తీసుకోవటాన్ని ఆయన ఎలా సమర్థించుకుంటారో తెలుసుకోవాలన్న ఆసక్తి నాకు ఉంది. ఈలోగా మీదైన అభిప్రాయాలకు మీరు వచ్చేందుకు మిమ్మల్ని వదిలేస్తాను. బహుశా మీలో కొందరు... మీరూ నాలాగే ఊహించారని భావించే అవకాశం ఉంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సరైన విధానం



మాస్కో మీద తీవ్రవాద దాడికి పాల్పడిన వాళ్లనే కాదు, ఆ దాడికి నిధులు సమకూర్చినవాళ్లను కూడా శిక్షిస్తామని రష్యా ప్రభుత్వం ప్రకటించింది. ఇది నూటికి నూరు శాతం సరైన విధానం.

– ఎలీ డేవిడ్, పరిశోధకుడు

మరీ ఇక్కడుంటామా?



ప్రజాస్వామిక సూచీలో ఇండియా ర్యాంక్ 104. సైనిక పాలన ఉండి, అధ్యక్షుడిని హౌజ్ అరెస్ట్ చేసిన నైజర్ కంటే ఇది తక్కువ ర్యాంకు. సంతోష సూచీలో ఇండియా ర్యాంక్ 126. ఆర్థికంగా దివాళా తీసిన పాకిస్తాన్, సైనిక తిరుగుబాటు జరిగిన మయన్మార్ కంటే తక్కువ. పత్రికా స్వేచ్ఛలో ఇండియా ర్యాంకు 161. తాలిబన్ల అఫ్గానిస్తాన్‌ది 152. అందుకే మనకు సొంత రేటింగ్ వ్యవస్థలు కావాలి.

– పాల్కీ శర్మ, జర్నలిస్ట్

మళ్లీ వెనక్కి...



ముస్తఫా కెమాల్ (టర్కీ మొదటి అధ్యక్షుడు), నెహ్రూ(భారత తొలి ప్రధాని) తమ కాలానికంటే ముందున్నారు. మార్చడం సాధ్యంకాని జనాలను కూడా తమ మధ్యయుగం నాటి మైండ్‌సెట్ల నుంచి బయటపడేలా చేశారు. కానీ వారి తర్వాత వచ్చిన పాలకులు దాన్ని తిరగదిప్పారు. ఎంత విషాదం!

– డానిష్ ఖాన్, బయోకెమిస్ట్

మంచి అడుగు



అన్ని మదరసాలనూ మూసేసి, ప్రస్తుత విద్యార్థులను అధికారిక విద్యా వ్యవస్థలో కలపాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్రయాగరాజ్ హైకోర్టు ఆదేశించింది. ఇది స్వాగతించాల్సిన అడుగు. ముస్లిం సమాజం ఇప్పుడు శాస్త్రీయ విద్య ద్వారా పురోగతి సాధిస్తుంది.

– ఒమర్ ఘాజీ, రచయిత

అందుకే విమర్శ



హమాస్ కంటే ఎక్కువగా నేను (ఇజ్రాయెల్ ప్రధాని) నెతన్యాహూ, ఆయన ప్రభుత్వాన్ని ఎందుకు ఎక్కువగా విమర్శిస్తాను? ఎందుకంటే ఆయన ఒక రకంగా 'నా వాడు'! వాళ్లు కాదు!! మనది అనుకున్నది ఎక్కువగా బాధిస్తుంది, కోపం తెప్పిస్తుంది. దాని పట్ల మనకు ఎక్కువ బాధ్యత ఉంటుంది.

– ఎమీ దార్, ఇజ్రాయెల్ యాక్టివిస్ట్

రెండు నిజాలు



ఒక స్నేహితుడి నుంచి ఫోనొచ్చింది. గత దశాబ్దంలో ఇండియా నిజంగానే అభివృద్ధి చెందిందని అతడి నమ్మకం. అదే సమయంలో ఇక్కడ భవిష్యత్తు లేదు కాబట్టి తన పిల్లల్ని విదేశాలకు పంపాలనుకుంటున్నాడు.

– ఎ. సిద్ధు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఇన్ బాక్స్

క్షయ వ్యాధిని అంతం చేద్దాం!

క్షయ వేలాది సంవత్సరాలుగా మానవాళికి పెద్ద బెడదగా వుంది. ఈ పీడ మానవ చరిత్ర మొత్తంలో దాదాపు 100 కోట్ల మంది ప్రాణాలను తీసిందని ఒక అంచనా. క్షయ జబ్బు ఒక్కటే, మిగిలిన అన్ని రకాల అంటువ్యాధులూ కలిసి తీసుకునే మొత్తం ప్రాణాల కంటే ఎక్కువ ప్రాణాలను హరించింది. 2022లో ప్రపంచవ్యాప్తంగా 1 కోటీ ఆరు లక్షల మంది ఈ జబ్బుతో బాధపడ్డారు. ప్రపంచంలోని నాలుగింట ఒక వంతు అంటే, 200 కోట్ల మందికి ఈ వ్యాధిని కలుగచేసే మైకోబ్యాక్టీరియం ట్యూబర్ క్యులోసిస్ క్రిమి సోకినట్లు అంచనా. వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోయే పోషకాహార లోపం, డయాబెటిస్, హెచ్ఐవీ, వృద్ధాప్యం, డయాలసిస్, స్మోకింగ్, దీర్ఘవ్యాధులు, అవయవాల ట్రాన్స్ ప్లాంటేషన్, కొన్ని జబ్బుల చికిత్సకు వాడే స్టెరాయిడ్స్, కేన్సర్ తదితర కారణాల వల్ల క్షయ జబ్బు బారిన పడతారు. క్షయకు మందులు అందుబాటులోకి రాకముందే, 19వ శతాబ్దం నుండి పారిశ్రామికీకరణ జరుగుతూ ఉన్న అమెరికా, యూరప్ దేశాల్లో ఈ వ్యాధి తగ్గుముఖం పట్టింది. దీంతో మందుల కన్నా జీవన ప్రమాణాల మెరుగుదలతో ఈ వ్యాధిని అదుపు చేయగల మని గుర్తించారు. పేదరికం వల్ల సరైన గాలి, వెలుతురు లేని గదుల్లో ఎక్కువమంది నివసించాల్సి రావడం వంటి కారణాలతో క్షయ వ్యాధిగ్రస్థుల నుండి ఈ క్రిమి వేరొకరికి తేలికగా సోకుతుంది.

ఈ వ్యాధి శరీరంలోని ఏ భాగానికైనా సోకవచ్చు. ఊపిరితిత్తుల పొర (ప్లూరా), లింఫ్ నోడ్స్, ప్రేవులు, స్వర పేటిక (లారింక్స్), ఎముకలు, వెన్నెముక, మెదడు, చర్మం, ప్రత్యుత్పత్తి వ్యవస్థ మొదలైన వాటిలో దేనికైనా ఇది సోకే అవకాశముంది. దాదాపు 80 శాతం మేరకు రోగులలో ఈ వ్యాధి ఊపిరితిత్తులలో తలెత్తుతుంది. క్షయ వ్యాధిలోని అనేక రకాలలో ఊపిరితిత్తుల క్షయ, లారింజియల్ క్షయ మాత్రమే గాలి ద్వారా వ్యాప్తి చెందగలవు. ఊపిరితిత్తులలో కాకుండా వేరే చోట తలెత్తే క్షయ వ్యాధిని 'ఎక్స్‌ట్రా పల్మనరీ టీబీ'గా పిలుస్తారు. టీబీ వైద్యం ప్రారంభించిన ఒకటి రెండు వారాలలోనే ఈ క్రిమి ఇతరులకు సంక్రమించే అవకాశం తగ్గుతుంది. అనగా పేషెంట్స్ నాన్ ఇన్ఫెక్షస్‌గా మారతారు. లేటెంట్ టీబీ ఉన్న వారి నుండి ఈ క్రిమి ఇతరులకు సంక్రమించదు. కేవలం జబ్బుతో బాధపడుతున్న వారి నుండి మాత్రమే ఇతరులకు సంక్రమించ గలదు. హెచ్ఐవీ మూలంగా ప్రపంచ వ్యాప్తంగా క్షయ పరిస్థితులు విషమిస్తున్నాయి. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులలో 27 శాతం మంది క్షయ జబ్బుతోనే మరణిస్తున్నారు.

చాలా సందర్భాలలో టీబీ వ్యాధి నిర్ధారణ ఆలస్యం అవుతుంది. పేషెంట్స్‌లో సరైన అవగాహన లేక జ్వరం, దగ్గులకు దీర్ఘకాలం పాటు రకరకాల యాంటీబయాటిక్స్ వాడతారు. ఇంకా ఫార్మసీలలో దొరికే జ్వరం మాత్రలు, దగ్గు సిరప్‌లను వాడుతూ వైద్యులను కలవడానికి జాగు చేస్తారు. దాంతో క్షయ జబ్బుకు సకాలంలో వైద్యం అందక ప్రాణాపాయానికి దారి తీస్తుంది. ఎక్స్‌ట్రా పల్మనరీ క్షయలో జబ్బు నిర్ధారణ మరింత క్లిష్టతరం అవుతుంది. క్షయ కారక క్రిమి ప్రత్యేక లక్షణాల రీత్యా 6 నెలల నుండి ఒకటిన్నర సంవత్సరాల వరకు మందులు వాడాల్సి ఉంటుంది. ప్రతి ఏటా ఈ జబ్బును గురించి ప్రపంచ ప్రజలను జాగృత పరచడానికి మార్చి 24న 'ప్రపంచ టీబీ డే'గా నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం 'అవును... మనం క్షయను అంతం చేయగలం' నినాదంతో ఈ జబ్బు లక్షణాలు ఉన్నవారు తగిన వైద్య సహాయానికి ముందుకు వచ్చి ఆరోగ్యం పొందాలని నినదిస్తున్నారు.

– డా॥ యనమదల మురళీకృష్ణ, ఎం.డి., సాంక్రమిక వ్యాధుల నిపుణులు, కాకినాడ

రంగస్థల నాటకానికి రక్షాకంకణం

సందర్భం



సుధామ

సినీ'మాయే' – విస్తృతమై, 'నాటు నాటు' అంటూ నాటుకుంటున్న ఈ కాలాన నీటుగా, ఉదాత్త విలువల దీటుగా – నాటకం పట్ల సమాజంలో కళాభిరుచులకు ఆస్కారంగా, ఆదరాభిమానాలు పాదుకునేలా రంగస్థల నాటకానికి ప్రాపుగా ఒక కాపు కాస్తూ, కృషి చేస్తున్న సంస్థల్లో ఒకటి 'రసరంజని'. జీవధార కళగా రంగస్థల నాటకాన్ని పరివ్యాప్తం చేస్తూ, సొంత రిపర్టరీ నిర్వహణతో బాటు – ఎన్నో నాటక సమాజాలకు వెన్నుదన్నుగా నిలిచి ప్రోత్సహిస్తూ, మూడు దశాబ్దాలుగా నాటక రంగాభిమానుల మన్ననలు అందుకుంటున్న సంస్థ రసరంజని. 'వరల్డ్ థియేటర్ డే'ను మార్చి 27న జరుపుకొంటున్న సందర్భంగా రసరంజని 3 రోజులపాటు నాటకోత్సవాలు నిర్వహిస్తోంది.

పౌరాణిక నాటకాలు, చారిత్రకాలు, సాంఘిక నాటకాలు ఎన్నో సమాజాభివృద్ధిలో, సామాజిక చైతన్యంలో గణనీయమైన పాత్ర పోషించాయి. నాటక ప్రదర్శన అనగానే జనం ఒకప్పుడు తండోపతండాలుగా బండ్లు కట్టుకుని మరీ తరలి వెళ్లేవారు. ఆ రోజుల్లో సురభి వంటి నాటక సమాజాల కీర్తి సురభిళాలు పరివ్యాపితమై విరాజిల్లేవి. పాండవోద్యోగ విజయాలు, శ్రీకృష్ణరాయబారం వంటి పద్యనాటకాల లగాయితు కన్యాశుల్కం, వరవిక్రయం, చిల్లర దేవుళ్ళు ఇలా చెప్పుకుంటూపోతే అంతులేని పట్టికగా... జనాదరణ పొంది సమాజంపై ప్రభావం చూపిన రంగస్థల నాటకాలు ఎన్నో. ఈ తరానికి వాటిని (ప్ర)దర్శింపచేయడంలో 'రసరంజని' పాత్ర అవిస్మరణీయం.

నాటక రంగ అభివృద్ధి కోసం, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ నాటకం విస్తృతంగా ప్రదర్శింపబడాలనీ, నాటకం ప్రజల మధ్యకి వెళ్లాలనీ, నాటకం ద్వారా సమాజ చైతన్యం జరగాలనీ ముఖ్యంగా ఎన్ని ఇక్కట్లున్నా టిక్కెట్టు కొని నాటకం చూడడం అనే ఉత్తమాభిరుచిని జనం విడనాడకూడదనే సంకల్పంతో నేటికీ రంగస్థల నాటక ప్రదర్శనలకే కట్టుబడి 31 ఏళ్లుగా నెలనెలా రసరంజని నిర్వహిస్తున్న కార్యక్రమాలు నాటక రంగానికే తలమానికాలు.

'రసరంజని' 1993 మార్చి 8న నెలకొల్పబడింది. ఈ మూడు దశాబ్దాల ప్రయాణంలో దాదాపు 700 నాటకాలు, మూడు వేల అయిదువందల ప్రదర్శనలు – సంస్థ కళాకారులతోనే కాక అనేక నాటక సమాజాల వారితో ప్రదర్శించడమైంది.

సొంత రిపర్టరీ నెలకొల్పడం ద్వారా ఎందరో నటీనటులకు, రచయితలకు, దర్శకులకు, రంగస్థల సాంకేతిక నిపుణులకు శిక్షణ ఇచ్చి, తద్వారా వారు నాటకరంగంలో స్థిరపడి వన్నెవాసికెక్కడానికి రసరంజని దోహదపడింది. రంగస్థలంపై రసరంజని కథానాటక సప్తాహాలు, కథానాటక శరన్నవరాత్రులు, తెలుగు హాస్య నాటకోత్సవాలు, జాతీయ నాటక ప్రదర్శనలు, జాతీయ హిందీ నాటకోత్సవాలు వంటి కార్యక్రమాల ద్వారా ప్రదర్శనలు అందించి తనదైన ప్రత్యేకతను చాటుకుంది.



'ప్రపంచమే ఒక నాటక రంగం. ప్రతి ఒక్కరం పాత్ర ధారులమే!' దర్శకుడు వేరయినా, మనమే అయినా, జీవితం అనే తెర పడే వరకూ అంకాలు మారుతూ బ్రతుకు దృశ్యాలు ఘటనలూ, సంభాషణలూ వెలుగు నీడలతో వివిధ రసాలతో సాగుతూనే ఉంటాయి అనే మాట మనం వింటూ వస్తున్నదే !

అటువంటప్పుడు నాటకమే ప్రపంచంగా, సమాజహిత చింతనతో కృషి చేస్తున్న నాటకరంగ సంస్థలను సమాదరించడం జనకర్తవ్యం. వారు కోరుతున్నది నాటకం చూడమని! నాటకాన్ని సమాదరించడం అంటే జీవితాన్ని సమాదరించడమే! మనిషినీ, మానవతనూ సమాదరించడమే!

వ్యాసకర్త ఆకాశవాణి విశ్రాంత అధికారి

భక్తుడి ధర్మం

'అడగనిదే అమ్మయినా పెట్టదు!' అని తెలుగులో ఒక నానుడి ఉంది. నోరు తెరిచి చెప్పనిదే కన్న తల్లికైనా తన సంతానం ఆకలి బాధ తెలియదు అని ఆ నానుడి చెబుతుంది. నానుడులు లోకానుభవ ప్రతిబింబాలు! బాధ కలిగినపుడు నిశ్శబ్దంగా కుమిలిపోవడం వలన ఏమీ ప్రయోజనం ఉండదు అనే విషయాన్ని అందరికీ అర్థమయేలా చెప్పడానికే నిత్య జీవితంలో జరిగే సంఘటనల నుండి సార్వజనీనమైన ఒక అనుభవాన్ని ఉదాహరణగా తీసుకుని పై నానుడిని చెప్పారు పెద్దలు. మనిషి బాధలలో కొన్ని తీరడానికి



జ్యోతిర్మయం

తోటి మనిషి సహాయం మాత్రమే కాక, భగవంతుడి సహాయం తప్పక అవసరమయ్యే సందర్భాలు అప్పుడప్పుడూ కలుగుతుంటాయి. అటువంటి సందర్భాలలో తనకు కావలసినదేమిటో వినమ్రంగా విన్నవించుకోకుండా, భగవంతుడి నుండైనా సహాయాన్ని పొందడం సాధ్యపడేది కాదని 'కుచేలోపాఖ్యానం' కావ్యం ప్రథమాశ్వాసంలో, ఆ కావ్యకర్తయైన గట్టు ప్రభువు, రెండు చక్కని ఉదాహరణలతో ఒక మత్తేభ వృత్తంలోని పద్యంలో చెప్పాడు.

ఇరవొన క్రముచే మహాసురునిచే నేనుంగు ప్రహ్లాదుడుం
బరితాపించుచు వేదగా గద పరబ్రహ్మంబు వేంచేసె ని
ట్లురు సంపూర్ణ దరిద్రులన్మనలగుయ్యో యన్న రక్షించు శ్రీ
హరి నిష్కాముల కేల యిచ్చు బహుళంబైనట్టి యైశ్వర్యముల్.

కుచేలుడు, శ్రీకృష్ణుడు బాల్యస్నేహితులు. పెరిగి పెద్దయ్యాక, విధి వశాన భరించలేని దారిద్ర్యంలో పడిన కుచేలుడు, భార్యా పిల్లలను పోషించుకోలేని స్థితిలో ఉంటాడు. అట్టి కుచేలుడికి దారిద్ర్యాన్నుండి బయటపడడానికి తరుణోపాయాన్ని అతడి భార్య ఉపదేశించే సన్నివేశంలోనిది పై పద్యం. 'మొసలి పట్టులో గజేంద్రుడు, హిరణ్యకశిపుని చేతిలో ప్రహ్లాదుడు ఎన్నో బాధలు పడుతూ, ఆ బాధలను తట్టుకోగలిగే స్థాయి దాటిపోవడంతో నిస్సహాయ స్థితికి చేరుకుని 'దేవుడా! నన్ను రక్షించు!' అని చేతులెత్తి నమస్కరించి వేడుకున్నప్పుడు మాత్రమే కదా శ్రీ మహావిష్ణువు వారిని ఆదుకోవడానికి అన్నీ వదిలి పరుగున వచ్చి కాపాడాడు. అలాగే ఘోరమైన దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న మనలను 'స్వామీ! కాపాడు!' అని ఆర్తితో వేడుకొంటే తప్పక రక్షిస్తాడు. అంతేగాని, ఏమీ అడగకుండా నిశ్శబ్దంగా కూర్చునే వారికి ఐశ్వర్యాన్ని, సౌఖ్యాన్ని శ్రీహరి ఎలా ప్రసాదిస్తాడు?' అని వివరించడం పై పద్యం భావం. కనుక, భగవంతుడి కరుణకు పాత్రులం కావాలంటే వినమ్రంగా వేడుకోవడం తప్పనిసరి!

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** పౌర్ణమి ఉ.11.34 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** ఉత్తర ఉ.9.58 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** రా.7.15 నుండి 8.59 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.31 నుండి 1.19 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.45 వరకు, **అమృతఘడియలు:** తె.5.51 నుండి 7.38 వరకు (తెల్లవారితే మంగళవారం); **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.04, **సూర్యాస్తమయం:** 6.07.

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఆయనే సీఎం కాకుంటే ఏమైపోయేవాళ్లమో..



మా ఆయన బాపట్ల జిల్లా చినగంజాం మండలం కొత్తపాలెంలో ప్రైవేటుగా కరెంటు పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. దురదృష్టవశాత్తూ చిన్న వయస్సులోనే ఆయన చనిపోవడంతో కుటుంబ పోషణ బాధ్యత నాపై పడింది. ఎలా బతకాలి, పిల్లలను ఎలా పోషించుకోవాలని భయపడుతుండేదాన్ని. ఆ సమయంలో అదృష్టవశాత్తూ వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. దాంతో నా సమస్యలకు పరిష్కారం లభించింది. నాకు వలంటీర్‌గా అవకాశం లభించింది. ఇద్దరు పిల్లల చదువుకోసం ఇబ్బంది పడకుండా ఒకరికి అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ. 15వేలు వంతున వచ్చింది. దాంతోపాటు వితంతు పింఛన్ కూడా మంజూరు కావడంతో నా జీవనానికి ఎలాంటి భయం లేకుండా పోయింది. స్వయం సహాయక గ్రూపుల ద్వారా తీసుకున్న రుణం మాఫీ కావడంతో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటి వరకూ దాదాపు రూ. 80వేల వరకూ వచ్చింది. జగనన్న కాలనీలో స్థలం మంజూరైంది. ఇక ఇల్లు కట్టుకోవాల్సి ఉంది. నాకు, నా కుటుంబానికి మేలు చేసిన జగనన్న రుణం ఎప్పటికీ తీర్చుకోలేం.

– పల్లెబోయిన అనుపమ, కొత్తపాలెం
(పల్లపోలు శ్రీనివాసరావు, విలేకరి, చినగంజాం)

అప్పు చేయకుండా కాలికి శస్త్రచికిత్స



మా ఆయన వ్యవసాయ కూలీ. మాది కృష్ణాజిల్లా గూడూరు. నాకు ఇద్దరు పిల్లలు. వారు చదువుకుంటున్నారు. నేను పామర్రు సమీపంలోని రొయ్యల కంపెనీలో కూలిపనులకు వెళ్తుంటాను. గతేడాది అక్టోబర్ 29న పనికి వెళ్లి వస్తుంటే రోడ్డు ప్రమాదం జరిగి రెండు కాళ్లు విరిగాయి. విజయవాడలోని ట్రస్ట్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేశారు. ఆరోగ్యశ్రీ లేకుంటే ప్రాణాలు కాపాడుకోవడానికి కనీసం నాలుగైదు లక్షల రూపాయలైనా అప్పు చేయాల్సి వచ్చేది. మా పాప యశస్వినికి అమ్మఒడి పథకం ద్వారా ఏడాదికి రూ. 15వేలు వంతున వచ్చింది. వైఎస్సార్ ఆసరా ద్వారా ఏడాదికి రూ.5 వేలు చొప్పున అందాయి. నేను పనికి వెళ్లలేకపోయినా మా బతుకులకు ఎలాంటి బెంగా లేదు. ఈ ప్రభుత్వమే లేకుంటే మా జీవితం ప్రశ్నార్థకమైపోయేది.

– సంకుల ఫణి, గూడూరు,
(ఎస్.గంగాధరరావు, విలేకరి, పెడన)

హాయిగా కుటుంబ జీవనం



మా ఆయన సత్యనారాయణ బాడుగకు ట్రాక్టర్ తిప్పుతారు. మా అబ్బాయి, కోడలు, మా అమ్మాయి అల్లుడు అందరం కలిసే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణం సమీపంలోని సావరంలో ఉంటున్నాం. మా అమ్మాయికి ఇద్దరు ఆడపిల్లలు. మా పెద్ద మనవరాలు డిగ్రీ చదువుతోంది. ఆమెకు జగనన్న విద్యా దీవెన వస్తోంది. చిన్న మనవరాలు ఇంటర్మీడియట్ చదువుతోంది. ఆమెకు జగనన్న అమ్మ ఒడికింద ఏడాదికి రూ. 15వేలు వంతున వస్తోంది. దానివల్ల పైసా ఖర్చు లేకుండా ఇద్దరి పిల్లల చదువులు అయిపోతున్నాయి. నాకు వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750లు వంతున అందగా, వైఎస్సార్ ఆసరా ద్వారా నాలుగేళ్లకు ఇప్పటి వరకూ రూ.75 వేలు, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా రూ.30 వేలు, జగనన్న తోడు ద్వారా రూ.10 వేలు అందుకున్నాను. మొత్తం మా కుటుంబానికి ఏదో పథకం అందుతుండటంతో జీవనం హాయిగా సాగిపోతోంది.

– పాము మేరీ రత్నం, సావరం (పరసా సుబ్బారావు, విలేకరి, అమలాపురం టౌన్)

నిరుపేద కుటుంబంలో వెలుగులు

తొమ్మిదేళ్ల మహమ్మద్‌కు కొత్త జీవితాన్ని ప్రసాదించిన సీఎం జగన్



తల్లి ఖాజాబీతో మహమ్మద్

సాక్షి, అమరావతి: నిరుపేద కుటుంబాన్ని పెద్దకష్టం చుట్టుముట్టింది. ఊహించని ప్రమాదంలో తొమ్మిదేళ్ల కుమారుడు తీవ్రంగా గాయపడి నోట మాట లేక, శ్వాసకూడా తీసుకోలేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. బాలుడి చికిత్సలకు రూ.లక్షల్లో ఖర్చవుతాయని వైద్యులు చెప్పడంతో అంత డబ్బును సమకూర్చలేని నిస్సహాయత వారిది. ఆపద సమయంలో సీఎం జగన్ ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు. బాలుడి చికిత్సకు ఎంత ఖర్చయినా ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇవ్వడమే కాకుండా.. ఖరీదైన చికిత్సను చేయించింది. ఆ నిరుపేద కుటుంబంలో వెలుగులు నింపింది.

స్వరపేటిక, శ్వాసనాళం చితికిపోయి..

పల్నాడు జిల్లా నకరికల్లులోని పాతూరుకు చెందిన షేక్ బాజీ, ఖాజాబీ ఇటుక బట్టీల్లో కూలీ పనులు చేసుకుంటుంటారు. వీరికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు తొమ్మిదేళ్ల అనాస్ మహమ్మద్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 29న పాఠశాల ఆవరణలో ఆడుకుంటూ కిందపడిపోయాడు. ప్రమాదంలో బాలుడి గొంతుకు ఇనుపరాడ్ బలంగా గుచ్చుకుపోయింది. స్వరపేటిక, శ్వాసనాళం పూర్తిగా చితికిపోయాయి. హుటాహుటిన నరసరావుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అవసరమని నిర్ధారించిన వైద్యులు అంబులెన్స్‌లో వెంటిలేటర్‌పై హైదరాబాద్ తరలించారు.

మానవతా దృక్పథంతో స్పందించిన సీఎం

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద 3,257 ప్రొసీజర్లతో లక్షలాది మంది బాధితులకు అండగా సీఎం జగన్ నిలిచారు. అక్కడితో ఆగకుండా ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని అరుదైన జబ్బుల బారినపడి రూ.లక్షలు, కోట్లలో వైద్యానికి ఖర్చయ్యే వారిని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నారు. ఈ క్రమంలోనే మహమ్మద్ విషయంలోనూ సీఎం జగన్ మానవతా దృక్పథంతో స్పందించారు. బాలుడి చికిత్సకు ఎంత ఖర్చయినా వెనుకాడొద్దని అధికారులను ఆదేశించారు. దీంతో సీఎంవో అధికారులు హైదరాబాద్‌లోని ఆస్పత్రి యాజమాన్యానికి ఫోన్‌చేసి బాలుడి శస్త్ర చికిత్సకయ్యే మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, వెంటనే శస్త్ర చికిత్సలు నిర్వహించాలని సూచించారు. దీంతో వైద్యులు అత్యంత క్లిష్టమైన లెరింగోట్రెకెల్ రీకన్‌స్ట్రక్షన్ శస్త్ర చికిత్సను చేపట్టారు. చికిత్స అనంతరం వైద్యుల పరిశీలన ముగించుకుని ఈ నెల 14న బాలుడు డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లాడు. మరో మూడు నెలల అనంతరం ఇంకొక సర్జరీ చేస్తే బాలుడు ముందులా మాట్లాడగలుగుతాడని వైద్యులు చెబుతున్నారు. ఆపద కాలంలో సీఎం జగన్ చేసిన మేలును ఎప్పటికీ మరువలేమని ఖాజాబీ దంపతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. తమ బిడ్డ తమకు దక్కుతాడో లేదోనని ఎంతో ఆందోళనకు గురయ్యామని భావోద్వేగానికి గురవుతున్నారు.

ఒక్క ట్వీట్‌తో స్పందించిన ప్రభుత్వం

దెబ్బతిన్న స్వరపేటిక, శ్వాసనాళానికి అత్యంత క్లిష్టమైన లెరింగోట్రెకెల్ రీకన్‌స్ట్రక్షన్ శస్త్రచికిత్స చేయాలని వైద్యులు నిర్ధారించారు. ఆ చికిత్స నిర్వహణ, వైద్య పరీక్షలు, మందులకు రూ.6 లక్షలకు పైగా ఖర్చవుతుందని చెప్పారు. రెక్కలు ముక్కలయ్యేలా కష్టం చేసే ఖాజాబీ దంపతులకు అంత పెద్ద మొత్తంలో అప్పు పుట్టని పరిస్థితి. వారి నిస్సహాయ స్థితిని చూసిన గ్రామస్తులంతా తలా కొంత ఇవ్వడానికి ముందుకొచ్చారు. అయినప్పటికీ.. చికిత్సకు సరిపోయేంత డబ్బు సమకూరకపోవడంతో మహమ్మద్‌ను ఆదుకోవాలంటూ ఓ డాక్టర్ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌పై ఏపీ సీఎంవో అధికారులు స్పందించారు. ఈ విషయాన్నివెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు.

దేవుడిలా ఆదుకున్నారు



రోజూ పనికెళ్లి కూలి డబ్బులతో జీవిస్తున్నాం. తెచ్చుకుంటే తినాలి.. లేదంటే పస్తులుండాలి. ఇది మా జీవితం. అలాంటి మాపై ఉపద్రవంలా పెద్ద కష్టం వచ్చిపడింది. వెంటిలేటర్‌పై బాబును చూసి మాకు దక్కుతాడో లేదోనని ఎంతో ఆందోళనకు గురయ్యాను. ఆపరేషన్‌కు రూ.6 లక్షలు ఖర్చవుతుందనగానే నా నోట మాట లేదు. అంత డబ్బు ఎక్కడి నుంచి తేవాలో కూడా దిక్కుతోచని పరిస్థితి. ఆ సమయంలో దేవుడిలా సీఎం జగన్ ఆదుకున్నారు. వైద్యానికి అయ్యే ఖర్చంతా భరిస్తామని చెప్పారు. ఈ రోజు మా బాబు సీఎం జగన్ దయవల్లే దక్కాడు. – షేక్ ఖాజాబీ, బాలుడి తల్లి

మా పిల్లల చదువులకు అండగా నిలిచారు



ఆ దేవుడు మా బిడ్డకు జన్మ ఇస్తే. సీఎం జగన్ పునర్జన్మ ఇచ్చారు. మా కుటుంబంలో వెలుగులు నింపారు. ఏమిచ్చినా ఆయన రుణం మేం తీర్చుకోలేం. అమ్మ ఒడి రూపంలో మా బిడ్డల చదువులకు చేదోడుగా ప్రభుత్వం నిలిచింది. పేదలందరికీ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం మాకు ఇంటిస్థలం కూడా మంజూరు చేసింది. – షేక్ బాజీ, బాలుడి తండ్రి

మాలల వ్యతిరేకి చంద్రబాబు

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు మంగరాజు



తణుకు అర్బన్: ప్రతిపక్ష నేత చంద్రబాబు మాలల వ్యతిరేకిగా మరోసారి నిరూపించుకున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు మండిపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సీట్ల కేటాయింపులో చంద్రబాబు మాలలకు పూర్తిగా అన్యాయం చేశారని దుయ్యబట్టారు. టీడీపీలో మొదటి నుంచి పార్టీ కోసం పని చేసిన మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, మాజీ మంత్రి పీతల సుజాత, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పనలకు సీట్లు కేటాయించకుండా అన్యాయం చేశారన్నారు. మహాసేన రాజేష్‌కు టికెట్ ఇచ్చినట్లు ఇచ్చి టీడీపీ, జనసేన కార్యకర్తలతో సోషల్ మీడియాలో వ్యతిరేకంగా పోస్టులు పెట్టించి రాజేష్‌ను పోటీ నుంచి తప్పించారని ఆరోపించారు. ఎస్సీల మధ్య చిచ్చు పెడుతూ చంద్రబాబు ఓటు బ్యాంకు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు.

వైఎస్సార్‌సీపీకి ఆజాద్ ముస్లిం కమిటీ మద్దతు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): వైఎస్సార్‌సీపీకి మద్దతునిస్తూ ఆజాద్ ముస్లిం కమిటీ (ఏఎంసీ) తీర్మానం చేసింది. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు నాగుల్‌మీరా మాట్లాడుతూ.. దేశంలో ముస్లింలను గుర్తించిన వారు ఎవరైనా ఉన్నారంటే దివంగత సీఎం వైఎస్సార్, ఆయన తనయుడు వైఎస్ జగన్ మాత్రమేనని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముస్లింలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు అనేక ఉన్నత పదవులను కేటాయించడం గొప్ప విషయమన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమాభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా పనిచేయాలని ఆజాద్ ముస్లిం కమిటీ నిర్ణయం తీసుకుందని వివరించారు.

కన్నుల పండువగా సత్యదేవుని రథోత్సవం



ఆలయ ప్రాకారంలో సాగుతున్న రథోత్సవం

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి రథోత్సవం సేవ ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు రథాన్ని తూర్పు రాజగోపురం ముందుకు తీసుకుని వచ్చి సత్యదేవుడు, అమ్మవార్లను వేంచేయించారు. ప్రత్యేక పూజల అనంతరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, బాజాభజంత్రీల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా ఆలయ ప్రాకారంలో రథంతో మూడు సార్లు ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం పండితులు పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను మేళతాళాల మధ్య ఆలయానికి తీసుకుని వెళ్లారు. ఈ ఆదివారం నుంచి రథోత్సవ సేవను ఆర్జిత సేవగా మార్చి, టికెట్ ధర రూ.2,500గా నిర్ణయించారు. ఆరుగురు భక్తులు ఈ టికెట్లు కొనుగోలు చేసి కుటుంబ సభ్యులతో కలిసి ఈ సేవలో పాల్గొన్నారు. వారికి స్వామివారి అంతరాలయ దర్శనంతో పాటు వేదాశీస్సులు, స్వామివారి కండువా, జాకెట్ ముక్క, ప్రసాదం అందజేశారు.

మోపిదేవిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ భట్టీకి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఏసీ చక్రధరరావు

మోపిదేవి(అవనిగడ్డ): కృష్ణాజిల్లా మోపిదేవిలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వెంకట నారాయణ భట్టీ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగ తం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన జస్టిస్ భట్టీ పుట్టలో పాలుపోసి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. వేదపండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా, ఆలయ ఏసీ ఎస్.ఎస్.చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. ఆయన వెంట జిల్లా కోర్టు న్యాయమూర్తి అరుణ సారిక, అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ పాల్గొన్నారు.

ఎంపీ మాధవి కుమార్తెకు ధాన్య శ్రేయస్కగా నామకరణం



ఎర్రగొండమ్మ తల్లి ఆలయం వద్ద కుమార్తెతో ఎంపీ మాధవి దంపతులు, బంధువులు

కొయ్యూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): అరకు ఎంపీ మాధవి, శివప్రసాద్ దంపతుల కుమార్తెకు ధాన్య శ్రేయస్కగా ఆదివారం నామకరణం చేశారు. గత నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పాపకు నామకరణం చేయించిన విషయం తెలిసిందే. అప్పుడు ఆయన పెట్టిన పేరును శరభన్నపాలెంలో నిర్వహించిన బారసాలలో ఎంపీ దంపతులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముందు ఎర్రగొండమ్మ తల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో 400 మంది చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన టీఆర్ కండ్రిగకు చెందిన 400 మందితో మంత్రి ఆర్కే రోజా

పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన మంత్రి ఆర్‌కే రోజా

నగరి(చిత్తూరు జిల్లా): చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులైన అనేకమంది ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు, తటస్థులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఆదివారం టీఆర్ కండ్రిగకు చెందిన మాజీ కౌన్సిలర్ వెంకటేశ్, సాయి, వినోద్, అనంతప్పనాయుడు కండ్రిగకు చెందిన హరి, గోవిందస్వామి, సురేష్, చంద్ర, బుగ్గకండ్రిగకు చెందిన శివ, దుర్గాప్రసాద్, రవి, మేఘనాదం, మణి, భాస్కర్, జగన్నాథంల సమక్షంలో ఒకే వార్డుకు చెందిన సుమారు 400 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి నివాస కార్యాలయం వద్దకు విచ్చేసిన వీరిని మంత్రి ఆర్కేరోజా పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, దేశమ్మ దేవాలయ చైర్మన్ వేణుబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 2 వేల మంది యువత



టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన యువతతో ఎమ్మెల్యే భూమన, అభినయ్‌రెడ్డి

కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే భూమన

తిరుపతి మంగళం(తిరుపతి జిల్లా): తిరుపతిలో టీడీపీ, జనసేన పార్టీలకు యువత గుడ్‌బై చెప్పారు. తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి సమక్షంలో 2వేల మంది యువత ఆదివారం తిరుమల యువజన నాయకుడు ప్రవీణ్‌రాయల్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె.బాబు, కార్పొరేటర్లు తిరుపతి మునిరామిరెడ్డి, అనీష్ రాయల్, పార్టీ నాయకులు దినేష్‌రాయల్, నాదముని తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలు

తిరుమల: తిరుమలలో ఐదు రోజులపాటు జరిగిన శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు రాత్రి శ్రీమలయప్పస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా తెప్పపై విహరించి భక్తులకు కనువిందు చేశారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను నాలుగు మాడ వీధుల్లో ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. రాత్రి 7 గంటలకు విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై స్వామివారు ఆశీనులై పుష్కరిణిలో ఏడు చుట్లు విహరించి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో తిరుమల చిన్నజీయర్ స్వామి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, ఎస్ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



మన్యంలో విభిన్నంగా హోలీ



కొండపడలో ఉత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మన్యం ప్రజలు జరుపుకునే ప్రతి పండుగా గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దంపట్టేలా ఉంటుంది. ముంచంగిపుట్టు మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కొండపడ గ్రామంలో ఏటా హోలీ పండుగను విభిన్నంగా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి గ్రామంలో జాతర నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. తెల్లవారుజామున కర్రలు కాల్చే ఉత్సవానికి ఏర్పాట్లు చేశారు. సుమారు 20 అడుగుల పొడుగున కట్టెలతో స్తంభం ఏర్పాటుచేశారు. దీనికి నిప్పంటించిన అనంతరం రంగులు చల్లుకుంటామని గ్రామస్తులు తెలిపారు. ఇలా చేయడం వల్ల గ్రామానికి సర్వ దోషాలు తొలగిపోయి మంచి జరుగుతుందని గ్రామస్తులు నమ్ముతున్నారు.

— ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో —

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి

ఓగిరాల తండా నుంచి 50 మంది, ఉండి నిమ్మలపేట నుంచి 50 మంది చేరిక

నూజివీడు/ఉండి: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రజారంజక పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలనే తలంపుతో టీడీపీ, జనసేనకు చెందిన అనేక మంది నాయకులు కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం ఓగిరాల తండాకు చెందిన టీడీపీ మాజీ ఉపసర్పంచ్, ఎస్టీసెల్ నాయకుడు లావుడియా హట్టే సింగ్ నాయక్, ఐదో వార్డు సభ్యులు లావూరి భీముడు, మూడు రంగారావు, భరోతు కృష్ణతో పాటు 50మంది కార్యకర్తలు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు సమక్షంలో ఆదివారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే ప్రతాప్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాణావతు రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు భూక్యా కిషోర్, లావుడియా శంకర్, భూక్యా తిరుపతి, ఆరేపల్లి రాంబాబు, రామిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నిమ్మలపేటలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 50 మంది గ్రామపార్టీ అధ్యక్షుడు కరిమెరక మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉండి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమతం సౌజన్యబెనర్జీ, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, కరిమెరక రామచంద్రరావు, యేడిద వెంకటేశ్వరరావు, బ్యాంక్ డైరెక్టర్ కరిమెరక శివనాగరాజు, పాకలపాటి రామరాజు,గిరడ శ్రీను,అంగర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఓగిరాల తండాకు చెందిన 50 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు



ఉండిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు

ఈ–సిగరెట్లు విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

- 743 ఈ–సిగరెట్లు స్వాధీనం.. ముంబై నుంచి తెచ్చినట్లు నిర్ధారణ
- విశాఖ నగర జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న జాయింట్ సీపీ ఫకీరప్ప

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): నికోటిన్ కలిగి ఉన్న నిషేధిత ఎలక్ట్రికల్ సిగరెట్లను అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు విశాఖపట్నం జాయింట్ పోలీసు కమిషనర్ ఫకీరప్ప తెలిపారు. విశాఖ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన రామ్‌నగర్‌లో మీరా కలెక్షన్, డేజావు క్లాత్ షోరూం వద్ద అక్రమంగా ఈ–సిగరెట్లు విక్రయిస్తున్నట్లు మూడో పట్టణ పోలీసులకు సమాచారం అందిందని తెలిపారు. సీఐ పార్థసారథి స్థానిక పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి వెళ్లి మీరా కలెక్షన్ వద్ద సన్నీ కర్నాని, డేజావు క్లాత్ షోరూం వద్ద హబీబ్‌ఖాన్ అనే వ్యక్తులు ఈ–సిగరెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. వారి నుంచి 743 ఈ–సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారని, వీటి విలువ రూ.22లక్షల వరకు ఉంటుందని వివరించారు. నిందితులు ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ–సిగరెట్లను ముంబై నుంచి తీసుకువచ్చినట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ముంబైలోని ఓ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై ఉన్నాడని చెప్పారు. ఈ–సిగరెట్లలో నికోటిన్ ఉండటం వల్ల 2019 నుంచి మన దేశంలో అమ్మకాలను నిషేధించినట్లు తెలిపారు. అదేవిధంగా అక్రమంగా రివాల్వర్, పిస్టల్ దాచిన రామాటాకీస్ వద్ద ఉన్న శ్రీకృష్ణ ట్రావెల్ ఆఫీసులో పనిచేస్తున్న శివనాగరాజు అనే వ్యక్తిని కూడా అరెస్టు చేసినట్లు ఫకీరప్ప చెప్పారు. అతని వద్ద నుంచి రివాల్వర్, పిస్టల్, రెండు బుల్లెట్లు, యాపిల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


తగ్గిన 'జాతీయ' ప్రభ

సార్వత్రిక సమరంలో సత్తా చాటలేకపోతున్న జాతీయ పార్టీలు

70 ఏళ్లలో 14 నుంచి ఆరుకు తగ్గిన జాతీయ పార్టీల సంఖ్య

ఎన్నికల కుంభమేళాలో దేశవ్యాప్తంగా వేలాది రాజకీయ పార్టీలు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. ప్రస్తుతం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి 2,500కు పైగా రాజకీయ పార్టీలున్నాయి. కానీ 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో కేవలం 53 పార్టీలు బరిలో నిలిచాయి. అందులో 14 మాత్రమే జాతీయ పార్టీలు. మిగతావి రాష్ట్ర పార్టీలు. దేశవ్యాప్తంగా కోట్లాది ఓటర్లను ఆకర్షించి అత్యంత ప్రజాదరణ పొందిన పార్టీలుగా ఖ్యాతికెక్కిన జాతీయ పార్టీలు నెమ్మదిగా ప్రభ కోల్పోతున్నాయి. సత్తా చాటలేక చతికిల పడుతూ తమ 'జాతీయ' హోదాను కోల్పోతున్నాయి. అలా ఈ ఏడు దశాబ్దాల కాలంలో ఎనిమిది పార్టీలు 'జాతీయ' హోదా కోల్పోయాయి. డెబ్బై ఏళ్లలో కొన్ని జాతీయ పార్టీలు విలీనం కాగా కొత్తవి ఉద్భవించాయి. తాజాగా 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి జాతీయ పార్టీల సంఖ్య ఆరుకు పరిమితమైంది.

దేశంలో ఎన్నికల పర్వాన్ని అక్షరబద్ధం చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రచురించిన 'లీప్ టు ఫెయిత్' పుస్తకంలో పలు ఆసక్తికర విషయాలున్నాయి. జాతీయ పార్టీ ట్యాగ్‌లైన్ తమకూ కావాలని 1951 లోక్‌సభ ఎన్నికలకు ముందు 29 రాజకీయ పార్టీలు పట్టుబట్టాయి. అయితే వాటిలో 14 పార్టీలకే ఆ హోదా దక్కింది. అయితే మెజారిటీ పార్టీలు దాన్ని నిలబెట్టుకోలేకపోయాయి. కేవలం నాలుగు పార్టీలు.. కాంగ్రెస్, ప్రజా సోషలిస్ట్ పార్టీ, సీపీఐ, జనసంఘ్ ఆ హోదాను నిలుపుకున్నాయి. అఖిల భారతీయ హిందూ మహాసభ, ఆలిండియా భారతీయ జనసంఘ్, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, ఆలిండియా షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఫెడరేషన్, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్(మార్కిస్ట్), ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్(రూకర్), కృషికార్ లోక్‌పార్టీ, బోల్షివిక్ పార్టీ ఆఫ్ ఇండియా, రెవల్యూషనరీ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ హోదా కోల్పోయాయి. దీంతో 1957 ఎన్నికలనాటికి పార్టీల సంఖ్య 15కు పడిపోయింది. వాటిలో నాలుగింటికే జాతీయ హోదా కొనసాగింది. అయితే 1962 ఎన్నికలనాటికి జాతీయ పార్టీల సంఖ్య ఆరుకు, అన్ని పార్టీల సంఖ్య 29కి పెరిగింది. సోషలిస్ట్ (ఎస్‌ఓసీ), స్వతంత్ర (ఎస్‌డబ్ల్యూఏ) పార్టీలు జాతీయ హోదా పొందాయి. 1951 ఎన్నికల తర్వాత సీపీఐ ప్రధాన ప్రతిపక్షంగా ఎదిగి పుష్కర కాలం ఆ హోదాలో కొనసాగింది. కానీ 1964లో పార్టీలోని సోవియట్, చైనా కమ్యూనిస్ట్ వర్గాలు వేరు కుంపటి పెట్టాయి. దీంతో సీపీఐ (మార్కిస్ట్) పురుడుపోసుకుంది.



జేపీ.. జనతా ప్రయోగం

జయప్రకాశ్ నారాయణ్ (జేపీ), రామ్ మనోహర్ లోహియా, ఆచార్య నరేంద్ర దేవ్ ఏర్పాటుచేసిన సోషలిస్ట్ పార్టీ మూలాలు కాంగ్రెస్ వామపక్ష విభాగమైన కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ (సీఎస్‌పీ)లో ఉన్నాయి. జేపీ సోషలిస్ట్ పార్టీని జేబీ కృపలానీ సారథ్యంలోని కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీలో విలీనం చేసి ప్రజా సోషలిస్ట్ పార్టీ (పీఎస్‌పీ)ని ఏర్పాటుచేశారు. ఆ తర్వాత పీఎస్‌పీ నుంచి జేపీ బయటికొచ్చారు.

- 1975లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించడంతో జేపీ మళ్లీ జాతీయ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. జేపీతో పాటు విపక్షాలు నేతలందరూ జైలుపాలయ్యారు.
- జేపీ విడుదలయ్యాక కొందరు పీఎస్‌పీ నేతలతో కలిసి భారతీయ లోక్‌దళ్‌ను స్థాపించారు.
- ఎమర్జెన్సీకారణంగా దేశంలోని విపక్ష పార్టీలపై నిషేధం కత్తి వేలాడటంతో ఇందిరను ఢీకొట్టేందుకు అంతా కలిసి జనతా పార్టీకి ప్రాణం పోశారు. 1977లో ఇందిరను ఓడించి జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చింది.

1992లో 7 జాతీయ పార్టీలు

1992 లోక్‌సభ ఎన్నికల్లో ఏడు నేషనల్ పార్టీలు.. బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, జనతాదళ్, జనతా పార్టీ, లోక్‌దళ్ పోటీలో ఉన్నాయి. 1996 సాధారణ ఎన్నికల్లో మొత్తం 209 పార్టీలు అధికారం కోసం పోటీపడ్డాయి. కాంగ్రెస్, ఆలిండియా కాంగ్రెస్ (తివారీ), బీజేపీ, సీపీఐ, సీపీఎం, జనతా పార్టీ, సమతా పార్టీ, జనతాదళ్ రూపంలో ఎనిమిది పార్టీలకు జాతీయ హోదా దక్కింది. 1998 ఎన్నికల కొచ్చేసరికి పార్టీల సంఖ్య 176కు పడిపోయింది. ఈ దఫా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, జనతాదళ్, సీపీఐ, సీపీఎం, సమతా పార్టీ జాతీయ హోదాతో పోటీ పడ్డాయి. 1999లో పార్టీల సంఖ్య 160కి పడిపోయింది. బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం, జేడీ(ఎస్), జేడీ(యూ) జాతీయ పార్టీలుగా అదృష్టం పరీక్షించుకున్నాయి.

2014లో 464 పార్టీలు

2014 ఎన్నికల్లో ఏకంగా 464 పార్టీలు రంగంలోకి దూకాయి. జాతీయ పార్టీల సంఖ్య ఆరుకు తగ్గింది. ఆనాడు బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఎన్సీపీ, బీఎస్పీలకు మాత్రమే జాతీయ హోదా ఉంది. 2016లో మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తొలిసారిగా జాతీయ హోదా సాధించి ఎన్నికల్లో పోటీ చేసింది. 2019లోనూ ఎక్కువ సీట్లు సాధించేందుకు శ్రమించింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 674 పార్టీలు పోటీ చేయగా వాటిలో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం, ఎన్సీపీ, తృణమూల్ రూపంలో ఏడు జాతీయ పార్టీలుగా నిలిచాయి. తర్వాత తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ, సీపీఐ జాతీయ హోదా కోల్పోయాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

జాతీయ హోదా ఇలా...

నిబంధనావళి ప్రకారం కనీసం మూడు రాష్ట్రాల నుంచి కనీసం రెండు శాతం ఎంపీ సీట్లను గెలిచిన పార్టీకే జాతీయ పార్టీ హోదా దక్కుతుంది. లేదంటే నాలుగు రాష్ట్రాల్లో పోలై చెల్లిన ఓట్లలో ఆరు శాతం ఓట్లు ఆ పార్టీకి పడాలి. కనీసం నాలుగు రాష్ట్రాల్లో అప్పటికే రాష్ట్ర పార్టీ హోదా ఉండాలి.

- జాతీయ పార్టీ దేశవ్యాప్తంగా పోటీ చేస్తే ఆ పార్టీ అభ్యర్థులకు ఒకే ఎన్నికల గుర్తును కేటాయిస్తారు.
- దేశ రాజధానిలో పార్టీ కార్యాలయం ఏర్పాటుకు ప్రత్యేకంగా స్థలం కేటాయిస్తారు.

జాతీయ పార్టీగా ఆప్

తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ, సీపీఐ జాతీయ పార్టీ హోదాను కోల్పోయాక గతేడాది కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ హోదా సాధించడం విశేషం. ప్రస్తుత లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఎం, నేషనల్ పీపుల్స్ పార్టీ, ఆప్ మాత్రమే జాతీయహోదాలో తలపడుతున్నాయి. 543 లోక్‌సభ స్థానాలకు మొత్తం ఏడు దశల్లో పోలింగ్ జరగనుంది.

ఎలక్షన్ బీట్

లోక్‌సభ ఎన్నికల బరిలో వీరప్పన్ కుమార్తె


విద్యారాణి

చెన్నై: గంధపు చెక్కలు, ఏనుగు దంతాల స్మగ్లర్ వీరప్పన్ కుమార్తె విద్యారాణి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారు. తమిళనాడులోని కృష్ణగిరి నియోజకవర్గం నుంచి నామ్ తమిళర్ కట్చి టికెట్‌పై పోటీ చేస్తున్నట్లు ఆమె చెప్పారు. ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాలను ఎంచుకున్నట్లు తెలిపారు. విద్యారాణి న్యాయవాదిగా గిరిజనులు, దళితుల హక్కుల కోసం పోరాడుతున్నారు. తమిళనాడులో ఉద్యమకారిణిగా గుర్తింపు పొందారు. విద్యారాణి 2020లో బీజేపీలో చేరారు. తమిళనాడు బీజేపీ యువజన విభాగం ఉపాధ్యక్షురాలిగా పని చేశారు. కొంతకాలం తర్వాత ఆ పార్టీ నుంచి బయటకు వచ్చారు. తమిళ సినీ నటుడు, దర్శకుడు సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళర్ కట్చిలో ఆమె చేరబోతున్నారు. ప్రజలకు సేవ చేయాలని తన తండ్రి వీరప్పన్ తపించారని, కానీ ఆయన ఎంచుకున్న మార్గం సరైంది కాదని విద్యారాణి చెప్పారు. 2004 అక్టోబర్ 18న తమిళనాడు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ కాల్పుల్లో వీరప్పన్ హతమైన సంగతి తెలిసిందే.

ఇండియా కూటమి చెదరలేదు: జైరామ్ రమేశ్

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమి చెక్కుచెదరలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పష్టం చేశారు. బిహార్ సీఎం నితీశ్ కుమార్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ దూరంగా ఉంటున్నప్పటికీ తమ కూటమికి స్థిరంగా, బలంగా ఉందని అన్నారు. అవినీతిని వ్యతిరేకిస్తున్నాం అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న ప్రకటనలన్నీ ఉత్తడొల్లేనని కొట్టిపారేశారు. జైరామ్ రమేశ్ ఆదివారం ఓ మీడియా సంస్థతో మాట్లాడారు. త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటమి తప్పదని తేల్చిచెప్పారు. విపక్షాలు 272కి పైగా సీట్లు సాధిస్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కాంట్రాక్టులు పొందినవారు పెద్ద ఎత్తున ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి, బీజేపీకి సమర్పించుకున్నారని తెలిపారు. రూ.4,000 కోట్ల విలువైన బాండ్లకు రూ.4 లక్షల కోట్ల విలువైన కాంట్రాక్టులతో ప్రత్యక్షంగా సంబంధం ఉందన్నారు. ఐటీ, ఈడీ, సీబీఐ కేసులు ఎదుర్కొంటున్నవారు కూడా ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి బీజేపీకి అందజేశారని వెల్లడించారు. ఇది ముమ్మాటికీ క్విడ్ ప్రో కో అని తేల్చిచెప్పారు. మౌలిక సదుపాయాలకు సంబంధించిన కాంట్రాక్టులను దక్కించుకున్న ఓ బీజేపీ ఎంపీ కూడా ఎలక్టోరల్ బాండ్లు కొన్నాడని వెల్లడించారు అవినీతిపై పోరాటం అంటూ ప్రధాని మోదీ చెబుతున్న మాటల్లో ఏమాత్రం పస లేదని జైరామ్ రమేశ్ స్పష్టం చేశారు.

పోటీ నుంచి తప్పుకున్న కేంద్ర మంత్రి వీకే సింగ్

ఘాజియాబాద్: కేంద్ర మంత్రి, ఘాజియాబాద్ బీజేపీ ఎంపీ రిటైర్డు జనరల్ వీకే సింగ్ అస్త్ర సన్యాసం చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించారు. ఆయన కేంద్ర మంత్రివర్గంలో పౌరవిమానయాన శాఖ, రోడ్డు రవాణా హైవేల శాఖలకు సహాయ మంత్రిగా ఉన్నారు. దేశానికి మరో రూపంలో సేవలందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వీకే సింగ్ తెలిపారు.

బాండ్లు కాదు.. బీజేపీ బలవంతపు వసూళ్లు: అఖిలేశ్

కనౌజ్(యూపీ): ఎలక్టోరల్ బాండ్ల విషయంలో కేంద్రంలోని అధికార బీజేపీపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ మరోసారి విరుచుకుపడ్డారు. బీజేపీ బాండ్ల రూపంలో బలవంతంగా డబ్బులు వసూలు చేసిందని ఆరోపించారు. చందాల ముసుగులో వసూళ్ల దందాకు తెరతీసిందని ధ్వజమెత్తారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. బలవంతపు వసూళ్ల కోసం సీబీఐ, ఈడీ ఐటీ వంటి సంస్థలను బీజేపీ విచ్చలవిడిగా వాడుకుందని మండిపడ్డారు. కొందరు కాంట్రాక్టర్లపై సీబీఐ, ఈడీ, ఐటీ శాఖ నుంచి ఒత్తిళ్లు పెరిగినప్పుడల్లా బీజేపీ ఖాతాలోకి పెద్ద ఎత్తున డబ్బులు వచ్చాయని చెప్పారు. ఎలక్టోరల్ బాండ్లతో ఇప్పుడు బీజేపీ ప్రతిష్ట మసకబారిందని పేర్కొన్నారు. భిన్నమైన పార్టీ అని చెప్పుకొనే బీజేపీపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయని వెల్లడించారు. ఈ ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించారని అఖిలేశ్ ఆక్షేపించారు.

31న విపక్షాల మహా ర్యాలీ

- ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో భారీ సభ
- సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు 'ఇండియా' కూటమి సంఘీభావం
- ఒక్కతాటిపైకి రానున్న విపక్ష నేతలు
- దేశంలో ప్రజాస్వామ్యం పెనుముప్పును ఎదుర్కొంటోందని ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ ఆందోళన

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మద్దతుగా విపక్ష 'ఇండియా' కూటమి నాయకులు చేతులు కలుపుతున్నారు. కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ, ఆయనకు సంఘీభావంగా ఈ నెల 31న తేదీన ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ప్రజాస్వామ్య పరిరక్షణ' పేరుతో మహా ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. కూటమి భాగస్వామ్య పక్షాల అగ్రనేతలు ఈ ర్యాలీలో పాల్గొనబోతున్నారు. ఇండియా కూటమిలో ఆమ్ ఆద్మీ పార్టీ కీలక భాగస్వామి అన్న సంగతి తెలిసిందే. దేశ ప్రయోజనాలతోపాటు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్న లక్ష్యంతో మహా ర్యాలీ చేపట్టాలని నిర్ణయించామని ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ చెప్పారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. దేశంలో తాజా పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు. ప్రజాస్వామ్యం పెనుముప్పును ఎదుర్కొంటోందని అన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించేవారంతా కేజ్రీవాల్ అరెస్టు పట్ల ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. ''ఇది కేవలం అరవింద్ కేజ్రీవాల్‌కు సంబంధించిన సమస్య కాదు. ప్రతిపక్షాలన్నీ బెదిరింపులను ఎదుర్కొంటున్నాయి. అధికారంలో ఉన్న వ్యక్తులు మొదట విపక్షాలను డబ్బుతో కొనేయాలని చూస్తున్నారు. మాట వినకపోతే ఈడీ, ఐటీ, సీబీఐని ప్రయోగిస్తున్నారు. అయినా లొంగకపోతే తప్పుడు కేసుల్లో ఇరికించి అరెస్టు చేస్తున్నారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఇలాగే అరెస్టు చేశారు. ఇప్పుడు పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌పైనా గురిపెట్టారు'' అని గోపాల్ రాయ్ ఆరోపించారు. కేజ్రీవాల్ కుటుంబ సభ్యులను గృహ నిర్బంధంలో ఉంచారని, ఆప్ కార్యాలయాన్ని సీజ్ చేశారని ధ్వజమెత్తారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి విపక్షాలన్నీ ఒక్కటవుతున్నాయని చెప్పారు.

కేవలం రాజకీయ సభ కాదు

ఢిల్లీలో ఈనెల 31న జరిగే మహా ర్యాలీ కేవలం రాజకీయ సభ కాదని, కేంద్రంలోని నిరంకుశ బీజేపీకి వ్యతిరేకంగా వినిపించే గొంతుక అని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్విందర్ సింగ్ లవ్లీ పేర్కొన్నారు. దేశంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రశ్నించారు. ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. తమ పార్టీ ఖాతాలను స్తంభింపజేశారని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ అలుపెరుగని పోరాటం సాగిస్తున్నారని చెప్పారు. ఇండియా కూటమి పక్షాలకు అండగా నిలుస్తామని తెలిపారు. మోదీ ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ పోరాడుతాయని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంపై దాడులను సహించబోమని సీపీఎం నేత రాజీవ్ కున్వార్ స్పష్టం చేశారు.

ఈడీ కస్టడీ నుంచి కేజ్రీవాల్ పరిపాలన

ఢిల్లీలో తాగునీటి సమస్యపై తొలి ఉత్తర్వు జారీ



న్యూఢిల్లీ: జైలులో ఉన్నా, బయట ఉన్నా ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తానని చెప్పిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆ దిశగా తొలి ఉత్తర్వు జారీ చేశారు. మద్యం కుంభకోణం కేసుకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయన ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, మురుగునీటికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి నుంచి శనివారం రాత్రి ఆదేశాలు అందాయని ఢిల్లీ నీటి మంత్రి అతీషి చెప్పారు. ఆమె ఆదివారం మీడియాతో మాట్లాడారు. కేజ్రీవాల్ పంపించిన నోట్‌ను చూసిన తర్వాత తనకు కన్నీళ్లు వచ్చాయంటూ భావోద్వేగానికి గురయ్యారు. అరెస్టై ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజల బాగు కోసం ఆయన ఆలోచిస్తున్నారని తెలిపారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలకు తగినన్ని వాటర్ ట్యాంకర్లు పంపించాలంటూ కేజ్రీవాల్ ఆదేశించారని పేర్కొన్నారు. వేసవి ఎండలు ముదురుతుండడంతో నీటి సరఫరాను మెరుగుపర్చాలని చెప్పారని అన్నారు. ఈ విషయంలో చీఫ్ సెక్రటరీతోపాటు సంబంధిత అధికారులకు సీఎం ఈడీ కస్టడీ నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. అవసరమైతే లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సాయం తీసుకోవాలని సూచించారని మంత్రి అతీషి చెప్పారు. కస్టడీ నుంచి అరవింద్ కేజ్రీవాల్ జారీ చేసిన ఉత్తర్వుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) స్పందించింది. ఈ ఉత్తర్వు కేజ్రీవాల్‌ను ఈడీ కస్టడీకి అనుమతిస్తూ పీఎంఎల్‌ఏ కోర్టు జారీ చేసిన ఆర్డర్‌కు అనుగుణంగా ఉందా? లేదా? అనేది పరిశీలించనున్నట్లు ఈడీ అధికార వర్గాలు ఆదివారం తెలియజేశాయి.

మళ్లీ బీజేపీలోకి గాలి జనార్దనరెడ్డి

సాక్షి, బెంగళూరు: మైనింగ్ వ్యాపారి, కర్ణాటక రాజ్య ప్రగతి పక్ష(కేఆర్‌పీపీ) పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి మళ్లీ కాషాయ పార్టీలోకి చేరబోతున్నారు. కేఆర్‌పీపీని బీజేపీలో విలీనం చేయనున్నారు. ఈ నెల 25వ తేదీన ఉదయం 10 గంటలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నట్లు ఆదివారం మీడియాకు తెలిపారు. నరేంద్ర మోదీని మూడో సారి ప్రధానమంత్రిగా చేయాలన్నదే తన లక్ష్యమన్నారు. బళ్లారిలో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి బి.శ్రీరాములుకు మద్దతు తెలిపారు. బీఎస్ యడియూరప్ప ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన జనార్దనరెడ్డి, ఆ తర్వాత మైనింగ్ కుంభకోణం కేసులో జైలు పాలయ్యారు. కేఆర్‌పీపీని సొంతంగా ఏర్పాటు చేసి, 2023 ఎన్నికల్లో పోటీ చేశారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. భారతీయ విద్యార్థిని మృతి

న్యూయార్క్: అమెరికాలోని పెన్సిల్వేనియాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్షియా జోషి (24) అనే భారతీయ విద్యార్థిని మృతి చెందారు. ఆర్షియా ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైందని భారత కాన్సులేట్ కార్యాలయం తెలిపింది.

ఐసిస్‌తో లింకులు.. గువాహటి ఐఐటీ విద్యార్థి అరెస్ట్

గువాహటి: అంతర్జాతీయ ఉగ్ర సంస్థ ఐసిస్‌తో సంబంధాలున్నాయనే ఆరోపణలపై గువాహటి-ఐఐటీకి చెందిన తౌసిఫ్ అలీ ఫరూకీ అనే విద్యార్థిని అస్సాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీటెక్ బయోసైన్స్ నాలుగో సంవత్సరం చదువుకుంటున్న ఇతడిపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నివారణ)చట్టం ఉపా కింద కేసు నమోదు చేశారు. విచారణ జరిపిన అనంతరం ఐసిస్‌తో సంబంధాలున్నట్లు పక్కా ఆధారాలు దొరకడంతో శనివారం అరెస్ట్ చేసినట్లు అస్సాం పోలీస్ టాస్క్‌ఫోర్స్ ఐజీ పార్థసారథి మహంతా చెప్పారు. కోర్టు అతడిని 10 రోజుల పోలీసు కస్టడీకి అనుమతి ఇచ్చిందన్నారు. ఢిల్లీలోని బాట్లా ప్రాంతానికి చెందిన అతడు ఐసిస్‌లో చేరేందుకు వెళ్తుండగా కామ్‌రూప్ జిల్లా హజో వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. మూడు రోజుల క్రితం బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ఐసిస్ భారత్ చీఫ్ హారిస్ ఫరూకీ, అతడి అనుచరుడు అనురాగ్ సింగ్ అలియాస్ రేహాన్‌లను ధుబ్రి జిల్లాలో అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఐజీ వివరించారు. అయితే, గువాహటి ఐఐటీకి చెందిన ఇద్దరు విద్యార్థులకు ఐసిస్‌తో సంబంధాలున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తనకు సమాచారం ఇచ్చినట్లు హోం శాఖ బాధ్యతలు కూడా చూసుకుంటున్న సీఎం హిమాంత బిశ్వ శర్మ చెప్పారు. ఇద్దరిలో ఒక్కరు మాత్రమే దొరికారని, తప్పించుకుపోయిన మరో విద్యార్థిని కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఉగ్రవాదం వైపు ప్రేరేపితులైన వీరి గురించి తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు సీఎం చెప్పారు.

ముంబైలో రూ.3 కోట్ల డ్రగ్స్ సీజ్

ముంబై: గత నెల రోజుల వ్యవధిలో రూ.3.25 కోట్ల విలువైన 16 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని, 12 మంది పెడ్లర్లను అరెస్ట్ చేసినట్లు ముంబై పోలీస్ శాఖ యాంటీ నార్కోటిక్స్ సెల్(ఏఎన్‌సీ) ఆదివారం తెలిపింది. సహర్ గ్రామం, నల్లసోపార, శాంటాక్రుజ్, కుర్లా, బైకుల్లా తదితర ప్రాంతాలకు చెందిన పెడ్లర్ల నుంచి హెరాయిన్, గంజాయి, ఎండీని స్వాధీనం చేసుకున్నట్లు వివరించింది. 2023లో 106 కేసుల్లో 229 మంది డ్రగ్ పెడ్లర్లను అరెస్ట్ చేసి, రూ.53.23 కోట్ల డ్రగ్స్‌ను పట్టుకున్నట్లు ఏఎన్‌సీ వివరించింది.

సునీత.. మరో రబ్డీ అయ్యేనా...?!

- కేజ్రీవాల్ అరెస్టుతో ఆప్‌లో నాయకత్వ లేమి
- ఆయన స్థానాన్ని భార్య భర్తీ చేస్తారని ఊహాగానాలు
- బీజేపీ ముందస్తు విమర్శలు, ఆప్ మౌనం



అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుతో ఆమ్ ఆద్మీ పార్టీ ఒక్కసారిగా భారీ కుదుపుకు లోనైంది. చాన్నాళ్లుగా ఊహిస్తున్నదే అయినా, ఆప్‌లో నాయకత్వ లేమిని ఈ పరిణామం బట్టబయలు చేసింది. మద్యం కేసులోని ఇతర నిందితుల్లా కేజ్రీవాల్ కూడా దీర్ఘకాలం పాటు జైలుకే పరిమితమైతే ఆప్ పరిస్థితేమిటన్న ప్రశ్నకు బదులుగా ఆయన భార్య సునీత పేరు తెరపైకి వస్తోంది. భర్త స్థానంలో ఆప్ పగ్గాలతో పాటు ఢిల్లీ సీఎం బాధ్యతలనూ ఆమె చేపట్టవచ్చంటూ ఊహాగానాలు విన్పిస్తున్నాయి. సోషల్ మీడియాలో అందుకు అనుకూల, వ్యతిరేక వాదనలు జోరుగా సాగుతున్నాయి...

1997లో నాటి బిహార్ సీఎం లాలూప్రసాద్ యాదవ్ దాణా కుంభకోణంలో జైలుపాలు కావడంతో భార్య రబ్డీదేవిని ముఖ్యమంత్రిని చేసిన వైనం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అచ్చం అలాగే సునీత కూడా రాజకీయ అరంగేట్రం చేయవచ్చంటూ ఊహాగానాలు విన్పిస్తున్నాయి. ఈడీ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్ శనివారం ప్రజలనుద్దేశించి పంపిన వీడియో సందేశాన్ని పార్టీ నేతలకు బదులు సునీత చదివి విన్పించడం ఇందుకు సంకేతమంటూ జోరుగా విశ్లేషణలు సాగుతున్నాయి. ఆ సందర్భంగా ఆమె కేజ్రీవాల్ కుర్చీలో కూర్చోవడం యాదృచ్ఛికమేమీ కాదని కూడా అంటున్నారు. అరవింద్, సునీత ఇద్దరూ ఐఆర్‌ఎస్ అధికారులే. శిక్షణ సందర్భంగా ఏర్పడ్డ సాన్నిహిత్యం పెళ్లికి దారితీసింది. ముందుగా కేజ్రీవాల్ పదవికి రాజీనామా చేసి హక్కుల కార్యకర్తగా మారారు. రాజకీయాల్లోకి వచ్చి పార్టీ పెట్టారు. ఆయన సీఎం అయ్యాక సునీత కూడా ఐఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. అప్పుడప్పుడు భర్తతో పాటు పార్టీ ప్రచారంలో పాల్గొనడం, ఆప్ ఎన్నికల విజయాలపై స్పందించడం తప్ప రాజకీయంగా చురుగ్గా ఉన్నది లేదు. పార్టీలో కూడా ఆమె ఎలాంటి పదవిలోనూ లేరు. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ సందేశాన్ని ఆప్ నేతలు కాకుండా సునీత చదివి విన్పించడం ఒక్కసారిగా ఊహాగానాలకు తావిచ్చింది. వాటిపై మిశ్రమ స్పందనలూ వస్తున్నాయి. ''సునీతకు పగ్గాలప్పగిస్తే సానుభూతి కూడా ఆప్‌కు కలిసొస్తుంది. కష్టకాలం నుంచి పార్టీని ఆమె బయట పడేస్తారు. కీలకమైన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్ లోటును కూడా భర్తీ చేస్తారు'' అని కొందరంటున్నారు. భర్త తరఫున ఆయన సందేశాన్ని విన్పించినంత మాత్రాన రాజకీయాల్లోకి వస్తారని అనుకోలేమని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ''ఆమె కూర్చున్నది సీఎం కుర్చీ ఏమీ కాదు. తమ నివాసంలో కేజ్రీవాల్ మీడియాతో భేటీ అయ్యే కుర్చీలో కూర్చున్నారంతే. దాన్ని అధికార మార్పిడికి సంకేతంగా చూడటం సరికాదు'' అన్నది వారి వాదన. సునీత రాజకీయ ఎంట్రీ వార్తలపై ఆప్ మౌనం వహిస్తోంది. ఆప్ నేతల్లో పంజాబ్ సీఎం భగవంత్ మాన్ మాత్రమే దీనిపై పెదవి విప్పారు. ఆయన కూడా ఈ విషయమై తనకెలాంటి సమాచారమూ లేదని చెప్పడంతోనే సరిపెట్టారు. బీజేపీ మాత్రం అప్పుడే ముందస్తు విమర్శలతో హోరెత్తిస్తోంది. ఆప్ నాయకత్వ రేసులో చివరికి కేజ్రీవాల్ భార్య కూడా చేరారంటూ కేంద్ర మంత్రి, బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ ఎద్దేవా చేశారు. కేజ్రీవాల్ గతంలో చేసిన వాగ్దానాలను వరుసబెట్టి తుంగలో తొక్కుతుంటే సునీత ఎక్కడున్నారని బీజేపీ నేతలు ప్రశ్నిస్తున్నారు.


- సాక్షి, నేషనల్ డెస్క్

కంగనా రనౌత్, నవీన్ జిందాల్‌కు

బీజేపీ టికెట్లు

- వరుణ్ గాంధీకి మొండిచెయ్యి
- మరో 111 మంది అభ్యర్థులతో బీజేపీ ఐదో జాబితా విడుదల


కంగన


వరుణ్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మరో 111 మంది అభ్యర్థులతో అధికార బీజేపీ ఆదివారం ఐదో జాబితా విడుదల చేసింది. కేంద్ర మంత్రి అశ్వినీకుమార్ చౌబే, ఎంపీ వరుణ్ గాంధీకి ఈసారి టికెట్లు నిరాకరించింది. బాలీవుడ్ నటి కంగనా రనౌత్, ప్రఖ్యాత టీవీ నటుడు అరుణ్ గోవిల్ అభ్యర్థిత్వం ఖరారయ్యింది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఒడిశాలోని సంబాల్‌పూర్ నుంచి, బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా పూరీ నుంచి పోటీ చేయబోతున్నారు. సీనియర్ నేత మేనకా గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ నుంచి, పిలిభిత్ నియోజకవర్గంలో వరుణ్ గాంధీ స్థానంలో ఉత్తరప్రదేశ్ మంత్రి జితిన్ ప్రసాద, ఇటీవల బీజేపీలో చేసిన సీతా సోరెన్ జార్ఖండ్‌లోని దుమ్కా స్థానం నుంచి పోటీకి దిగబోతున్నారు. టీవీ సీరియల్ రామాయణంలో రాముడి పాత్ర ధరించిన అరుణ్ గోవిల్ ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ నుంచి పోటీ చేయనున్నారు. ఆదివారమే బీజేపీలో చేరిన కాంగ్రెస్ మాజీ ఎంపీ నవీన్ జిందాల్ హరియాణాలోని కురుక్షేత్ర నుంచి, కలకత్తా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభిజిత్ బందోపాధ్యాయ పశ్చిమ బెంగాల్‌లోని తమ్లూక్ నుంచి పోటీ చేయబోతున్నారు. కేరళలోని వయనాడ్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేరళ బీజేపీ అధ్యక్షుడు కె.సురేంద్రన్ పోటీకి దిగబోతున్నారు. కేంద్ర మాజీ మంత్రి అనంతకుమార్ హెగ్డేకు ఈసారి అవకాశం కల్పించలేదు. తన అభ్యర్థిత్వాన్ని బీజేపీ ఖరారు చేయడం పట్ల బాలీవుడ్ నటి, జాతీయ అవార్డు గ్రహీత కంగనా రనౌత్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కోసం ఎదురు చూస్తున్నానని ఆదివారం చెప్పారు. ఆమె తన స్వస్థలమైన హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ నుంచి బీజేపీ టికెట్‌పై పోటీచేయబోతున్నారు. బీజేపీలో చేరడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నానని కంగనా రనౌత్ పేర్కొన్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం : 25 : మార్చి : 2024




వేసవి కాలం ప్రతాపం చూపుతోంది. ఆదివారం బెళగావి, కలబుర్గిలో ఎండలో జనం అవస్థలు

న్యూస్‌రీల్



రంజాన్ పర్వదినాల సందర్భంగా బెళగావిలో బజార్ వీధిలో విద్యుద్దీపాల అలంకారం

లోక్‌సభ ఎన్నికల తర్వాత సిద్ధూ ఔట్ : శెట్టర్

హుబ్లీ: లోక్‌సభ ఎన్నికల తర్వాత సిద్ధరామయ్య సీఎం పదవికి రాజీనామా చేస్తారు. ఆపరేషన్ కమల అవసరం లేదు. కాంగ్రెస్‌లోని అసమ్మతి వల్ల ప్రభుత్వం పడిపోతుందని, దీనికి గుబ్బి ఎమ్మెల్యే శ్రీనివాస్ బహిరంగ ప్రకటనే సాక్ష్యమని మాజీ సీఎం జగదీష్ శెట్టర్ తెలిపారు. ఆయన నగరంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో గ్రూపులున్నాయి. ఈ గ్రూపుల వల్ల ప్రభుత్వం పడిపోతుంది. అధికారం కోసం వారిలో వారు కొట్లాడుకుంటున్నారు. కొన్ని రోజుల క్రితం దళిత సీఎం అంశం బయపెట్టారు. ఆ తర్వాత నలుగురు ఉపముఖ్యమంత్రులు చేయాలన్నది తెరపైకి తెచ్చారు. ఇప్పుడేమో సీఎం మార్పు అంశంపై జోరుగా చర్చలు జరుగుతున్నాయన్నారు. సిద్ధు సర్కార్‌ను కూల్చడానికి సొంత పార్టీ వారే కుట్రలు చేస్తున్నారని శెట్టర్ ఎద్దేవా చేశారు.

కారు కడిగినందుకు జరిమానాలు



బనశంకరి: సిలికాన్ సిటీలో కావేరి నీటితో కారు శుభ్రం చేసిన యజమానులకు జలమండలి రూ.5 వేలు జరిమానా విధించింది. నగరంలో నీటి కొరత తీవ్రంగా ఉండగా నీటిని వృథా చేశారని ఈ చర్యలు తీసుకున్నారు. సదాశివనగరలో కారును శుభ్రం చేసిన మహిళకు రూ.5 వేలు జరిమానా, ఇదే కారణంతో మహదేవపుర, డాలర్స్ కాలనీలో ఇద్దరికి జలమండలి అధికారులు జరిమానాలు వేశారు. కారు, బైక్ వాషింగ్‌కు, పూల తోటలకు కావేరి నీటిని వాడరాదని జలమండలి తెలిపింది. కావేరి నీటిని తాగడానికి మాత్రమే ఉపయోగించాలని గతంలోనే పేర్కొంది.

మేకెదాటును నిర్మించాలి: దేవెగౌడ

శివాజీనగర: బెంగళూరు నగరానికి తాగునీరు సరఫరా చేయడానికి మేకెదాటు ప్రాజెక్ట్‌ను అమలు చేస్తామని జేడీఎస్ అధినేత, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్, బీజేపీలు కూడా వారి మేనిఫెస్టోలో మేకెదాటును నిర్మిస్తామని ప్రకటించాలన్నారు. ఇందులో ఎవరికీ భయపడాల్సిన పని లేదన్నారు. దీనిపై అందరూ సమైక్యంగా ఉండాలన్నారు. మేకెదాటు ప్రాజెక్ట్‌కు అనుమతి ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీని కూడా కోరుతానన్నారు. ఆ ప్రాజెక్టు ద్వారా 30 టీఎంసీల నీటిని ఉపయోగించుకోవాలని చెప్పారు. మేకెదాటు ప్రాజెక్ట్ వల్ల 5 వేల హెక్టార్ల అటవీ భూమి మునిగిపోతుందని కొందరు చెప్పడం అవాస్తవమన్నారు.

రూ.25 లక్షల లంచం.. ముడా కమిషనర్ అరెస్టు




కమిషనర్ మన్సూర్ అలీ, దళారీ సలీం

యశవంతపుర: ఓ వ్యక్తి నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ మంగళూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) కమిషనర్ మన్సూర్ అలీ లోకాయుక్తకు చిక్కారు. టీడీఆర్ క్లియరెన్స్ చేయడానికి ముడుపులు తీసుకుంటూ ఉండగా లోకాయుక్త డీఎస్పీ చెలువరాజ్, సీఐలు అమానుల్లా, సురేశ్‌కుమార్‌లు దాడి చేసి పట్టుకున్నారు. సాగర్ రియాలిటి ప్రమోటర్స్ యజమాని గిరిధర్‌శెట్టి ఇటీవల కుడుపు గ్రామంలో భూమిని కొనుగోలు చేసి అందుకు టీడీఆర్ ఇవ్వాలని ముడాకు అర్జీ పెట్టుకున్నారు. కానీ ఫైలు కదలడం లేదు. మధ్యవర్తి సలీం ద్వారా కమిషనర్ మన్సూర్ రూ. 25 లక్షలు లంచం డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం గిరిధర్‌శెట్టి నుంచి రూ.25 లక్షలు తీసుకుంటూ ఉండగా కమిషనర్‌తో పాటు దళారీని అరెస్ట్ చేశారు.

శుద్ధ జలమూ గగనమే

- ఐటీ సిటీలో ఫిల్టర్ వాటర్ కేంద్రాల బంద్
- బోర్లు ఎండిపోవడమే కారణం
- తడారిన గొంతులకు మరో సమస్య



బెంగళూరు ఆర్‌ఆర్ నగరలో ఓ ఫిల్టర్ నీటి కేంద్రం ముందు జనం పడిగాపులు



నీళ్లు లేవంటూ ఓ కేంద్రం ముందు బోర్డు

బనశంకరి: ఉద్యాననగరిలో భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు ఎండిపోవడంతో చాలావరకు నీటికి కటకట ఏర్పడడం తెలిసిందే. రుసుము తీసుకుని తాగునీటిని అందించే వాటర్ ఫిల్టర్ కేంద్రాలు కూడా నిలిచిపోయాయి. వాటికి నీరు లభించకపోవడమే కారణం. సిలికాన్ నగరిలో ఫిబ్రవరి ప్రారంభం నుంచి నీటి కొరత తలెత్తింది. రాజరాజేశ్వరి నగర, ఎలక్ట్రానిక్ సిటీ, మడివాళ, యశవంతపుర, విజయనగర, బ్యాటరాయనపుర, మారతహళ్లి, ఆవలహళ్లితో పాటు వివిధ ప్రాంతాల్లో బీబీఎంపీ ఏర్పాటుచేసిన ఫిల్టర్ వాటర్ కేంద్రాల్లో నీరులేక బందయ్యాయి. వీటిలో రూ. 5కు 20 లీటర్ల నీరు ఇస్తారు. కొన్ని చోట్ల ఒక వ్యక్తికి ఒక క్యాన్ నీరు మాత్రమే ఇస్తున్నారు. నాలుగు క్యాన్లు కావాలంటే కుటుంబం మొత్తం క్యూలో నిలబడాలి.

తగ్గిపోయిన కేంద్రాలు

వంద లీటర్ల బోరు నీటిని ఫిల్టర్ చేస్తే 30, 40 లీటర్ల తాగునీరు లభిస్తుందని సిబ్బంది తెలిపారు. బెంగళూరు పాలికె పరిధిలో మొత్తం 1,065 శుద్ధజల కేంద్రాలు ఉండగా ప్రస్తుతానికి 841 మాత్రమే పనిచేస్తున్నాయి. మరోవైపు ప్రైవేటు ఫిల్టర్ వాటర్ కేంద్రాలు ధరలు పెంచేసి ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్నాయి. తాగునీరు దొరికితే చాలు అనే పరిస్థితిలో జనం ఎంత డబ్బు చెల్లించైనా నీటిని కొంటున్నారు.

కొన్ని గంటలే సరఫరా

నీరు దొరక్క ఫిల్టర్ కేంద్రాలు పనిచేసే వేళల్ని తగ్గించాయి. ఉదయం 8 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంటవరకు, మళ్లీ సాయంత్రం కొంతసేపు తెరిచి ఉంటాయి. నీళ్లు లేవు అని అనేక కేంద్రాలు బోర్డులు పెట్టేస్తున్నాయి. దీంతో ప్రాణాధారమైన జలం కోసం ప్రజలు పనిమానేసి గంటలకొద్దీ క్యాన్లు పట్టుకుని క్యూలో నిలబడుతున్నారు. గతంలో నిత్యం 50–60 మంది వచ్చేవారు. గత రెండునెలలు నుంచి ఈ సంఖ్య పెరిగిందని, మరింత తీవ్రతరమయ్యే అవకాశం ఉందని గిరినగర ప్రాంతంలోని ఓ నీటి వ్యాపారి తెలిపారు.

ప్రజల ఆక్రోశం

నీరులేక మూతపడిన కొన్ని తాగునీటి కేంద్రాల వద్ద జలమండలి 1,000 లీటర్ల ట్యాంకులను ఉంచి నీటిని నింపుతోంది. జన రద్దీ వల్ల కొంతసేపటికే ఇవి ఖాళీ అవుతున్నాయి. ఎక్కువ ట్యాంకులను ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. కత్రిగుప్పెవార్డులో గల కొన్ని పాలికె ఫిల్టర్ కేంద్రాలు బందై తాగునీరు దొరకడం లేదని స్థానికులు తెలిపారు. బోరుబావి ఎండిపోవడంతో వీరభద్రనగరలో తాగునీటి కేంద్రాన్ని మూసివేశారు. దీంతో గిరినగరకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నట్లు ప్రజలు తెలిపారు. అక్కడ కూడా గంటలకొద్దీ వేచి ఉంటేనే క్యాన్ నిండుతుందని వాపోయారు.

కుక్కేలో నక్సలైట్ల సంచారం

- వరుస ఘటనలతో కలకలం



యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం కుక్కే సుబ్రమణ్య సమీపంలో నక్సలైట్ల సంచారం కనబడింది. కడబ తాలూకా సుబ్రమణ్య గ్రామం ఐనెకిదులోని అటవీ ప్రాంతంలో ఉన్న అశోక్ అనే వ్యక్తి ఇంటికి శనివారం సాయంత్రం ఆరు గంటలకు కొందరు నక్సలైట్లు వెళ్లినట్లు తెలిసింది. గంటపాటు యజమానితో చర్చించినట్లు ప్రచారం జరుగుతోంది. వాన పడుతున్న సమయంలో నక్సల్ మొబైల్ ఫోన్‌కు చార్జింగ్ కూడా చేసుకొన్నారు. వచ్చిన ముగ్గురు నక్సల్ యూనిఫారంతో పాటు ఆయుధాలను ధరించినట్లు తెలిసింది. వారం రోజుల క్రితం దక్షిణ కన్నడ– కొడగు సరిహద్దు కోజిమలె ఎస్టేట్‌లో ఒక అంగడికి కొందరు నక్సలైట్లు వెళ్లి నిత్యావసరాలను కొనుగోలు చేశారు. అప్పటినుంచి ఇక్కడ కూంబింగ్ సాగుతోంది. వాళ్లే మళ్లీ అశోక్ ఇంటికి వెళ్లి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

కేరళలోకి పయనం

కోజిమలె, ఐనెకిదుల మధ్య 25 కిలోమీటర్ల ఉంది. సుబ్రమణ్య చుట్టుపక్కల నక్సల్ వ్యతిరేక పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఇప్పటివరకు పోలీసులకు నక్సలైట్లు తారసపడలేదు. నక్సల్ వచ్చి వెళ్లిన ప్రదేశం కుమార పర్వతం వరుసలో ఉంది. అక్కడ నుంచి ఒక మార్గం సోమవారపేట, గాళిబీడు వెళ్లవచ్చు. సంపాజె మీదుగా అటవీ ప్రాంతం గుండా కేరళలోకి వెళ్లిపోయి ఉంటారని అనుమానిస్తున్నారు.

అడవిలో పులి మృత్యువాత

మైసూరు: మైసూరు జిల్లాలోని హుణసూరు తాలూకాలోని నాగరహొళె జాతీయ అరణ్యంలోని తావరెరె పులుల సంరక్షణ ప్రాంతంలో పులి మృత్యువాత పడింది. సుమారు 13 సంవత్సరాల వయసున్న ఆడ పులి చనిపోయినట్లు కొందరు అటవీ సిబ్బందికి సమాచారమిచ్చారు. నాగరహొళె జాతీయ పులుల సంరక్షణ ప్రాంతం డైరెక్టర్ హర్షకుమార్ వచ్చి పరిశీలించారు. పులి కళేబరానికి పోస్టుమార్టం జరిపి అక్కడే దహనం చేశారు. ఆకలి, అనారోగ్యం లేదా ఇతర జంతువులతో పోరాటంలో గాయపడి మరణించి ఉంటుందని చెప్పారు.

మద్యం మత్తులో దుండగుల దాడి

బనశంకరి: దారి ఇవ్వాలని పదే పదే హారన్ వేసినందుకు ప్రశ్నించిన ఇద్దరిపై దుండగులు చాకుతో దాడి చేశారు. ఈ ఘటన నగరంలో సూర్యనగర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కిత్తగానహళ్లి సునీల్, కార్తీక్ అనే ఇద్దరిని కిశోర్, శ్రీధర్, వాలె మంజు, హేమంత్, మనోజ్, తుకడి వెంకటరాజు చాకులతో దాడి చేసి పరారయ్యారు. నిందితులు టెంపోలో వెళ్తూ గట్టిగా హారన్ కొట్టసాగారు. నిందితుల్లో కిశోర్ అనే వ్యక్తి జైలు నుంచి విడుదల కాగా, మద్యం పార్టీ చేసుకుని వెళ్తూ హల్‌చల్ చేశారు. సూర్యనగర పోలీసులు కేసు నమోదు చేసి ముఠా కోసం గాలిస్తున్నారు.



ఎన్నెన్నో వర్ణాలు

రాష్ట్రంలో హోలీ సందోహం ఆరంభమైంది. ఆదివారం బెంగళూరు బసవనగుడిలో రంగుల్లో మునిగిన బాలికలు

మైసూరులో సామూహిక వేడుకల్లో యువత చిందులు



ఫేస్‌బుక్ ప్రేమకు తల్లీకొడుకు బలి

- ప్రియుడే కాలయముడు
- జంట హత్యల కేసులో వీడిన మిస్టరీ



హతులు శృతి, రోహన్ (ఫైల్), నిందితుడు సాగర్

రాయచూరు రూరల్: జంట హత్యల కేసులో ఏడాది తరువాత నిందితున్ని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన విజయపుర (బిజాపుర) జిల్లాలో చోటుచేసుకుంది. తల్లీ కొడుకులను ఆమె సోషల్ మీడియా ప్రియుడే హత్య చేశాడు. వివరాలు.. మైసూరుకు చెందిన శృతి (34) ఆమె కుమారుడు రోహన్ (13). ఆమెకు సాగర్‌నాయక్ (40)తో ఫేస్‌బుక్‌లో పరిచయమై ప్రేమగా మారింది. ఇద్దరికీ అప్పటికే పెళ్లయి కుటుంబాలున్నాయి. ఆమెపై మోజు తగ్గాక అతడు విజయపురకు వచ్చేశాడు. కానీ శృతి అతన్ని వెతుక్కుంటూ 2023 మార్చి 13న కొడుకుతో సహా విజయపురకు వచ్చింది. సాగర్ వారిని సింధగి రహదారిలోని ఫోర్‌వే లాడ్జీలో బస చేయించాడు. ప్రేమ, పెళ్లి విషయమై అక్కడ శృతి, సాగర్‌ల మధ్య తీవ్ర గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన సాగర్.. ఆమెను గొంతు పిసికి చంపాడు. ఇది చూసిన రోహిత్ పోలీసులకు చెబుతాడని భావించి అతన్ని కూడా హత్య చేశాడు.

ఏడాది నుంచి విచారణ

మృతదేహాలను సంచుల్లో వేసి రాత్రి ఎవరి కంటా పడకుండా కారులో తీసుకెళ్లి మహారాష్ట్ర సరిహద్దులో సిద్దాపుర బావిలో పడేసి పరారు అయ్యాడు. వారం రోజుల తరువాత కుళ్లిన శవాలను త్రికోట పోలీసులు వెలికితీశారు.

ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కేసు పెండింగ్‌లో ఉంది. 2024 ఫిబ్రవరిలో శృతి కుటుంబ సభ్యులు మైసూరు పోలీస్ స్టేషన్‌లో తప్పిపోయినట్లు ఫిర్యాదు చేశారు. మైసూరు పోలీసులు వారి ఫోటోలను అన్ని జిల్లాల పోలీసులకు పంపించారు. విజయపుర పోలీసులు పరిశీలించి బావిలోని మృతులు వీరేనని గుర్తించి మైసూరు పోలీసులకు సమాచారమిచ్చారు. సోషల్ మీడియా మెసేజ్‌లు, కాల్ డేటా ఆధారంగా సాగర్ నాయక్‌ను విజయపుర గ్రామీణ పోలీసులు అరెస్ట్ చేశారు.

సింహా కంటే మంచి అభ్యర్థి

మైసూరు: ప్రస్తుతం మైసూరు ఎంపీ ప్రతాపసింహా కంటే ఉత్తమమైన అభ్యర్థి లభించారని, ఇది ప్రజల అదృష్టమని రాష్ట్ర బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ రాధా మోహన్ అగర్వాల్ అన్నారు. ఆదివారం ఆయన మైసూరులో మీడియాతో మాట్లాడారు. ప్రతాపసింహ మైసూరును ఎంతో అభివృద్ధి చేశారని, ఆయన కంటే మంచి అభ్యర్థి, యదువంశానికి చెందిన యువరాజు యదువీర్ ఒడెయార్ ఇప్పుడు పోటీలో ఉన్నారని చెప్పారు. మైసూరు సామ్రాజ్యంలో యదువంశానికి చాలా గొప్ప పేరు ఉందన్నారు.

సీఎంపై ఈసీకి ఫిర్యాదు

శివాజీనగర: ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని సీఎం సిద్ధరామయ్య, ఉడుపి–చిక్కమగళూరు ఎంపీ అభ్యర్థి జయప్రకాశ్ హెగ్డేలపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు చేసింది. బీజేపీవారు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు పార్టీ మార్పిడికి రూ.50 కోట్లు ఆఫర్ చేశారని తప్పుడు ఆరోపణలు చేశారు. అందుచేత సీఎంపై నియమావళి ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ నేత శ్రీనివాస్ పూజారికి హిందీ, ఇంగ్లీష్ రాదని హెగ్డే అవహేళన చేశారన్నారు.

నటి సోనుగౌడపై దాడికి యత్నం



గ్రామంలో బాలిక తల్లిదండ్రులతో సోనుగౌడ

- బాలిక సొంతూరిలో విచారణ

రాయచూరు రూరల్: అక్రమంగా బాలికను దత్తత తీసుకున్న కేసులో బిగ్‌బాస్ పోటీదారు, టీవీ నటి సోనుగౌడను బ్యాడరహళ్లి పోలీసులు విచారణ కోసం బాలిక సొంతూరికి తీసుకొచ్చారు. సేవంతి అనే బాలికతో సోను గౌడ పలు వీడియోలు చేయడం, తద్వారా దత్తత విషయం బయటకు రావడం తెలిసిందే. శిశు సంక్షేమ అధికారుల ఫిర్యాదు మేరకు ఆమెను పోలీసులు అరెస్టు చేసి విచారణ చేపట్టారు. శనివారం సాయంత్రం రాయచూరు జిల్లా మస్కి తాలూకా కాచాపురలో పంచనామా చేయడానికి సోనుగౌడను తరలించారు. ఆ సమయంలో కొందరు గ్రామస్థులు సోనుగౌడ కారుపై రాళ్లు విసిరారు. దాడి నుంచి ఆమె క్షేమంగా తప్పించుకుంది. బాలిక ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రులతో పాటు సోనుగౌడను విచారించారు. ఆదివారం బెంగళూరుకు రావాలని తల్లిదండ్రులకు సూచించారు.



ఆదివారం మంగళూరు నగరంలో క్రైస్తవుల ర్యాలీ



బెంగళూరు మిస్పా చర్చిలో అలంకారం

ప్రభువు చూపిన బాటలో సాగాలి

- భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

శివాజీనగర: లోకంలో పాపుల రక్షణ కోసం ఏసు ప్రభువు శిలువనెక్కిన గుడ్ ఫ్రైడే కు ముందుగా వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా రాష్ట్రమంతా క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఏసుక్రీస్తు జెరూసలేంలో ప్రవేశించినపుడు ప్రజలు దారి పొడవునా బట్టల పరచి, చెట్ల కొమ్మలు పరిచి ఆత్మీయ స్వాగతం పలుకుతారు. ఆ రోజును గుర్తుచేసుకుంటూ చర్చీలను ఈత కొమ్మలు, టెంకాయ మట్టలతో అలంకరించి భక్తి గీతాలను ఆలపించారు. ఈత కొమ్మలు పట్టుకొని ర్యాలీలు నిర్వహించారు. బెంగళూరు మిస్పా తెలుగు చర్చిలో పాస్టర్ బెరాకా ఆండీ, సంఘ పెద్దలు, పిల్లలు ఈత కొమ్మలను చేత పట్టుకొని హోసన్న జయం, ప్రభువుకు జయమని చెబుతూ ప్రదర్శన నిర్వహించారు. పరిశుద్ధ జీవనం సాగించాలని భక్తులకు హితబోధ చేశారు. ప్రభువు ఏసుక్రీస్తు ఆదర్శంగా సమాజంలో ఆదర్శవంతమైన జీవితం గడపాలని తెలిపారు. కెప్టెన్ జాన్, ఎం.ఆర్.చెన్నయ్య, పాస్టర్ జీవరత్నం, విజయరాజ్, శ్రీరామ్, బాబు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి పల్లకీ సేవ



భక్తజన సందోహం మధ్య తేరు వేడుక

నేత్రపర్వం బ్రహ్మ రథోత్సవం

- జనమయమైన చెలువ ఆలయం

మండ్య: మండ్య జిల్లాలోని మేలుకోటెలో వెలసిన ప్రఖ్యాత శ్రీ చెలువనారాయణ స్వామి ఆలయంలో వైరముడి మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. వైరముడి ఊరేగింపు వేడుక తరువాత ఆదివారం మహా రథోత్సవం ఘనంగా సాగింది. కర్ణాటకతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తజనం తరలివచ్చింది. రాత్రి నుంచి ఉపవాసం చేసిన భక్తులు తేరు వేడుకలో పాల్గొన్నారు. మంత్రి ఎన్.చెలువనారాయణ స్వామి, ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

మిర్చిలో రారాజు బ్యాడిగ



మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



మార్కెట్‌లో మిర్చి రాశులు పోసిన దృశ్యం



హావేరి మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

- రుచి, రంగు, సువాసనతో ఆకట్టుకుంటున్న బ్యాడిగి మిర్చి
- పుట్టినిల్లు మెక్సికో
- 15వ శతాబ్దంలో గోవాకు పరిచయం చేసిన పోర్చుగీసు దేశస్తులు
- హెచ్చు, తగ్గు ధరలతో మిర్చి రైతు కుదేలు

సాక్షి,బళ్లారి: మిర్చిలో రారాజు బ్యాడిగ రకం. సాధారణ ఎండు మిరపతో పోలిస్తే ఈ రకాలకు రేటు అధికంగా రావడంతో వీటి సాగుపై రైతులు మొగ్గుచూపుతున్నారు. బ్యాడిగి మిరపకు పుట్టినిల్లు మెక్సికో దేశం. ఈ బ్యాడిగి మిర్చిని 15వ శతాబ్దం ఆఖరులో గోవాకు పరిచయం చేసింది పోర్చుగీసువాసులు. దీంతో అప్పట్లో ఈ బ్యాడిగి కర్ణాటకలో అడుగు పెట్టింది. అప్పటి వరకు ఇక్కడ నలుపు సుందరిదే హల్‌చల్. (నల్ల మిరియాలు). ఎప్పుడైతే ఇక్కడి ఎర్రమందారానికి బ్యాడిగి మిర్చికి రంగు రుచి, సువాసనకు మైమరిచిపోయారో అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ మిర్చి ఘాటు ఒక్క కర్ణాటకలోనే కాదు పొరుగున ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తర కర్ణాటక పరిధిలో పలు రాష్ట్రాలకు చేరింది. చందన సీమలో బ్యాడిగి మిర్చి ఘాటుకు మరోపేరు డబ్బీ మిర్చి, ఎర్ర మిర్చి. వేరుశనగతో చట్నీతో మొదలై పిజ్జా, బర్గర్లు, రుచికరమైన సాంబరు, పప్పు, రసం తదితర వాటితో పాటు ఊరగాయలకు ఈ బ్యాడిగి మిర్చిని వాడకం తప్పనిసరి. ఆహారం, ఔషధ రంగానికే కాకుండా కాస్మెటిక్ ఉత్పత్తుల్లో ప్రధానంగా నెయిల్ పాలిష్, లిప్‌స్టిక్‌లలో వినియోగిస్తారు. 2011లో భౌగోళికంగా మరింత ఖ్యాతిని దక్కించుకుంది.

ఈ మిర్చీకి భలే గిరాకీ:

ప్రారంభంలో హావేరి జిల్లా వర్షాధారిత ప్రాంతమైన హిరేకెరూరు, రట్టిహళ్లి ప్రాంతాలల్లో అనుకూలమైన వాతావరణం ఉండటంతో ఈ పంట ప్రవర్ధమానానికి వచ్చింది. హావేరి ప్రాంతంలో సాగు అత్యధికంగా విస్తరించడటంతో బ్యాడిగి పట్టణం వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతోంది. ఇక్కడి మార్కెట్‌లో కడ్డీ, డబ్బీ రకాలు మిర్చికి బ్యాడిగి అనే పేరు వచ్చింది. ఈ సంవత్సరం ఒక రోజు బ్యాడిగి మార్కెట్‌లో దాదాపు ఐదు లక్షలు సంచులు మిర్చి వచ్చి చేరుతోంది. అమెరికా, రష్యా, మలేషియా, సింగపూర్, ఇండోనేషియా, శ్రీలంక, అరబ్ తదితర దేశాలకు బ్యాడిగి మిర్చి ఎగుమతి అవుతోంది. ఈసారి మిర్చి ధరలు పతనం కావడంతో పెట్టుబడులు కూడా దక్కకపోవడంతో బ్యాడిగిలో రైతులు ఇటీవల పెద్ద ఎత్తున విధ్వంసం చేసిన సంగతి తెలిసిందే.

హావేరిలో బ్యాడిగ కనుమరుగు :

బ్యాడిగి మిర్చి పంట హావేరి జిల్లాల్లో ఇటీవల కొన్ని సంవత్సరాలుగా చాలా వరకు కనుమరుగవుతోంది. హావేరి రైతులు పండించడం దూరమైనప్పటికి, బ్యాడిగికి ఇతర ప్రాంతాలు నుంచి పెద్ద సంఖ్యలో మిర్చి తరలిస్తుండటంతో బ్యాడిగి మార్కెట్ మాత్రం ఉనికిని ఏటేటా పెంచుకుంటోంది. కాగా మిర్చి వచ్చే రోగాలు, చీడ బాధలు, వాతావరణ మార్పులతో విసిగిన హావేరి జిల్లాకు చెందిన అత్యధిక అన్నదాతలు మొక్కజొన్నను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో హైబ్రీడ్ వంగడాలు కూడా వస్తున్నాయి. సంస్కరించిన వంగడాల్లో అతికారం, అతిగా రంగు, అధిక దిగుబడి అవుతున్నాయి. అయితే రుచి రంగు, సువాసన తదితర సమపాళ్లలో ఉన్న మూల వంగడం నాణ్యత మరే రకంలోను లభించడం లేదు. దీంతో బ్యాడిగి, డబ్బీ, కడ్డీ రకం కొనుగోళ్లకు వ్యాపారులతో పాటు, మసాల పదార్థాలు తయారీదారులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అవసాన దశలో మూల వంగడమైన కడ్డీ, డబ్బీ రకాలు మిర్చి వివిధ సమస్యలతో సతమతమవుతోంది.

క్లుప్తంగా

ఓటుహక్కుపై ప్రచారం



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఈఓ

రాయచూరు రూరల్: మే 7న జరగనున్న రాయచూరు లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ తుకారం పాండే పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా ఆరోగ్య అధికారి కార్యాలయం వద్ద జిల్లా స్వీప్ సమితి ఏర్పాటు చేసిన జాతాకు శ్రీకారం చుట్టి మాట్లాడారు. ఓటు హక్కుపై ప్రచారం నిర్వహించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జాతాలో జిల్లా ఆరోగ్య అధికారి సురేంద్రబాబు, వైద్యాధికారులు గణేష్, షాకీర్, రమేష్, విజయ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామలింగ కామదేవర ఉత్సవాలు



పూజలందుకుంటున్న కామదేవుడు

హుబ్లీ: హోళీ పండుగ నేపథ్యంలో నవలగుంద శ్రీరామలింగ కామదేవుడి దర్శనానికి జిల్లాలో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆదివారం సెలవు రోజు కావడంతో తెల్లవారు జామునుంచే ప్రజలు బారులు తీరి రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. శనివారం కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వేసవి నేపథ్యంలో ఆలయ ట్రస్ట్ కమిటీ రెండు ఎకరాల స్థలంలో ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేసి భక్తులకు వసతి కల్పించింది. భక్తులకు తాగు నీరు, మజ్జిగ, పానకం, పెరుగుతో కూడిన అవలక్కి, ద్రాక్షపండ్లను అందజేశారు. 24 గంటల పాటు గత ఐదు రోజులుగా ఈప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. తొలిరోజు గోధుమ పాయసం, మరుసటి రోజు శెనగ బ్యాళ్ల పాయసం, మూడవ రోజు పెసరబ్యాళ్ల పాయసం, నాలుగవ రోజు షేమియా పాయసం, పండుగను పురస్కరించుకొని చివరి రోజు కేసరిబాత్, అన్నదానం, సాంబార్ పంపిణీ చేస్తారు.

కుటుంబ సభ్యుల కోసం సమయం కేటాయించాలి

రాయచూరు రూరల్: నిత్యం ఒత్తిళ్ల మధ్య విధులు నిర్వహించే పోలీసులు కుటుంబ సభ్యుల కోసం కొంత సమయాన్ని కేటాయించాలని జిల్లా ఆరోగ్య అధికారి సురేంద్ర బాబు పేర్కొన్నారు. శనివారం రాత్రి నగరంలోని జిల్లా జైలు వసతి సముదాయంలో కుటుంబ కళ్యాణ సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. 24 గంటలు విధి నిర్వహణలో వుండే జైలు అధికారులు, సిబ్బంది కుటుంబాలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మానసిక వైద్యుడు మనోహర్, స్వామి వివేకానంద రామక్రిష్ణ ఆశ్రమం సంచాలకుడు వేణుగోపాల్, జిల్లా జైలు సూపరిన్‌టెన్‌డెంట్ అందాని, సీఐ ఉమేష్ కాంబ్లే, జిల్లా గ్రంథాలయాధికారిణి నిర్మల, జైలర్లు భాగ్యశ్రీ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



ఊరేగింపుగా వెళ్తున్న క్రైస్తవులు

తుమకూరు : తుమకూరు నగరంలో సీఎస్ఐ వెస్లి చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. చర్చిలో ప్రార్థనల అనంతరం ఖర్జూరపు మట్టలు చేత పట్టి భక్తి గేయాలు ఆలపిస్తూ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు.

సిద్దేశ్వరుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన శ్రీ సిద్దేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి ఉదయం సుప్రభాతసేవ, రుద్రాభిషేకం , పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. ఆదివారం సెలవు దినం కావడంతో మడకశిర నియోజకవర్గం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

బెంగళూరులో విశ్వ ఆత్మీయ భేటీ



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఉరవకొండ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి

- పాల్గొన్న ఉరవకొండ ప్రాంతవాసులు

ఉరవకొండ: అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన వారు బెంగళూరులో ఎంతోమంది ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ స్థిరపడ్డారు. వారితో ఆదివారం బెంగళూరులోని బసవభవన్‌లో వైఎస్సార్‌సీపీ నేతలు ఆత్మీయ సమావేశం జరిపారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, పార్టీ అభ్యర్థి వై. విశ్వేశ్వరరెడ్డి, పార్టీ రాయలసీమ జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డిలు హాజరయ్యారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి పథకాలతో దేశంలోనే రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపారన్నారు. నియోజకవర్గానికి చెందిన వారు బెంగళూరులో నివాసమున్నారని, వీరంతా తప్పకుండా సొంత ప్రాంతాలకు వచ్చి వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలన్నారు. ఉరవకొండలో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో గెలవబోతోందన్నారు. సభలో ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు భరత్‌రెడ్డి, సత్యం, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహ ద్వాదశి వ్రతం ఆచరణ



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కెజీఎఫ్: నగరంలోని కోరమాండల్ స్వామినాథపురంలో ఉన్న తిరువెంగడ ముదియన్ దేవాలయంలో నరసింహ స్వామికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ధర్మదర్శి మహేంద్రన్ మాట్లాడుతూ... నరసింహ ద్వాదశ వ్రతాన్ని ఆచరించడం ద్వారా తమ జీవితంలోని అన్ని అవరోధాలను అధిగమించడానికి సాధ్యమవుతుందని, భగంతుడి కృపా కటాక్షాలకు పాత్రులు కావచ్చని తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి దివ్య ప్రబంధ సేవలు, 10 గంటల నుంచి విశ్వక్సేన ఆరాధన, మహా లక్ష్మీనారాయణ హోమం, సత్యనారాయణ స్వామి పూజా కార్యక్రమాలు జరిగాయి.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా అనిల్‌రెడ్డి



డాక్టర్ ఎస్. అనిల్ రెడ్డి

బొమ్మనహళ్లి : బొమ్మనహళ్లి నియోజకవర్గ కాంగ్రెస్ అధికార ప్రతినిధిగాగా ఉన్న డాక్టర్ అనిల్ ఎస్ రెడ్డి యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బంటిషేక్ ఆదేశాలు జారీ చేశారు. కాగా ఈ పదవితో తనకు మరింత బాధ్యతలు పెరిగాయని అనిల్ రెడ్డి అన్నారు. పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

ప్రజల మద్దతుతో విజయం సాధిస్తాం

మైసూరు : రాష్ట్రంలో కాంగ్రెస్ టికెట్ల పంపిణీలో ఎలాంటి గందరగోళం లేదని, రెండు రోజుల్లో మిగిలిన స్థానాలు కూడా అభ్యర్థులను ప్రకటిస్తామని సీఎం సిద్ధరామయ్య తెలిపారు. ఆదివారం ఆయన మైసూరులో విలేకరులతో మాట్లాడారు. అనేక మంది మంత్రుల వారసులకు టికెట్లు ఇచ్చారని విలేకరులు ప్రస్తావించగా ఇది కుటుంబం రాజకీయం కాదని, ఎవరికి ఎక్కడ ప్రజల మద్దతు ఉందో అలాంటివారికి టికెట్లు ఇచ్చారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను రాష్ట్ర ప్రజలు ఆదరించారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కూడా ప్రజల మద్దతుతో 28 స్థానాల్లో విజయం సాధిస్తామన్నారు.

అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం



నూతన అధ్యక్షుడిని సన్మానించిన దృశ్యం

కోలారు: కర్ణాటక ప్రింటర్స్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ మండలికి నిర్వహించిన అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా కోలారుకు చెందిన అబ్బణి శంకర్, ఉపాధ్యక్షుడిగా బెంగుళూరుకు చెందిన ఎస్ శివరాంలు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. కాగా సంఘం డైరెక్టర్లుగా మిరయప్ప, ఎల్ మురళీకృష్ణ, జెఎస్ వీరణ్ణ, కె శంకర్, బి సునీల్, మంజులా శంకర్, శంకరాచారి, పి సుధాకర్, పి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం మాట్లాడిన అధ్యక్షుడు అబ్బణి శంకర్ డైరెక్టర్‌ల సహకారంతో సంఘాన్ని ఆర్థికంగా బలపరుస్తానని సభ్యులు ఆర్థిక అభివృద్ధికి అవసరమైన సలహాలు ఇవ్వాలని తెలిపారు.

బాగేపల్లి సమీపంలో వ్యక్తి దారుణహత్య



వెంకటేశప్ప మృతదేహం



ఘటన స్థలంలో పోలీసులు

బాగేపల్లి: పట్టణంలోని టీబీ క్రాస్ వద్ద వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. హతుడిని ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం, దేమకేతేపల్లికి చెందిన దాసరి వెంకటేశప్ప(56)గా పోలీసులు గుర్తించారు. దుండగులు శనివారం రాత్రి పది గంటల తర్వాత ఇతనిపై పదునైన ఆయుధంతో దాడి చేసి గొంతు భాగంలో కోసి హత్య చేశారు. ఆదివారం ఉదయం ఒక హోటల్ వ్యాపారి వచ్చి చూడగా ఈ ఘటన వెలుగు చూసింది. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి అనంతరం ఆస్పత్రికి తరలించారు. ఇతను బేల్దారి పనిచేసేవాడని, ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు పోలసులు తెలిపారు. హత్యకు దారితీసిన కారణం దర్యాప్తులో వెలుగు చూడాల్సి ఉంది.



చుక్క మంచినీరు లభిస్తే అదే గగనం. పిడచకట్టుకుపోయే గొంతుకు అదే అమృతం. బెంగళూరు ఉత్తరహళ్లిలో ఓ కొళాయిలో కారే నీటితో దాహం తీర్చుకుంటున్న పిట్ట



రాయల నగరి హంపీలో కొళాయిల నుంచి దాహం తీర్చుకుంటున్న వానరాలు

నేటి నుంచి పది పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ



కేంద్రంలో నెంబర్లు వేస్తున్న సిబ్బంది

కోలారు: జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి (సోమవారం) 65 కేంద్రాలలో మొత్తం 20,479 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. దీంతో అన్ని భద్రతా చర్యలు తీసుకున్నారు. 2250 మంది సిబ్బందిని నియమించినట్లు డీఈఓ కృష్ణమూర్తి తెలిపారు. ప్రశ్న పత్రాల తరలింపు నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ ఉంటుంది. ఇక మధ్యాహ్నం వరకు జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని ఆదేశించారు.

ఘనంగా తిరుమలరాయ స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి అరవింద లింబావళి

కృష్ణరాజపురం: మహదేవపుర నియోజకవర్గం పరిధిలోని రామగొండనహళ్లిలో కొలువైన తిరుమల రాయ స్వామి(తిరుమల క్షేత్రం) శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు రథంపైకి అరటిపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ మంత్రి అరవిందలింబావళి హాజరై స్వామివారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ భక్తులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసింది.

'కేంద్రం రూపాయి కూడా ఇవ్వలేదు'

మైసూరు : రాష్ట్రం కరువు కోరల్లో చిక్కుకుందని, రైతులు, పేదలు ఇబ్బందులు పడుతున్నారని, అయినా నిధులు మంజూరు చేయడంలో కేంద్రం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మైసూరులో విలేకరులతో మాట్లాడారు. కరువు నిధులు మంజూరు చేయాలని అనేకసార్లు కోరామని, అయినా ఇప్పటివరకు కేంద్రం నుంచి రూపాయి కూడా అందలేదన్నారు. దీంతో సుప్రీం కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. వర్షాలు లేక పంటలు పండక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.



ఆదివారం బెంగళూరు వీవీ పురంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులు

కోలారు వార్తలు...

కోలారు కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు

- కొలిక్కిరాని అభ్యర్థి ఎంపిక
- నన్నగిల్లుతున్న విజయావకాశాలు
- విఫలమవుతున్న అధిష్టానం బుజ్జగింపులు

కోలారు: జిల్లా కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు తగ్గడం లేదు సరికదా నానాటికి అధికమవుతోంది. 2019 లోక్‌సభ ఎన్నికలలో గ్రూపు విభేధాల కారణంగానే కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి ఎరుగని కెహెచ్ మునియప్ప ఘోరపరాజయం పాలై తొలిసారిగా బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. కోలారు కాంగ్రెస్ గత రెండు దశాబ్దాలుగా గ్రూపు తగాదాలు ఉన్నాయి. సీనియర్ నాయకుడు మాజీ స్పీకర్ ఒక వర్గం కాగా కేంద్ర మాజీ మంత్రి ప్రస్తుత రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కెహెచ్ మునియప్పది మరొక వర్గం. జిల్లా కాంగ్రెస్‌లో కెహెచ్ మునియప్ప – కె ఆర్ రమేష్‌కుమార్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కెహెచ్ మునియప్ప సొంత పార్టీ అభ్యర్థులనే ఓడించే ప్రయత్నం చేశారని ప్రత్యర్థులతో చేతులు కలిపి కాంగ్రెస్ అభ్యర్థులకు వెన్నుపోటు పొడిచారనేది కెహెచ్ మునియప్ప వ్యతిరేక వర్గం ఆరోపణ. ఇదే కారణంతో గత 2019 లోక్‌సభ ఎన్నికలలో కెఆర్ రమేష్‌కుమార్, అప్పటి ముళబాగిలు ఎమ్మెల్యేగా ఉన్న కొత్తూరు మంజునాథ్, బంగారుపేట ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తదితరులు కక్షగట్టి కెహెచ్ మునియప్ప ఓటమికి కారణమయ్యారు. పైగా ఇదంతా తాము కెహెచ్ మునియప్పనే నుంచే నేర్చుకున్నామని బంగారుపేట ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి బహిరంగంగా తెలిపారు. నెల రోజుల క్రితం కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఇరు వర్గాల వారు కొట్టుకోవడంతో రెండు వర్గాల మధ్య దూరం మరింత అధికమైంది. గ్రూపు తగాదాలు తారస్థాయికి చేరుకుంది.

కుదరని సయోధ్య :

జిల్లా కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాల కారణంగా లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా పరిణమించింది. ఏడుసార్లు నియోజకవర్గం నుంచి విజయం సాధించిన కెహెచ్ మునియప్పకు ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా ఉండడంతో టికెట్ తనకు కాకుండా తన అల్లుడు చిక్క పెద్దయ్యకు ఇవ్వాలని హైకమాండ్ వద్ద డిమాండ్ ఉంచారు. అయితే దీనిని కెహెచ్ వ్యతిరేకవర్గం పూర్తిగా వ్యతిరేకిస్తోంది. కెహెచ్ కుటుంబంలో ఎవరికి టికెట్ ఇచ్చినా తమ సహకారం ఉండదని తెగేసి చెబుతున్నారు. ఇరువురి మధ్య సయోధ్య కుదర్చడానికి హైకమాండ్ చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక చిక్కుముడిగా మారింది.

కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలు జేడీఎస్ అనుకూలంగా మారుతున్నాయి. గత ఎన్నికలలో గ్రూపు తగాదాల వల్లనే ఓడిన కాంగ్రెస్ మళ్లీ అదే తప్పు చేస్తూ జేడీఎస్‌కు మేలుచేస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనేది చూసి అభ్యర్థిని ప్రకటించే ఆలోచనలో జేడీఎస్ ఉంది.

సిట్టింగ్ ఎంపీ ఆశలపై నీళ్లు :

బీజేపీ అధిష్టానం ఈసారి తనకే టికెట్ కేటాయిస్తుందని గంపెడు ఆశలతో ఉన్న సిటింగ్ ఎంపీ ఎస్ మునిస్వామి ఆశలపై బీజేపీ అధిష్టానం నీళ్ల చల్లింది. కోలారును జేడీఎస్‌కు వదలి పెట్టడంతో ముని స్వామి కోలారు టికెట్‌పై ఆశలు వదులుకున్నారు. మరో వైపు మునిస్వామి స్వతంత్ర అభ్యర్థిగా నిలబడాలని, లేదా జేడీఎస్ టికెట్‌ను మునిస్వామికే ఇవ్వాలని ఆయన అభిమానులు డిమాండ్ చేసినా ఇదంతా ఆయన తోసిపుచ్చారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు.

కన్యకా పరమేశ్వరి ఆలయాలకు చీరలు



ఆలయానికి చీర అందజేస్తున్న ఆర్యవైశ్య కమిటీ

శ్రీనివాసపురం: ఉగాది పండుగను పురస్కరించుకుని 300 వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాల అమ్మవార్ల పట్టు చీరలను అందిస్తున్నట్లు జిల్లా ఆర్యవైశ్య మండలి అధ్యక్షుడు కెఆర్ శివకుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి పట్టు చీరను బహుకరించి మాట్లాడారు. బెంగుళూరు గ్రామీణ జిల్లా నెమంగల తాలూకా దాబస్ పేటలో ఆర్యవైశ్య సముదాయం ఆధ్వర్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సముదాయ విద్యార్థుల కోసం నర్సరీ నుంచి డిగ్రీ వరకు ఉత్తమ విద్యా సంస్థను స్థాపించాలనే ఉద్దేశం కలిగి ఉన్నట్లు తెలిపారు. సంస్థ అభివృద్ధి కోసం ఇప్పటికే సుమారు 50 మంది నుంచి షేరు మొత్తాన్ని సంగ్రహించినట్లు తెలిపారు. శ్రీ వాసవి ఎడ్యుకేషన్ కో ఆపరేటివ్ సొసైటీ నుంచి వేల మంది సముదాయం వారు షేర్లను కొనుగోలు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవశ్య మండలి జిల్లా డైరెక్టర్ ఎంఆర్ ఆనంద్, ఎస్ ఆర్ అమరనాథ్, జిల్లా ఆర్యవైశ్య మండలి డైరెక్టర్ వైవి రమేష్, తాలూకా అధ్యక్షుడు వైఆర్ శివప్రకాష్ తదితరులు ఉన్నారు.

మండ్య నేతలతో కుమార సమావేశం

శివాజీనగర: హృదయ శస్త్ర చికిత్స చేయించుకొని బెంగళూరుకు వచ్చిన మాజీ సీఎం కుమారస్వామి ఆదివారం మండ్య జిల్లా నేతలతో సమావేశమయ్యారు. మండ్య లోక్‌సభ నియోజకవర్గం నుంచి తనను పోటీ చేయాలని చెబుతున్నారని, అయితే ఈ విషయంపై ఎలాంటి తీర్మానం చేపట్టలేదన్నారు. తనకు మూడుసార్లు హృదయ శస్త్ర చికిత్స జరిగింది. ప్రస్తుతం స్టెంట్ వేశారన్నారు. కాగా జేడీఎస్ నుంచి ఎదిగిన కొందరు నాయకులు తమను వీధిలో నిలబెట్టారని ఆవేదనతో కన్నీరు పెట్టి విచారం వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న కరగ ఉత్సవం



కరగ నృత్యం చేస్తున్న పూజారి

మాలూరు: తాలూకాలోని కోడిహళ్లి గ్రామంలో శ్రీ ద్రౌపతాంబ దేవి ఆలయ 3వ కరగ మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కరగ ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. పోతురాజు, భరత పూజారి వేద మంత్రాలను పఠించిన అనంతరం కరగ ఉత్సవాన్ని ప్రారంభించారు. శనివారం రాత్రి 11.30 గంటలకు కరగ పూజారి సురేష్ కరగను మోస్తూ చేసిన నృత్యం ఆకట్టుకుంది. తమ ఇంటి ముంగిటకు వచ్చిన కరగను గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

క్లుప్తంగా

కళలు, సాహిత్యంపై ఆసక్తి పెంచుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హెచ్‌ఆర్ అరవింద్

మండ్య : కనుమరుగవుతున్న జానపద కళలు, కన్నడ సాహిత్యాన్ని కాపాడి భావితరాలకు అందించాలని బీజేపీ నాయకుడు హెచ్‌ఆర్ అరవింద్ పిలుపునిచ్చారు. సంగీత నృత్య కళానికేతన్ ట్రస్టు ఆధ్వర్యంలో మండ్య నగరంలో ఏర్పాటు చేసిన సంగీత, జానపద గేయాల ఆలపన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు కళలు, సంగీతం అద్దం పడతాయన్నారు. వాటి పరంపరను కొనసాగించాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణించిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. కన్నడ సాహిత్యంపై యువకులు ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు.

'ఎస్సీ, ఎస్టీలను వంచించిన కాంగ్రెస్'

మైసూరు : ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి కేటాయించిన నిధులను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీల అమలుకు మళ్లించిందని, ఈ సర్కార్‌కు లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్. మహేష్ సూచించారు. మైసూరు- కొడగు లోక్‌సభ బీజేపీ అభ్యర్థి యదువీర్‌కు మద్దతుగా ఎస్సీ మోర్చా ఆదివారం మైసూరులోని కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడి ఎస్సీ, ఎస్టీ వర్గాలను వంచించిందన్నారు. ఎస్సీ, ఎస్టీలు లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సర్కార్‌కు బుద్ధి చెప్పి బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

పుస్తక పఠనం అలవర్చుకోండి

యశవంతపుర: పండుగల సమయంలో దుస్తులకు బదులుగా పుస్తకాలను కొనుగోలు చేయాలని రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి పిలుపునిచ్చారు. బెళగావి పట్టణంలోని ఒక బుక్‌హౌస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కన్నడిగులు, మరాఠీ మహిళలు మంచి పుస్తకాలు కొనుగోలు చేసి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. చీరలు, బంగారం కొంటే దొంగలు దోచుకెళ్లవచ్చని, పుస్తకాలను ఎవరూ చోరీ చేయరన్నారు. ఉత్తర కర్ణాటకపై ప్రత్యేక అభిమానం ఉన్నట్లు తెలిపారు. మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన తనకు రాజ్యసభ పదవి దక్కటం ఆనందంగా ఉందన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



సాలుమరద తిమ్మక్కతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఏహెచ్.బసవరాజ్, మంజుల

బనశంకరి: బీజేపీ రాష్ట్ర వెనుకబడినవర్గాల మోర్చా విభాగం కోశాధికారి, బీబీఎంపీ మాజీ విపక్షనేత ఏహెచ్.బసవరాజ్ జన్మదిన వేడుకను ఆదివారం బనశంకరి రెండో స్టేజ్‌లోని తన నివాసంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రముఖ పర్యావరణ ప్రేమికురాలు, వృక్షమాత సాలుమరద తిమ్మక్క హాజరై బీజేపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్ కత్తరించి బసవరాజ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



బెంచీలపై హాల్‌టికెట్ నంబర్లు వేసిన దృశ్యం

మండ్య : నేటినుంచి జిల్లా వ్యాప్తంగా జరిగే టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మొత్తం 477 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 21,102 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేశారని, వీరిలో 10,834 మంది బాలురు, 10,268 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. కాపీయింగ్ నివారణకు ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీకెమెరాలు ఏర్పాటు చేశామని, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సెల్‌ఫోన్ల వినియోగాన్ని నిషేధించినట్లు తెలిపారు.

గరుడ వాహనంపై నారసింహుడు



ప్రధాన గోపురం వద్ద శ్రీవారికి హారతి ఇస్తున్న అర్చకులు



ఆలయంలో పోటెత్తిన భక్త జనం

- పోటెత్తిన భక్తజనం

కదిరి: అశేష భక్త జన గోవింద నామస్మరణల మధ్య ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆదివారం రాత్రి గరుడ వాహనంపై తిరువీధుల్లో దర్శనమిచ్చారు. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మదేవుడు తన ఇష్ట వాహనమైన గరుత్మంతుని నారసింహుడికి వాహనంగా పంపుతారని.. అందుకే ఈ ఉత్సవాన్ని బ్రహ్మ గరుడ సేవ అంటారని ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో సమస్త వాహనాల్లో సర్వ శ్రేష్ఠమైన గరుడ వాహనంపై స్వామివారిని దర్శించుకుంటే స్వర్గం ప్రాప్తిస్తుందని, ఇహ పరమైన ఈతి బాధల నుంచి విముక్తి కల్గుతుందని భక్తుల నమ్మకం. నారసింహుని బ్రహ్మోత్సవాల సమయంలో ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికేది గరుత్మంతుడే కాబట్టి ఈ వాహన సేవకు అంతటి ప్రాధాన్యత ఉందని అర్చకులు తెలిపారు.

హోరెత్తిన గోవింద నామ స్మరణ

భక్త ప్రహ్లాద వరదుడు ఆలయంలో నుంచి ప్రధాన రాజగోపురం వద్దకు రాక మునుపే ఆ ప్రాంతం భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామివారు తూర్పు రాజగోపురం వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా 'శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి గోవిందా..గోవింద' అంటూ హోరెత్తింది. బ్రహ్మ గరుడ సేవలో తూర్పు రాజగోపురం వద్ద స్వామి వారిని దర్శించుకుంటే మరింత పుణ్యం సిద్దిస్తుందని భక్తుల నమ్మకం. విద్యుద్దీపాలంకరణ, కదిరి మల్లెలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు. భక్తుల కాలక్షేపం కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉభయదారులుగా కుటాగుళ్లకు చెందిన బేరి వర్తకులు నారాయణప్ప శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేడు శేషవాహనం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు సోమవారం రాత్రి శేష వాహనంపై తిరు వీధుల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్గించనున్నారు. ప్రతి ఉత్సవంలోనూ నారసింహుడు మాత్రమే తిరు వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చేవారు. అయితే శేషవాహనంపై శ్రీవారు శ్రీదేవి, భూదేవిల సమేతంగా తిరు వీధుల్లో భక్తులకు దర్శనమివ్వడం ఈ ఉత్సవ ప్రత్యేకత.



లక్ష్మీనరసింహస్వామి రథోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు

లక్ష్మీనరసింహ స్వామి వైభవం

బనశంకరి: అత్తిగుప్పెలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం, అర్చనలు చేపట్టి ప్రత్యేక పూలతో అలంకరణచేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి రథంలో కొలువుదీర్చారు. 11.59 గంటలకు మాజీ మంత్రి, విజయనగర ఎమ్మెల్యే ఎం.కృష్ణప్ప, గోవిందరాజనగర ఎమ్మెల్యే ప్రియాకృష్ణలు పూజలు చేయడంతో బ్రహ్మరథోత్సవం ప్రారంభమైంది. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. అనేకప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చి రథోత్సవాన్ని వీక్షించారు. ఆలయ కమిటీ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం చేసింది. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రదీప్‌కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

మురికివాడల్లో సమస్యల పరిష్కారానికి కృషి



రాష్ట్ర మురికివాడల నిర్మూలన మండలి సభ్యుడు సి.ఎం. వెంకటేశ్‌ను సన్మానిస్తున్న నేతలు

శివాజీనగర: రాష్ట్ర మురికివాడల నిర్మూలన మండలి సభ్యుడిగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సి.ఎం. వెంకటేశ్ నియమితులయ్యారు. దళితుల సమస్యలకు స్పందించే నాయకుడిగా ఈయనకు పేరుంది. సి.ఎం. వెంకటేశ్‌ను ఆదివారం మాదిగ దండోరా, మాదిగ రిజర్వేషన్ పోరాట జన జాగృతి సమితి రాష్ట్రాధ్యక్షుడు ఎం.సీ.శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి సి.దాస్, నాయకులు డేవిడ్ రంగన్న, ప్రసాద్, రవీంద్ర తదితరులు ఘనంగా సత్కరించారు. వెంకటేశ్ మాట్లాడుతూ మురికివాడల్లో జీవించే పేదల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. రాజధాని బెంగళూరు నగరంలో ఉన్న అన్ని మురికివాడల్లో పర్యటించి తనవంతుగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మంత్రి జమీర్ అహమ్మద్‌ఖాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నీ అబద్ధాల మాటలే



సమావేశంలో నాయకులు

తుమకూరు: బీజేపీ అంటే ప్రజలను మోసం చేసే పార్టీ, ప్రధాని మోదీ మాయమాటలతో వందసార్లు అబద్ధాలను చెప్పి అది నిజమని నమ్మించే వ్యక్తి, వారి మాటలను నమ్మి ప్రజలు మోసపోరాదు అని సహకార మంత్రి కేఎన్ రాజన్న అన్నారు. ఆదివారం తుమకూరు స్టార్ ప్యాలెస్‌లో బ్లాక్1, బ్లాక్ 2 నాయకుల సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ బీజేపీ నాయకులు ప్రజా వేదికలపైన మాట్లాడతారు తప్ప ప్రజల సమస్యలు పట్టవని ఆనారు. కానీ బీజేపీ నాయకులు మాత్రం ప్రధాని మోదీని విశ్వగురువు అని చెప్పుకుంటున్నారు తప్ప దేశానికి ఆయన చేసింది ఏమీ లేదన్నారు.

పోలీసు అధికారినంటూ వంచన



నిందితురాలు నివేదిత

యశవంతపుర: పోలీసు అధికారినంటూ వంచనకు పాల్పడుతున్న మహిళను హాసన పట్టణంలోని పెన్షన్ మోహల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. రామనగర జిల్లా మాగడి తాలూకా లక్కనహళ్లికి చెందిన నివేదిత అనేక మందిని మోసం చేసినట్లు విచారణలో తేలింది. ఇదే క్రమంలో అగలహళ్లి గ్రామానికి చెందిన సునీల్ ఆమెను కలిసి తన భార్య కవన పుట్టింటికి వెళ్లిందని, సమస్యను పరిష్కరించాలని కోరాడు. దీంతో నివేదిత పోలీసు యూనిఫాం ధరించి కవన ఇంటిపై దాడి చేసింది. తాను ఎస్పీ స్థాయిలో విచారణకు వచ్చానని బెదిరించింది. కవన వద్దనుంచి మొబైల్ ఫోన్, 20 గ్రాముల బంగారు నక్లెస్, 10 గ్రాముల ఉంగరం, రెండు వేల నగదును లాక్కుంది. తమకు మోసం జరిగిందని భావించిన కవన తల్లిదండ్రులు పెన్షన్ మోహల్లా పోలీసులకు ఫిర్యాదు చేయగా నివేదిత వ్యవహారం బయట పడింది. గాలింపు చేపట్టి నిందితురాలిని అరెస్ట్ చేశారు.

కమనీయం..లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం



విశేష అలంకరణలో స్వామివారు



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

- నేడు బ్రహ్మరథోత్సవం

బొమ్మనహళ్లి : హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ అగర గ్రామంలో కొలువైన చరిత్ర ప్రసిద్ధి చెందిన లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి వందలాది మంది భక్తుల సమక్షంలో స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకులు అనంతపురం చంద్రమౌళి ఆధ్వర్యంలో వేద పండితులు శనివారం రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో స్వామివారి కల్యాణాన్ని వేదమంత్రోచ్ఛారణ మధ్య నిర్వహించారు. ఆగరతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరై స్వామివారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించారు. భక్తులకు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా సోమవారం ఉదయం సుమారు 11.30 గంటలకు స్వామి వారి బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నారు.

ఆలయాలను సందర్శించిన మాజీ సీఎంలు



రథంను లాగుతున్న యడియూరప్ప, విజయేంద్ర

యశవంతపుర: మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప తన కుటుంబంతో కలిసి చిక్కమగళూరు జిల్లా కళస తాలూకా హొరనాడు అన్నపూర్ణేశ్వరిదేవిని దర్శించుకున్నారు. రథోత్సవ సేవలో భాగంగా అన్నపూర్ణేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తిని రథంలో కొలువుదీర్చి మంగళ వాయిద్యాల మధ్య యడియూరప్ప, విజయేంద్రలు రథంను ముందుకు లాగారు. అంతకుముందు ఆలయ పాలక మండలి ఆయనకు ఘన స్వాగతం పలికింది.

రంభాపురిలో మరో మాజీ సీఎం

చిక్కమగళూరు జిల్లా ఎన్‌ఆర్‌పుర తాలూకా బాళెహొన్నూరు సమీపంలోని రంభాపురి మఠాన్ని మాజీ సీఎం బసవరాజు బొమ్మై ఆదివారం సందర్శించారు. మఠంలో జరుగుతున్న రేణుకాచార్య జయంతి జాతర మహోత్సవంలో అయన పాల్గొని వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మఠం అధికారులు అయనకు ఘన స్వాగతం పలికి సన్మానించారు.

ఎంపీ రాఘవేంద్రపై కేసు

యశవంతపుర: చిత్రదుర్గలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన ఆరోపణలపై ఎంపీ బీవై రాఘవేంద్రపై చిత్రదుర్గ గ్రామాంతర పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం అయన చిత్రదుర్గ సమీపంలోని భోమి మఠానికి వెళ్లి మఠాధిపతిని కలిశారు. అయితే మఠంలో రాజకీయ సమావేశం నిర్వహించారనే ఆరోపణలపై రాఘవేంద్రపై చిత్రదుర్గ గ్రామాంతర పోలీసులు ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసును నమోదు చేశారు.

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



మూడలగిరియప్పకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

తుమకూరు : మాజీ ఎంపీ సీ.పి. మూడలగిరియప్ప అంత్యక్రియలను ఆదివారం తుమకూరు జిల్లా శిరా తాలూకా చిరతహళ్లిలోని గణేష్ గుడి ఎస్టేట్‌లో ప్రభుత్వ లాంఛనాల మధ్య నిర్వహించారు. పోలీసు సిబ్బంది మూడు పర్యాయాలు గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. కుమారుడు డాక్టర్ రాకేష్‌గౌడ, కుటుంబ సభ్యులు, అభిమానులు భారీగా తరలివచ్చి మూడలగిరియప్పకు కన్నీటి వీడ్కోలు పలికారు. హోం మంత్రి పరమేశ్వర, స్ఫటికపురి మహా సంస్థాన మఠం అధ్యక్షుడు నంజావధూత స్వామీజీ, ఎళెరామపుర కుంచెటిగగురుమహా సంస్థాన మఠం హనుంత నాథ స్వామీజీలు హాజరై మూడలగిరియప్ప భౌతికకాయానికి నివాళులర్పించారు.

తల్లికి అవమానం జరిగిందని కుమార్తె ఆత్మహత్య



చైత్ర(ఫైల్)

తుమకూరు : అప్పు తీర్చాలని బాకీ దారు ఇంటివద్దకు వచ్చి గొడవకు దిగింది. తల్లికి అవమానం జరిగిందనే బాధతో కుమార్తె ఆత్మహత్యకు పాల్పడింది. ఈఘటన తుమకూరు జిల్లా కుణిగల్ తాలూకా కోడిహళ్లి పాళ్య గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లలితమ్మ అదే గ్రామానికి చెందిన శాంతమ్మ ఆనే మహిళ వద్ద రూ.18వేలు అప్పు తీసుకుంది. ప్రతి వారం వడ్డీ చెల్లిస్తోంది. గత వారం ఊరి పండగ ఉండటంతో వడ్డీ చెల్లించలేదు. దీంతో లలితమ్మ ఇంటివద్దకు వచ్చిన శాంతమ్మ ఇష్టానుసారం మాట్లాడి గొడవకు దిగింది. తల తాకట్టు పెట్టయినా వారం రోజుల్లో అప్పు తీర్చాలని శాంతమ్మ హుకుం జారీ చేసింది. తల్లికి అవమానం జరిగిందని మనో వేదనకు గురైన లలితమ్మ కుమార్తె చైత్ర(20) బాత్‌రూమ్‌లోకి వెళ్లి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎంతసేపటికీ కుమార్తె బయటకు రాకపోవడంతో వెళ్లి చూడగా చైత్ర విగతజీవిగా కనిపించింది. కుణిగల్ పోలీసులు వచ్చి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

సొగడుకు బీజేపీ పిలుపు

తుమకూరు: గత శాసన సభ ఎన్నికల్లో బీజేపీని వీడిన మాజీ మంత్రి సొగడు శివణ్ణ మళ్లీ బీజేపీలో చేరనున్నారు. తుమకూరు నగరంలో జరిగిన దేశభక్త సమాన మనస్కుల సమావేశంలో బీజేపీ నాయకుడు సీటీ రవి, తుమకూరు బీజేపీ ఎంపీ అభ్యర్థి వి.సోమన్న.. సొగడు శివణ్ణను బీజేపీలోకి ఆహ్వానించారు. రాజకీయాల్లో మంచి కాలం, చెడు కాలం అనేది ఉంటుందని, సొగడుకు చెడు కాలం పోయిందని రవి అన్నారు. పార్టీ కార్యకర్తలు దేశానికి సైనికులు ఎలా కాపాడుతారో అలా పార్టీ కోసం పని చేయాలని అన్నారు. ప్రధాని మోదీని మళ్లీ ప్రధానిని చేయాలని చెప్పారు.

హోసూరు వార్తలు..

గ్రామస్తుల ఆందోళన



ధర్నా చేస్తున్న దృశ్యం

కెలమంగలం: సాగు భూములకు పట్టాలందజేయాలని డిమాండ్ చేస్తూ కుందుకోట గ్రామపంచాయతీ గ్రామాల ప్రజలు ఆదివారం ఆందోళన చేశారు. డెంకణీకోట తాలూకా కుందుకోట గ్రామ పంచాయతీలోని ఏణిబండ, వీరశెట్టిచెరువు, హొసహళ్లి, సొప్పుగుట్ట, కురుబరాణి, ఆలతి, గొల్లహళ్లి తదితర గ్రామస్థులు పారంపర్యంగా సాగు చేస్తున్న భూములకు పట్టాలందజేయాలని, నివాసముంటున్న ఇళ్లకు పట్టాలందించాలని, పాఠశాలలకు వెళ్లే విద్యార్థినీవిద్యార్థులకు బస్సువసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తీర్చకపోతే ఈ లోక్‌సభ ఎన్నికలలో పాల్గొనబోమని ప్రకటించారు.

ఆన్‌లైన్‌లో లక్షలు టోకరా

హోసూరు: యూట్యూబ్ లింక్ ద్వారా డబ్బులు సంపాదించవచ్చని పారిశ్రామికవేత్త నుంచి రూ. 19.68 లక్షల నగదును సైబర్ దొంగలు కాజేశారు. వివరాల్లోకెళితే జిల్లా కేంద్రం క్రిష్ణగిరి జక్కప్పన్‌నగర్‌కు చెందిన పారిశ్రామికవేత్త కార్తికేయన్ (49)కు కొన్నిరోజుల క్రితం టెలిగ్రాం మెసేజ్ వచ్చింది, అందులో పార్ట్ టైం టాస్క్ ద్వారా అధిక లాభం పొందవచ్చునని, తమ వద్ద పెట్టుబడి పెడితే రెండింతలు పొందవచ్చునని చెప్పారు. స్పందించిన కార్తికేయన్ కొద్దికొద్దిగా నగదును డిపాజిట్ చేశాడు. ఎలాంటి లాభం రాకపోవడంతో మెసేజ్ పంపిన నంబర్‌ను సంప్రదించాడు. స్విచాఫ్ రావడంతో మోసపోయినట్లు తెలుసుకుని క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని సైబర్ దొంగల కోసం గాలిస్తున్నారు.

యువతి కిడ్నాప్‌పై ఫిర్యాదు

క్రిష్ణగిరి: పెళ్లి చేసుకొంటానని ఆశ చూపి యువతిని కిడ్నాప్ చేశాడని యువతి సోదరుడు సూళగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల మేరకు సూళగిరి సమీపంలోని పెరియగుదిబాల గ్రామానికి చెందిన యువతి (23) ఇంటివద్దకే విద్య పథకంలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తుంది. రెండురోజుల క్రితం ఇంటి నుంచి బయటకెళ్లిన యువతి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించినా జాడ తెలియలేదు. సూళగిరి సమీపంలోని ఎర్రండపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్ (24) యువతిని కిడ్నాప్ చేసినట్లు స్థానికులు చెప్పారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి ఎస్‌ఎస్‌ఎల్‌సీ పరీక్షలు

బనశంకరి: రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌ఎస్‌ఎల్‌సీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10.15 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలతో కలిపి 4,41,910 మంది బాలురు, 4,28,058 మంది బాలికలతో పాటు మొత్తం 8,69,968 మంది పరీక్షలకు హాజరుకానుండగా రాష్ట్ర వ్యాప్తంగా 2,750 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. హాల్‌టికెట్ చూపించి బీఎంటీసీ, కేఎస్‌ఆర్‌టీసీతో పాటు ఇతర రవాణా సంస్థ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయం కల్పించారు. పరీక్షాకేంద్రాల చుట్టూ 200 మీటర్లు ఆంక్షలు విధిస్తూ పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. పరీక్షల్లో అక్రమాల నియంత్రణకు పరీక్షాకేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు అమర్చారు.

యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి



భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని తీర్థ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ప్రకాశ్ పిలుపునిచ్చారు. తాలూకాలోని కరేకల్లహళ్లిలోని నేతాజీ యువక సంఘం కార్యాలయ ఆవరణలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాల అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ చిత్రపటాలకు నివాళులర్పించారు. డాక్టర్ ప్రకాశ్ మాట్లాడుతూ ఈముగ్గురు నేతలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గౌరవాధ్యక్షుడు రవీంద్రనాథ్, అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి గౌరీశ్, ద్వారకేశ్, జయణ్ణ, హరి,జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థి విజయానికి శ్రమించండి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి తేజస్వీ సూర్య

బొమ్మనహళ్లి : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలో బీజేపీ 25 స్థానాల్లో విజయం సాధిస్తుందని బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి అన్నారు. హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్‌లోని వైట్‌హౌస్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో బెంగళూరు దక్షిణ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి తేజస్వి సూర్యతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ విధానాలను మెచ్చి ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోందన్నారు. కార్యకర్తలు కేంద్రంలోని పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి అభ్యర్థి తేజస్వి సూర్యను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. జయనగర ఎమ్మెల్యే సి.కే.రామమూర్తి, ఎమ్మెల్సీ గోపినాథ్ రెడ్డి, బొమ్మనహళ్లి బీజేపీ అధ్యక్షుడు శివాజీ, బెంగళూరు దక్షిణ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు ఉమేష్ శెట్టి, శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్ సలాం పాల్గొన్నారు.

అక్రమ మద్యం, గుట్కా సీజ్

హోసూరు: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని సిప్‌కాట్ పోలీసులు అరెస్ట్ చేశారు. సిప్‌కాట్ పోలీసులు శనివారం రాత్రి హోసూరు సమీపంలోని పూనపల్లి సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఒక ద్విచక్రవాహనంలో తరలిస్తున్న రూ. 12960 విలువ చేసే 144 కర్ణాటక మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. కెలమంగలం జిబి ప్రాంతానికి చెందిన మంజునాథ్ (36)ని అరెస్టు చేశారు. అలాగే బాగలూరు సమీపంలోని కగ్గనూరు చెక్‌పోస్ట్ వద్ద శనివారం రాత్రి ఎన్నికల అధికారులు ఒక బస్సులో తనిఖీ చేశారు. తిరువణ్ణామలై జిల్లా సెంగం ప్రాంతానికి చెందిన చెన్నక్రిష్ణన్ (63) గుట్కా తరలిస్తూ పట్టుబడ్డాడు.

వృషభ వాహన సేవ



స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

హోసూరు: మరకతాంబ సమేత శ్రీ చంద్రచూడేశ్వరస్వామి ఆలయ రథోత్సవాల సందర్భంగా శనివారం రాత్రి విశేషంగా వృషభ వాహనంపై ఉంచి ఊరేగించారు. ఉత్సవమూర్తిని వృషభ వాహనంపై తిరువీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకొన్నారు.

గోపీనాథ్‌కు కాంగ్రెస్ ఎంపీ టికెట్

హోసూరు: లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమిలోని కాంగ్రెస్ పార్టీ క్రిష్ణగిరి ఎంపి అభ్యర్థి ఆకస్మిక మార్పు చర్చనీయాంశమైంది. సిట్టింగ్ ఎంపీ చెల్ల కుమార్‌కు సీటు ఖాయమని ఎదురు చూస్తున్న కార్యకర్తలకు కాంగ్రెస్ షాకిస్తూ హోసూరు మాజీ ఎమ్మెల్యే కే.గోపినాథ్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. ఇక అన్నాడీఎంకే అభ్యర్థిగా హోసూరు కార్పొరేటర్ జయప్రకాష్, బీజేపీ నుంచి మాజీ ఎంపి నరసింహన్, నామ్‌తమిళర్‌కచ్చి నుంచి అడవిదొంగ వీరప్పన్ కూతురు విద్యారాణి క్రిష్ణగిరి ఎంపి స్థానంలో పోటీ చేయబోతున్నారు.
వీరిలో కే.గోపీనాథ్, జయప్రకాష్‌లు స్థానికులు, ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఓట్లు చీలే అవకాశం ఉంది. అన్నాడీఎంకే, కాంగ్రెస్ మధ్య ప్రధాన పోటీ సాగే అవకాశముంది.

క్లుప్తంగా...

అద్దెకు జనసేన కార్యాలయం



టు లెట్ బోర్డు పెట్టిన జనసేన కార్యాలయం

డోన్: నంద్యాల జిల్లా డోన్ మండలం ఉడుములపాడు గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన జనసేన కార్యాలయం నేడు మూతపడింది. పట్టుమని 30 రోజులు గడవకముందే 'అద్దెకు ఇవ్వబడును' అనే బోర్డును తగిలించడాన్ని చూసి గ్రామస్తులతో పాటు జనసైనికులు నివ్వెర పోతున్నారు. కార్యాలయం నిర్వహించే స్తోమత లేనప్పుడు ఆర్భాటంగా బోర్డులు ఎందుకు తగిలించారని జనసేన నాయకులను నిలదీస్తున్నారు.

పవన్ స్టిక్కర్‌ను తొలగించిన జనసేన కార్యకర్త



జనసేన స్టిక్కర్‌వున్న వాహనం



వైఎస్సార్‌సీపీ స్టిక్కర్ వేసిన అదే వాహనంపై కొప్పూరి సాగర్

మంగళగిరి: చంద్రబాబును సీఎం చేస్తామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అంటే, అందుకు కార్యకర్తలు సిద్ధంగా లేరని జనసైనికుడు కొప్పూరి సాగర్ పేర్కొన్నారు. జనసేన స్థాపించినప్పటి నుంచి పార్టీ వెంట నడిచిన సాగర్, ఆదివారం తన ద్విచక్రవాహనంపై ఉన్న జనసేన స్టిక్కర్ తొలగించి వైఎస్సార్ సీపీ స్టిక్కర్ వేయడంతో నగర పరిధిలోని బేతపూడికి చెందిన జనసైనికులు కంగుతిన్నారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ ఎంతసేపూ బాబును సీఎం చేయాలనే లక్ష్యం తప్ప, తాను సీఎం కావాలనే లక్ష్యం లేని పవన్ వెంట నడిచేందుకు కాపులు సిద్ధంగా లేరన్నారు. సీఎం జగన్ ఒక్కడే కాపులకు న్యాయం చేస్తాడని నమ్ముతున్నామని, కాపుల సంక్షేమం కోరే ముద్రగడ పద్మనాభం వైఎస్సార్‌సీపీలో చేరారన్నారు. ఇకపై ఎప్పటికీ పవన్‌ను నమ్మేదిలేదని స్పష్టం చేశారు. పిఠాపురంలో పవన్‌కు ఓటమి తప్పదని పేర్కొన్నారు.

బండారుకు అస్వస్థత

పెందుర్తి టికెట్ దక్కకపోవడంతో మనోవేదన



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బండారు

పరవాడ(పెందుర్తి): పెందుర్తి టీడీపీ టికెట్ ఆశించి భంగపడిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ని హుటాహుటిన నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి బండారు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ప్రకటించారు. షుగర్ లెవల్స్ తగ్గిపోవడం వల్ల పల్స్ రేటు గణనీయంగా పడిపోవడంతో అస్వస్థతకు గురయ్యారని వైద్యులు నిర్ధారించారు. కొన్ని రోజులుగా ఇంటికే పరిమితమైన బండారుకు అధిష్టానం మూడో లిస్టులో కూడా టికెట్ కేటాయించకుండా షాక్ ఇవ్వడంతో ఆయన తీవ్ర ఆవేదనతో అస్వస్థతకు గురయ్యారు. పెందుర్తి టికెట్ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల రమేష్‌బాబుకు ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బండారును ఆ పార్టీ నేతలు గణబాబు, పీలా శ్రీనివాసరావు, భరత్, చిరంజీవి పరామర్శించారు.

ఒంటరిగా వెళితే ఓటమి తప్పదని చెప్పకనే చెప్పారు

బాబు, పవన్‌పై మంత్రి కారుమూరి విమర్శ



మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తనది 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు ఒంటరిగా జగన్‌ను ఎదుర్కోలేక అన్ని పార్టీలనూ వెంటేసుకొస్తున్నాడని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ఆదివారం శ్రీ కొండాలమ్మ తల్లి ఆలయంలో కొబ్బరికాయ కొట్టి ఆయన ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పేరు వింటేనే బాబు, పవన్‌కు వెన్నులో వణుకు మొదలవుతుందని, మూడు జెండాలతో వచ్చే పరిస్థితి ఏర్పడిందంటే అక్కడే జగన్ విజయం సాధించారని అన్నారు. ఏపీలో ఉన్న రాజకీయ పార్టీలన్నీ ఒంటరిగా జగన్‌ను ఎదుర్కోలేమనే స్థాయికి వచ్చాయంటే ప్రజల్లో జగన్ ఎంత బలంగా ఉన్నారో అర్థమవుతుందన్నారు. ఐదేళ్ల ప్రజారంజక పాలన అందించి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు వెళ్తుంటే.. తానేది చెప్పినా ప్రజలు నమ్మరని తెలుసుకున్న బాబు అధికార పార్టీపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఎన్ని మాయమాటలు చెప్పినా నిన్ను నమ్మం బాబూ అంటూ ప్రజలు వ్యతిరేకిస్తుండడాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడన్నారు.

శవాలపై పేలాలు

టీడీపీ సర్కారు నిర్వాకాలను వైఎస్సార్‌సీపీకి ఆపాదిస్తూ రామోజీ క్షుద్ర రాతలు

రాజకీయ లబ్ధి కోసం చావులనూ వదలని రాజ గురివింద

రాజంపేట: అసలే అంతులేని అప్పుల భారం.. ఆపై పచ్చ మూకల ఆన్‌లైన్ భూ మాయాజాలం! ఇదీ అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో చేనేతకారుడు పాల సుబ్బారావు కుటుంబం విషాదకర చావులకు అసలు కారణం! దీన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అంటగడుతూ, రాష్ట్రమంతా ఇలాగే జరిగిపోతోందంటూ శోకాలు పెడుతూ ఈనాడు రామోజీ మరోసారి శవాలపై పేలాలను ఏరుకున్నారు! దాదాపు రూ.అరకోటి దాకా తలకు మించిన అప్పులు, భూముల రికార్డులు తారుమారు కావడమే తమ చావులకు దారి తీసినట్లు మరణ వాంగ్మూలంలో సుబ్బారావే వెల్లడించాడు. అప్పులు చేసింది తానేనని బాధితుడే స్వయంగా ఒప్పుకున్నాడు. మరి ఇక భూములు రికార్డులు తారుమారు ఎప్పుడయ్యాయి? ఎవరు చేశారు? అనేది కదా తేలాల్సిన కీలక అంశం. టీడీపీ హయాంలో 2015లో ఆన్‌లైన్‌లో భూముల మాయాజాలం కారణంగా బాధితుడు వంచనకు గురయ్యాడు. ఎక్కడో కొండల్లో ఉన్న ప్రభుత్వ భూమిని నాడు పచ్చమూకలు రికార్డులు తారుమారు చేసి బాధితుడి తండ్రి చలపతి పేరుతో ఆన్‌లైన్‌లో చేర్చినట్లు నమ్మించాయి. ఆ వెంటనే మరొకరి పేరుతో మార్చి ఇదే వంచనను కొనసాగించాయి. పచ్చమూకలు ఒకరి తరువాత ఒకరిని మోసగించాయి. ఇవేవీ నిన్నో మొన్నో జరిగిన వ్యవహారాలు కాదు. నిజానికి ఆ భూమిని సుబ్బారావుకే కాదు.. ఎవరికీ అసైన్‌మెంట్ (డీకేటీ) కింద ప్రభుత్వం కేటాయించనేలేదు. గతంలో ఎవరూ అధికారికంగా, అనధికారికంగా సాగు చేసిన దాఖలాలూ లేవు. ఆ భూమిని తనకు



వైకాపా భూదందాలకు
సామాన్యులే సమిధలు
నేత కుటుంబాన్ని చిదిమేశారు!

కేటాయించాలని బాధితుడు ఎన్నడూ కూడా అర్జీ పెట్టుకోలేదు. మరి అలాంటప్పుడు వ్యక్తిగత సమస్యలతో ఓ వ్యక్తి తన కుటుంబాన్ని బలి తీసుకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లడం ఏమిటనే ఇంగితం రాజ గురువుకు ఉండాలి కదా?

రికార్డుల్లో లేకుండా ఆన్‌లైన్‌లో మాయ

మృతుడు సుబ్బారావు తన తండ్రి వెంకట చలపతి పేరుతో 2187/2 సర్వే నెంబరులో 3.10 ఎకరాల భూమి (ఖాతా నెంబరు 1712) ఉన్నట్లు ఆత్మహత్య లేఖలో పేర్కొన్నాడు. ఆన్‌లైన్‌లో ఎక్కించినట్లు తొలుత సుబ్బారావును 2015లో నమ్మించగా ఆ తరువాత 2017లో కట్టా శ్రావణి పేరుతో ఆన్‌లైన్‌లో చేర్చారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఉన్న కట్టా శ్రావణికి 2020 నుంచి రైతు భరోసా వస్తున్నట్లు వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి చెబుతున్నారు. రెవెన్యూ రికార్డుల మేరకు సర్వే నెంబరు 2050 కొండ నుంచి సబ్ డివిజన్ చేశారు. ఇందులో 9.12 ఎకరాల భూమి ఉండగా మూడు సబ్ డివిజన్లు చేశారు. 2187/1 విస్తీర్ణంలో 3.76 ఎకరాలు, 2187/2 విస్తీర్ణం 5.00 ఎకరాలు, 2187/3 విస్తీర్ణంలో 0.36 ఎకరాలు సబ్ డివిజన్ చేశారు. ఈ సర్వే నెంబర్లలో మృతుడి తండ్రి వెంకట చలపతి పేరుతో డీకేటీ పట్టా ఇచ్చినట్లు రికార్డులో నమోదు కాలేదని రెవిన్యూశాఖ స్పష్టంగా చెబుతోంది. మృతుడి తండ్రి పేరుతో ఉన్నట్లు చెబుతున్న భూమి సాగులో కానీ, ఎవరి అనుభవంలోగానీ లేదు. ఆ భూమి, రాళ్లు, చెట్లతో కూడుకుని ఉంది. టీడీపీ హయాంలో చోటు చేసుకున్న ఈ అవకతవకలపై ఉన్నతస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ శాఖ సన్నద్ధమైంది.

నేతకు దూరంగా.. అప్పుల ఊబిలో

విభజన అనంతరం 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ రికార్డుల తారుమారు మొదలుకొని లెక్కలేనన్ని భూ మాయాజాలాలు జరిగాయి. చేనేతకారుడు సుబ్బారావు దీనికి బలి పశువుగా మారాడు. సుబ్బారావు చాలా రోజులుగా చేనేత పనులకు దూరంగా ఉంటూ జీవనాన్ని నెట్టుకొస్తున్నాడు. మద్యానికి బానిస కావడం, ఆపైన క్రికెట్ బెట్టింగ్ లాంటి వ్యసనాలున్నాయి. అందిన చోట అధిక మొత్తంలో అప్పులు చేశాడు. తిరిగి వాటిని తీర్చలేక భార్య, కుమార్తెకు మత్తు ఇచ్చి హతమార్చి ఆ తరువాత ఒంటిమిట్ట చెరువు సమీపంలో రైల్వే ట్రాక్‌పై వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

అది ప్రభుత్వ భూమే



ఒంటిమిట్ట: కుటుంబాన్ని కడతేర్చి ఆత్మహత్యకు పాల్పడ్డ చేనేతకారుడు పాలా సుబ్బారావు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు అప్పులు చేసినట్లు తమ విచారణలో వెలుగులోకి వచ్చినట్లు కడప డీఎస్పీ షరీఫ్ తెలిపారు. ఎవరెవరికి ఎంత అప్పు ఉన్నాడనే వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. బాధితుడు తన కుటుంబం పేరుతో ఉన్నట్లు చెబుతున్న 3.10 ఎకరాల భూమిపై కడప ఆర్డీవో ప్రత్యేకంగా విచారణ చేపట్టి పూర్తి స్పష్టత ఇచ్చారని వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం అది పక్కాగా ప్రభుత్వ భూమి అని, అందులో ఎలాంటి డీకేటీ పట్టాలు గానీ, ఇతర పట్టాలు గానీ ప్రభుత్వం ఇవ్వలేదని స్పష్టం చేశారు. 2015లో సుబ్బారావు ఇతరుల సహకారంతో ఆన్‌లైన్‌లో తన పేరు నమోదు చేశారని, అనంతరం రెండేళ్లకు (2017లో) మరొకరి పేరుతో అదే భూమి ఆన్‌లైన్‌లో మార్చేశారని చెప్పారు. ఆన్‌లైన్‌లో తారుమారు చేశారే గానీ ప్రభుత్వం తరపున 3.10 ఎకరాలకు సంబంధించి ఎలాంటి పత్రాలు ఇవ్వలేదన్నారు. నాడు ఆన్‌లైన్‌లో ఎవరు చేర్చారు? రెవెన్యూ శాఖలో ఎవరి ప్రమేయం ఉంది? అనే అంశాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. 2015లో పీఎం కిసాన్ లేదని, తర్వాత కూడా సుబ్బారావు పేరుతో పీఎం కిసాన్ సాయం పడలేదని తెలిపారు. సుబ్బారావు వ్యసనాలకు బానిసగా మారి క్రికెట్ బెట్టింగ్ కారణంగా అప్పుల పాలై చనిపోవాలని నిర్ణయించుకున్నాడన్నారు.

–ఎండీ షరీఫ్ డీఎస్పీ ,కడప

డీకేటీ పట్టా ఇవ్వలేదు..



పాల సుబ్బారావు అప్పులు చెల్లించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి వెంకట చలపతి పేరుతో డీకేటీ పట్టా మంజూరు చేసినట్లు రికార్డుల్లో ఎక్కడా నమోదు కాలేదు. ఆ సర్వే నంబరు ఉన్న భూమి సాగు, అనుభవంలో లేదు. రాళ్ల ,చెట్లతో నిండి ఉంది. అది కట్టా శ్రావణి పేరుతో ఎలా మార్పు జరిగిందనే అంశంపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

–వెంకటరమణ, తహసీల్దారు, ఒంటిమిట్ట

గతంలో జరిగిన మోసమే..



టీడీపీ పాలనలోనే సుబ్బారావు, కట్టా శ్రావణి ఆన్‌లైన్ భూముల వ్యవహారాలు జరిగాయన్నది సత్యం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదచల్లడం విచారకరం. గతంలో జరిగిన మోసాన్ని ఈ ప్రభుత్వంపై రుద్దడం ఎన్నికల స్టంట్ అని చేనేత కార్మికులతోపాటు ప్రజలందరికీ తెలుసు. భూమి ఆన్‌లైన్‌లో మారిన కొత్తపల్లెకు చెందిన కట్టా శ్రావణి విదేశాల్లో ఉన్నారని చెబుతున్నారు. సుబ్బారావు కుటుంబం మృతి ఘటన మమ్మల్ని కలిచివేసింది. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

–పి.శేషారెడ్డి, కొత్త మాధవరం, ఒంటిమిట్ట

బాబు శవ రాజకీయాలు: ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

టీడీపీ అధినేత చంద్రబాబు శవ రాజకీయాలతో పబ్బం గడుపుకోవడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి విమర్శించారు. సుబ్బారావు, పద్మావతి, వినయ మృతదేహాలకు ఆయన నివాళులర్పించి పెద్ద కుమార్తెను ఓదార్చారు. తామున్నామని ధైర్యం చెప్పారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సుబ్బారావు భూమికి సంబంధించి ఆన్‌లైన్ వ్యవహారం టీడీపీ హయాంలోనే జరిగిందనే విషయం గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. సుబ్బారావు కుటుంబానికి అన్యాయం చేసిన వారు ఎవరైనా సరే ఉరి తీయాలన్నారు. బాధిత కుటుంబానికి అండగా నిలబడాల్సింది పోయి రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వంపై బురదచల్లడం చంద్రబాబు చిల్లర రాజకీయానికి నిదర్శనమన్నారు. బీసీల సంక్షేమం కోసం సీఎం జగన్ ఎంత కృషి చేశారో బడుగులందరికీ తెలుసన్నారు. ఈ ఘటనను సీఎం జగన్ దృష్టికి తెచ్చి న్యాయం చేస్తామన్నారు.

ఇక్కడ షరతులు.. అక్కడ హారతులా!?

- తనకు తెలియకుండా జనసేనకు ప్రచారం చేయరాదని టీడీపీ నేత వర్మ హుకుం
- తాను మాత్రం విజయవాడ వెళ్లి పవన్‌తో చెట్టాపట్టాలు



విజయవాడలో పవన్‌ను కలిసిన వర్మ

పిఠాపురం: స్థానిక టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ తీరుపై ఆ పార్టీ నాయకులతో పాటు జనసేన నేతలు మండిపడుతున్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి పోటీ చేయనున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై ఇక్కడి మాజీ ఎమ్మెల్యే వర్మ అసంతృప్తి వ్యక్తంచేసి.. టీడీపీ నేతలెవ్వరూ తనకు తెలియకుండా జనసేనకు ప్రచారం చేయరాదంటూ హుకుం జారీచేశారు. కానీ ఆయన మాత్రం విజయవాడ వెళ్లి జనసేన నేత పవన్‌తో భేటీ కావడంపై స్థానిక జనసేన నేతలు మండిపడుతున్నారు. కొంతకాలం నుంచి వివిధ సమావేశాల్లో వర్మ మాట్లాడుతూ, పిఠాపురంలో ఉన్నదంతా టీడీపీనే అని, జనసేన అనేది లేదని తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఒక పక్క జనసేన నేత పవన్‌కు వ్యతిరేకం కాదని, ఆయన విజయానికి కృషి చేస్తామని చెబుతూనే.. అంతా తన ఇష్ట ప్రకారమే జరగాలంటూ షరతులు పెట్టారు. జనసేన నేత తన దగ్గరకు వచ్చి కలిసే వరకూ ఎవరూ జనసేనతో కలిసి ప్రచారం చేయరాదని పరోక్షంగా హుకుం జారీచేసినట్లు టీడీపీ నేతలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక టీడీపీ నేతలు జనసేన ప్రచారాలకు వెళ్లకుండా వర్మ ఆదేశాలను పాటిస్తున్నారు. కానీ వర్మ మాత్రం చడీచప్పుడు లేకుండా ఆదివారం విజయవాడ వెళ్లి, పవన్‌ను కలిసి, పుష్పగుచ్ఛంతో సత్కరించి, చెట్టాపట్టాలు కట్టడం చూసి, స్థానిక టీడీపీ నేతలు ముక్కున వేలేసుకుంటున్నారు. తమను జనసేనతో కలవద్దని చెప్పిన ఆయన అక్కడకు వెళ్లి పవన్‌ను ఎలా కలిశాడంటూ మండిపడుతున్నారు. పొత్తు ధర్మం పాటించాలంటూ టీడీపీ అధినేత చంద్రబాబు చెబితే అన్నీ ఒప్పుకొని వచ్చి, ఇక్కడ మాత్రం తానే సేనాధిపతినని, తన మాట కాదంటే ఊరుకోబోనని, తనకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని వర్మ ఇటీవల పత్రికాముఖంగా తేల్చి చెప్పారు. ఈక్రమంలో ఆదివారం ఆయన విజయవాడలో పవన్‌తో ప్రత్యక్షమవ్వడం చూసి టీడీపీ నేతలు అవాక్కయ్యారు. ఇదేం డ్రామా అంటూ ఎద్దేవా చేస్తున్నారు. ఇదిలా ఉంటే కాకినాడ, అమలాపురం, రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జి సుజయకృష్ణ రంగారావు ఆదివారం పవన్‌ను కలిసి పిఠాపురం పరిస్థితులు వివరించారు.

తిరుగుబాటు 'సేన'

- జనసేనలో నిరసన సెగలు
- కాకినాడ మాజీ మేయర్ సరోజ రాజీనామా
- పవన్ తీరుపై కోనసీమ జనసేన కార్యకర్తల మండిపాటు



జనసేనకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటిస్తున్న మాజీ మేయర్ సరోజ

కాకినాడ రూరల్/సాక్షి, కోనసీమ: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై ఆయన సైన్యం తిరుగుబాటు జెండా ఎగరేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సీట్ల కేటాయింపుపై నిరసన వ్యక్తం చేస్తోంది. తమను పార్టీ కోసం వాడుకుని కరివేపాకులా తీసిపడేశారని ఆవేదన వ్యక్తం చేస్తోంది. తాజాగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ మహిళా నేత, కాకినాడ మాజీ మేయర్ పోతసపల్ల సరోజ చెరియన్ తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. స్థానిక సర్పవరం జంక్షన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పవన్ కళ్యాణ్‌కు రాసిన రాజీనామా లేఖను ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ, తన ఆత్మగౌరవాన్ని పార్టీ దెబ్బ తీసిందన్నారు. జనసేన తీసుకున్న ముష్టి 21 సీట్లలో ఒక్కటీ శెట్టిబలిజలకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓడిపోయేచోట ఒక్క మహిళకు మాత్రమే సీటు ఇవ్వడంపై మండిపడ్డారు. నాదెండ్ల మనోహర్ తెలుగుదేశం పార్టీ కోవర్టు అని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ పదేపదే చెబుతున్నట్టుగా పోల్, బూత్ మేనేజ్‌మెంట్లు లేకపోవడానికి కారణం కేవలం నాదెండ్ల మనోహరే అని ధ్వజమెత్తారు. వారాహి యాత్రలో కత్తిపూడి నుంచి కాకినాడ వరకూ ఊకదంపుడు ప్రసంగాలు చేసిన పవన్ కళ్యాణ్ శెట్టిబలిజలకు ఎందుకు సీటు ఇవ్వలేదని ప్రశ్నించారు. నాదెండ్ల మనోహర్ పవన్‌ను, జనసేనను ముంచేశారని, ఇప్పటికైనా పవన్ కళ్లు తెరవాలని హితవుపలికారు. పవన్ చుట్టూ ఉండే కోటరీలో హరిప్రసాద్, కేకే, చక్రవర్తి, మనోహర్ తదితరులే మాట్లాడతారని విమర్శించారు. తాను కాకినాడ రూరల్ సీటు ఆశించి మోసపోయానని చెప్పారు. త్వరలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని, జనసేన కాకినాడ రూరల్ అభ్యర్థి పంతం నానాజీకి వ్యతిరేకంగా పని చేస్తానని సరోజ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆమె భర్త చెరియన్ కూడా పాల్గొన్నారు.

కొత్తగా పార్టీలో చేరిన వారికి టికెట్లా!

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జనసేన పోటీ చేసే రెండు సీట్లలోనూ కొత్తగా పార్టీలో చేరిన వారికే టికెట్లు ఇవ్వడంపై ఆ పార్టీ ఇన్‌చార్జులు మండిపడుతున్నారు. పి.గన్నవరం అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ స్థానికుడే అయినా తెలంగాణ క్యాడర్ ఉద్యోగి. జనసేన నుంచి టికెట్ హామీ వచ్చిన తరువాతే ఉద్యోగానికి జనవరి 31న వాలంటరీ రిటైర్‌మెంట్ ప్రకటించారు. పార్టీలో రెండు నెలల నుంచి మాత్రమే చురుగ్గా ఉన్నారు. రాజోలు అభ్యర్థి దేవ వరప్రసాద్‌ను అధికారికంగా ప్రకటించకున్నా ప్రచారం చేస్తున్నారు. ఈయన పార్టీలో చేరి రెండేళ్లు కావస్తున్నా స్థానికంగా పెద్దగా పరిచయాలు లేవు. స్థానికంగా రాపాక రమేష్‌బాబు, బొంతు రాజేశ్వరరావు పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనేవారు. వీరిద్దరికీ పార్టీ మొండిచేయి చూపినట్టు తెలుస్తోంది. అమలాపురం పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న శెట్టిబత్తుల రాజబాబు, పార్లమెంట్ ఇన్‌చార్జిగా ఉన్న డి.ఎం.ఆర్.శేఖర్, బీసీ నేత, శెట్టిబలిజ వర్గానికి చెందిన పితాని బాలకృష్ణలనూ పవన్ పక్కనపెట్టారు. గత ఎన్నికలలో బాలకృష్ణ ముమ్మిడివరం నుంచి పోటీ చేశారు. మండపేట, కొత్తపేట, రామచంద్రపురం పార్టీ ఇన్‌చార్జిలుగా ఉన్న వేగుళ్ల లీలాకృష్ణ, బండారు శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రశేఖర్‌కూ పవన్ ఝలక్ ఇచ్చారు. వీరి భవిష్యత్తుపై పవన్ నుంచి ఎలాంటి హామీ లేదని సమాచారం. దీంతో వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం రూ.కోట్లు ఖర్చుచేస్తే ఇప్పుడు కరివేపాకులా తీసిపడేశారని మండిపడుతున్నారు. గత ఎన్నికల్లో జిల్లాలో జనసేనకు 29శాతం ఓటింగ్ వచ్చినా పవన్ కేవలం రెండుస్థానాలతో సరిపెట్టుకోవడం ఆ పార్టీ నేతలకు మింగుడు పడడం లేదు.

నిరసనలు.. నిలదీతలు.. ప్రశ్నల వర్షం

- లోకేశ్ ప్రచారంలో ఇదీ పరిస్థితి
- సమాధానం చెప్పలేక నీళ్లు నములుతున్న వైనం
- ప్రచారానికి ముఖ్య నేతల దుమ్మా



పోలీస్ అధికారితో వాదిస్తున్న నారా లోకేశ్

మంగళగిరి : మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్‌కు నిరసనలు, నిలదీతలు తప్పడం లేదు. మంగళగిరి పట్టణంలో రెండు రోజుల కిందట ముస్లిం మైనార్టీ నాయకులను లోకేశ్ కలవగా.. బీజేపీతో నేరుగా పొత్తు పెట్టుకున్న మీకు మైనార్టీలు ఓటు ఎందుకు వేయాలని ప్రశ్నించడంతో ఆయన నీళ్లు నమిలిన విషయం తెలిసిందే. తాడేపల్లి ఎన్టీఆర్ కట్ట మీద ఆదివారం ప్రచారానికి వెళ్లగా అక్కడా స్థానికులు లోకేశ్‌ను నిలదీశారు. కరోనా సమయంలో ఏమయ్యారు? పుష్కరాల సందర్భంగా తొలగించిన కుటుంబాలకు మీ తండ్రి పట్టాలు ఎందుకు ఇవ్వలేదు? తాడేపల్లి దేవదాయ, నీటి పారుదల శాఖ స్థలాల్లో ఎన్నో ఏళ్లుగా ఉంటున్న వారికి ఇప్పుడు పట్టాలు ఇస్తామంటున్నారు.. అందుకు చట్టాలు అంగీకరిస్తాయా? అంగీకరిస్తే 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న మీ తండ్రి చంద్రబాబు ఎందుకు ఇవ్వలేదు? అంటూ.. నిలదీయడంతో ఏం సమాధానం చెప్పాలో తెలియక లోకేశ్ వెనుదిరిగారు. స్థానికుల నుంచి నిరసనలు, నిలదీతలు ఎదురవుతుండటంతో స్థానిక నాయకులు కూడా ప్రచారానికి దుమ్మా కొడుతున్నారు. ఇలా మాజీ ఇన్‌చార్జి పోతినేని శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు ప్రచారంలో పాల్గొనకపోవడం గమనార్హం. చివరకు లోకేశ్ అపార్ట్‌మెంట్లలో ప్రచారానికే పరిమితమయ్యారు.

పోలీసులతో లోకేశ్ వాగ్వాదం

మంగళగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ ఆదివారం పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎన్నికల విధుల్లో భాగంగా పోలీసులు ఉండవల్లి సెంటర్లో వాహన తనిఖీ చేపట్టారు. అదే మార్గంలో వెళ్తున్న లోకేశ్ వాహనాలను ఆపి తనిఖీ నిర్వహించారు. ఈ రోజు ఇప్పటికే రెండు సార్లు తన వాహనాలను తనిఖీ చేశారని, ముఖ్యమంత్రి వాహనాన్ని తనిఖీ చేశారా? ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు వాహనాలను తనిఖీ చేశారా? అంటూ పోలీస్ అధికారితో వాగ్వాదానికి దిగారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు అన్ని వాహనాలనూ తనిఖీ చేస్తున్నామని పోలీసు అధికారి బదులిచ్చారు.

18 స్థానాలకు జనసేన అభ్యర్థుల ఖరారు

అవనిగడ్డ, పాలకొండ, విశాఖ సౌత్ స్థానాలు పెండింగ్


సాక్షి, అమరావతి: జనసేన పార్టీ మరో 11 స్థానాలతో మూడో అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. తొలుత 5 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. రెండో జాబితాలో మరో రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మూడో జాబితాతో కలిపి మొత్తంగా 18 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేస్తూ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనసేన పోటీచేసే మొత్తం 21 స్థానాల్లో ఇంకా అవనిగడ్డ, పాలకొండ, విశాఖ దక్షిణ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఆ పార్టీ పోటీచేసే రెండు లోక్‌సభ స్థానాల్లో కాకినాడకు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అభ్యర్థిత్వాన్ని ఇటీవలే ఖరారు చేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జనసేన అభ్యర్థుల జాబితా..

పిఠాపురం	పవన్‌కళ్యాణ్
నెల్లిమర్ల	లోకం మాధవి
అనకాపల్లి	కొణతాల రామకృష్ణ
కాకినాడ రూరల్	పంతం నానాజీ
రాజానగరం	బత్తుల బలరామకృష్ణ
తెనాలి	నాదెండ్ల మనోహర్
నిడదవోలు	కందుల దుర్గేష్
పెందుర్తి	పంచకర్ల రమేష్‌బాబు
యలమంచిలి	సుందరపు విజయ్‌కుమార్
పి.గన్నవరం	గిడ్డి సత్యనారాయణ
రాజోలు	దేవ వరప్రసాద్
తాడేపల్లిగూడెం	బొలిశెట్టి శ్రీనివాస్
భీమవరం	పులపర్తి ఆంజనేయులు
నరసాపురం	బొమ్మిడి నాయకర్
ఉంగుటూరు	పత్సమట్ల ధర్మరాజు
పోలవరం	చిర్రి బాలరాజు
తిరుపతి	ఆరణి శ్రీనివాసులు
రైల్వేకోడూరు	డాక్టర్ యనమల భాస్కరరావు

గిద్దలూరు బరిలో జనసేన రెబల్‌గా ఆమంచి స్వాములు

- ఓడిపోయే సీట్లను జనసేనకు కట్టబెడుతున్నారంటూ మండిపాటు
- టీడీపీ మోసపూరితంగా వ్యవహరిస్తోందని వ్యాఖ్యలు



ఆమంచి స్వాములు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు : ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన కూటమికి గట్టి షాక్ తగిలింది. జనసేన రెబల్ అభ్యర్థిగా బరిలో దిగనున్నట్టు ఆమంచి స్వాములు ప్రకటించడంతో టీడీపీ ఉలిక్కిపడింది. ఆదివారం రాత్రి కంభం గ్రామంలో జనసేన నిర్వహించిన ర్యాలీ, బహిరంగ సభలో ఆమంచి స్వాములు పాల్గొన్నారు. జనసేన రాష్ట్ర కార్యదర్శిగా, పవన్‌కళ్యాణ్ ప్రతినిధిగా తాను ఈ సభలో పాల్గొన్నానని చెప్పుకొన్న ఆయన.. మీడియాతో మాట్లాడుతూ గిద్దలూరు సీటు జనసేనకు ఇవ్వకపోవడంతో కాపుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. టీడీపీతో పొత్తు పెట్టుకున్నాక కొన్ని దుష్టశక్తుల వలన కూటమి అభ్యర్థిగా టీడీపీకి చెందిన ముత్తుముల అశోక్‌రెడ్డిని ప్రకటించారని చెప్పారు. గిద్దలూరు సీటును జనసేనకు ఇవ్వకుండా టీడీపీకి ఇవ్వడాన్ని కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారని, దీనిపై పునరాలోచించుకోవాల్సిన బాధ్యత జనసేన పార్టీకి ఉందన్నారు. తీసుకున్నది తక్కువ సీట్లయినా గిద్దలూరు లాంటి గెలిచే సీటును చేజేతులా పోగొట్టుకుంటే ఎలా అని ప్రశ్నించారు. పొత్తుల పేరుతో పవన్‌కళ్యాణ్‌ను దెబ్బ తీసే కుట్రలు జరుగుతున్నాయని, ఒక వ్యూహం ప్రకారం జనసేనకు ఓడిపోయే సీట్లను కట్టబెడుతున్నారని ఆరోపించారు. టీడీపీ నాయకులు మాత్రం కుట్ర పూరితంగా ఆయనను రాజకీయంగా దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ప్రజల అభిప్రాయం మేరకు జనసేన దెబ్బ తినకుండా మంచి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నట్లు చెప్పారు. ఇప్పటికై నా మించి పోయిందేమీ లేదని, గిద్దలూరు అభ్యర్థిని మార్చాలన్నారు. ర్యాలీలో జనసేన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ లింక్‌పై క్లిక్ చేయవద్దు

- ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలంటూ సైబర్ నేరగాళ్ల నకిలీ ప్రకటనలు
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న సైబర్ నిపుణులు



సాక్షి, హైదరాబాద్: భారత వాయుసేనలో చేరాలని యువతలో చాలా కలలు కంటుంటారు. ఇలాంటి కలల్నే తమకు అనుకూలంగా మార్చుకుని సైబర్ నేరగాళ్లు అనేక మోసాలకు తెరదీస్తున్నారు. ఇటువంటి మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ నిపుణులు యువతను హెచ్చరిస్తున్నారు. భారత వాయుసేనలో చేరాలంటే తాము ఇచ్చే ప్రకటనలోని లింక్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలంటూ సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ వంటి వాటిల్లో సైబర్ నేరగాళ్లు నకిలీ ప్రకటనలు ఇస్తున్నారు. ఇలా అభ్యర్థుల నుంచి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల వివరాలు కూడా సేకరిస్తున్నారు. ఆ తర్వాత దరఖాస్తు కోసమని, వెరిఫికేషన్ చార్జీల పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారని సైబర్ సెక్యూరిటీ నిపుణులు హెచ్చరించారు. ఇలాంటి మోసపూరిత ప్రకటనలు నమ్మవద్దని వారు సూచించారు. అధికారిక వెబ్‌సైట్‌లలో మాత్రమే వివరాలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నేడు హోలీ పండగ



సన్నిధి

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

ధర్మం-ఆచరణ

నరజన్మకూ, మిగిలిన ప్రాణులకూ ఒక ప్రత్యేకమైన భేదం ఉంది. ఇతర ప్రాణులకు ఒకే ధర్మం-పశుధర్మం. ఆకలి, నిద్ర, ప్రత్యుత్పత్తి...అంతకుమించి వాటికి ధర్మం అని ప్రత్యేకంగా ఏమీ ఉండదు. కానీ ఒక్క మనిషికి మాత్రం అత్యంత ప్రధానమైనది - ధర్మాచరణ. అయితే దీనిలో ఒక సంక్లిష్టత ఉంది. ఇదే ధర్మము... అని చెప్పడం ఎప్పుడూ సాధ్యం కాదు. ధర్మం నిరంతరం మారి పోతుంటుంది. భార్యముందు నిలబడితే-భర్త ధర్మం. తల్లి ముందు నిలబడితే-పుత్ర ధర్మం. సోదర ధర్మం... ఉద్యోగ ధర్మం.. అలా నిరంతరం మారిపోతుంటుంది. దేశాన్నిబట్టి, కాలాన్నిబట్టి మారిపోతుంది. ఉత్తర భారత దేశంలో చలి కారణం చేత వీలయినంతగా శరీరాన్ని కప్పుకుని పూజాదులు చేయడం అక్కడి ధర్మం. దక్షిణ భారతదేశంలో.. కేవలం ఉత్తరీయం పైన వేసుకుని అభిషేకాలు, పూజలు చేయడం ఇక్కడి ధర్మం.



అలాగే ఆశ్రమాన్ని బట్టి ధర్మం మారిపోతుంటుంది. బ్రహ్మచారికి ఒక ధర్మం, గృహస్థుకు ఒక ధర్మం, వానప్రస్థుకు, సన్యాసికి .. ఇలా ధర్మం మారుతుంటుంది. బ్రహ్మచారి ఏదీ కూడబెట్టకూడదు. విద్యార్థిగా గురువుగారు చెప్పింది శ్రద్ధగా విని మననం చేసుకోవడం ఒకటే ధర్మం. అదే గృహస్థాశ్రమంలో భోగం అనుభవించవచ్చు. భార్యాబిడ్డలతో సుఖసంతోషాలతో గడపవచ్చు. రేపటి అవసరాలకోసం సంపాదించి దాచుకోవచ్చు. వానప్రస్థు భార్యతో కలిసి ఏకాంత ప్రదేశానికి వెళ్ళి ఆత్మవిచారం చేస్తూ గడపవచ్చు. చిట్టచివరన అన్నీ పరిత్యజించి ఏకాకిగా వైరాగ్యంలో ఉండడం ధర్మం. అలా ధర్మం మారిపోతున్నా ఎక్కడికక్కడ ధర్మం నియమాలకు కట్టుబడి ఉంటుంది. అసలు ధర్మం లేకుండా ఉండడం, దానిని పాటించకుండా జీవించడం సాధ్యం కాదు.

ధర్మాచరణతోనే మనుష్య ప్రాణి ఉత్తమగతులు పొందగలడు. శాస్త్రం చెప్పినట్టుగా ధర్మాచరణ చేస్తూ శరీరం పతనమయిన తరువాత స్వర్గలోకం వెళ్ళవచ్చు. పుణ్యఫలితం అయిపోయిన తరువాత తిరిగి భూలోకానికి చేరుకోవచ్చు.'నాకు శాస్త్రం మీద నమ్మకం లేదు. ఈ పుణ్యకర్మలు నేను చేయను. నాకు ఏది సంతోషం అనిపిస్తే, నా ఇంద్రియాలకు ఏది సుఖం అనిపిస్తే, నా మనసుకు ఏ భోగం అనుభవించాలనుకుంటే దానిని అనుభవిస్తూ శాస్త్రాన్ని పక్కనబెట్టి ప్రవర్తిస్తే.. ఆ పాటిదానికి నరజన్మ అవసరం లేదని తిర్యక్కుగా (వెన్నుపూసలేని జీవిగా) జన్మ లభిస్తుంది. అలా కాదు, నాకు పాపమూ వద్దు, పుణ్యమూ వద్దు. నేను ఈ మంచిపని చేసి పుణ్యం కావాలనుకోవడం లేదు, నేను కేవలం భగవంతుడు చెప్పినట్లు బతకడం నాకు సంతోషం. నేను చేయవలసినవి కాబట్టి చేస్తున్నా.. దానినుంచి నేను ఏ ప్రయోజనమూ ఆశించడం లేదనుకున్నప్పుడు అది చిత్తశుద్ధిని సూచిస్తుంది. ఇది ఏదో ఒకనాడు భగవంతుని అనుగ్రహానికి కారణమయి, జ్ఞానాన్ని తద్వారా మోక్షాన్ని ఇస్తుంది. అంటే ధర్మాన్ని అనుష్ఠానం చేసి దేవతాపదవిని అధిష్ఠించగలడు. ధర్మాచరణను పక్కనబెట్టి పతనమమై తిర్యక్కు అయిపోగలడు. ఏ ఫలితాన్ని ఆశించకుండా ధర్మాచరణచేసి మోక్షాన్ని పొందగలడు. కాబట్టి ధర్మం కన్నా గొప్పది మరొకటి లేదు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మంచిమాట

జీవితం వర్ణమయం

మానవ జీవితం రంగుల మయం. ఆ మాటకొస్తే అసలీ ప్రపంచమే రంగులమయం. ఎందుకంటే మన జీవన విధానమే రకరకాల రంగులతో మమేకమై ఉంది. ఇంద్రధనుస్సులో ఏడు రంగులు ఉంటే ప్రకృతిలో వేనవేల రంగులున్నాయి. ఈ ప్రకృతిలోని రంగులన్నీ జీవన తత్త్వాన్ని బోధిస్తాయి. ఆ రంగులతో చేసుకునే సంబరమే హోలీ. అందుకే హోలీని ఆలయాలలో కూడా ఒక వేడుకగా... ఉత్సవంగా నిర్వహిస్తారు.

చిగురించే మోదుగులు. పూసే గురువిందలు. పరిమళించే మల్లెలు. మొగ్గలు తొడిగే మొల్లలు... రాలే పొగడ పుప్పొడి రేణువులు. చిందే గోగు తేనెలు. గుబాళించే గోరింట పూలు. ఎర్రని చివుళ్లతో మామిళ్లు... తెల్లని పూతాపుందెతో వేప చెట్లు... ఇందుకే కదా కవులు కీర్తించేది... వసంతాన్ని రుతువులకే రారాజని! మధుమాస వేళలో జరిగే వసంతోత్సవాన్ని భారతదేశమంతటా ఘనంగా జరుపుకుంటుంది.

గతంలో రాజు, పేద, ధనిక, చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఈ రంగునీళ్లను ఒకరిపై ఒకరు చల్లుకొని సంతోషించేవారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో విశిష్ట సందర్భాన్ని పురస్కరించుకుని హోలీ జరుపుకుంటారు. ఫాల్గుణ మాసం పూర్ణిమనాడు జరుపుకునే పండుగ కనుక ఫాల్గుణోత్సవమని... వసంత రుతువును స్వాగతించే వేడుక కాబట్టి వసంతోత్సవమని పిలుచుకుంటాం.

హోలీ పర్వదినం వెనుక చాలా పురాణ కథలు ఉన్నాయి. యోగనిష్ఠలో ఉన్న పరమేశ్వరుడికి తపోభంగం కలిగించమని దేవతలందరూ మన్మథుడిని కోరడంతో ఆయన శివుడి మీదకు తన పూలబాణాలను ప్రయోగిస్తాడు. ఆ బాణాల తాకిడికి ధ్యాన భంగం అయిన శివుడు ఆగ్రహంతో తన మూడో కంటిని తెరచి మన్మథుడిని మసి చేస్తాడు. మదనుడి భార్య రతీదేవి తనకు పతి భిక్ష పెట్టవలసిందిగా ప్రాధేయపడటంతో భోళా శంకరుడు కరిగిపోయి మన్మథుడు.. రతీదేవికి మాత్రమే శరీరంతో కనిపించేలా వరమిచ్చాడు. అలా మళ్లీ మన్మథుడు రతీదేవికి దక్కాడు. ఈ పండుగ జరుపుకోవడానికి ఈ కథ ఓ కారణమైందని విశ్వసిస్తారు.

అన్నింటికీ మించి హోలీ పండుగ పుట్టుకకు మరో కథను చెబుతారు.

శ్రీకృష్ణుడు నల్లనివాడు, రాధ మేలిమి బంగారం. ఓరోజున వారిద్దరూ ఒకరి చేతులు ఒకరు పట్టుకుని వనవిహారం చేస్తుండగా రాధ చేతిపక్కన ఉన్న తన చేయి నల్లగా ఉండటం చూసి దిగులు పడ్డాడట కృష్ణుడు. కన్నయ్య విచారానికి కారణం తెలుసుకున్న యశోదమ్మ 'నాయనా! రాధమ్మ అసలు రంగు తెలియకుండా నువ్వు ఆమె ఒంటినిండా రంగులు కలిపిన నీళ్లు పోయి' అని సలహా ఇచ్చిందట. అమ్మ మాట మేరకు నల్లనయ్య రాధమీద రంగునీళ్లు పోశాడట. ఈ హఠాత్పరిణామానికి విస్తుపోయిన రాధ తను కూడా కృష్ణుని మీద రంగులు కలిపిన నీరు చిలకరిస్తూ కృష్ణునికి అందకుండా ఉద్యానవనం నుంచి బయటకు పరుగులు తీసిందట. రాధాకృష్ణులిద్దరూ ఇలా ఒకరి మీద ఒకరు రంగునీళ్లు పోసుకోవడం చూసిన పురజనులు... ఆనందోత్సాహాలతో రంగుల పండుగ చేసుకున్నారట. ఆనాడు ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ. నాటినుంచి ప్రతి ఫాల్గుణ పున్నమినాడు ప్రజలందరూ ఒకరి నొకరు రంగులతో ముంచెత్తుకోవడం, పెద్దఎత్తున పండుగలా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

పైన చెప్పుకున్న కథల నుంచి మనం గ్రహించవలసినది ఏమిటంటే... మనందరమూ మనుషులమే కాబట్టి ఏదో ఒక లోపం ఉండితీరుతుంది. అలాంటి లోపాలను తీసుకు వచ్చే దుర్గుణాలను దూరం చేసుకోవడం అవసరం. అన్ని రంగులు ఉంటేనే.. ప్రకృతికి అందం. అందరిని కలుపుకుంటేనే మనసుకి అందం. అన్ని ఆలోచనలను పరిగణించి, చక్కని దారిన కలిసి నడిస్తేనే మనిషికి అందం. హోలీ రోజున ఒకరిపై ఒకరు చల్లుకునేవి రంగులు కావు; అనురాగ ఆప్యాయతలు కలసిన పన్నీటి పరిమళ జల్లులు.

హోలీ పండుగను వసంత రుతువు వస్తోందనడానికి సంకేతంగా భావిస్తారు. వసంతకాలం అంటే చెట్లు చిగిర్చి పూలు పూసే కాలం కదా! అంటే మనలో ఉన్న దుర్గుణాలనే ఎండుటాకులను రాల్చేసి, వాటి స్థానంలో ఉల్లాసం, ఉత్సాహం, ప్రేమ, అనే సుగుణాలతో కూడిన ఆకులను చిగురింప చేసుకోవాలి.

మన్మథుడు అంటే మనస్సును మథించేవాడని అర్థం. మనిషిలో దాగి ఉన్న కామక్రోధలోభమోహమదమాత్సర్యాలనే ఆరు అంతః శత్రువులు మనస్సును మథిస్తాయి. వాటినే అరిషడ్వర్గాలు అంటారు. మనిషిని పతనం చేసే ఈ ఆరుగుణాలనూ అదుపులో ఉంచుకోవాలని చెప్పేందుకే పరమేశ్వరుడు కామదేవుడిని భస్మం చేశాడు. రూపం కోల్పోయిన మన్మథుడు ఆనాటి నుంచి మనుషుల మనస్సులలో దాగి ఉండి అసలు పని నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఈ సంఘటనను దృష్టిలో పెట్టుకునేందుకే, ఈశ్వరుడు కాముణ్ణి భస్మం చేసిన రోజైన ఫాల్గుణ శుద్ధపూర్ణిమకు ముందురోజు, గ్రామాలలో కామదేవుని ప్రతిమను తయారుచేసి, ఊరేగింపుగా తీసుకెళతారు. యువకులంతా కలిసి కామదహనం చేస్తారు. ఇది ఆనవాయితీగా వస్తోంది.

మన జీవితాలలో అనేక విధాలైన అలకలు, కినుకలు, అసంతృప్తులు, కోపాలు, తాపాలు, ఆవేశకావేశాలు, అలజడులు, అపశ్రుతులు, తడబాట్లు, ఎడబాట్లు ఉండొచ్చు. అందువల్ల ఈ హోలీ రోజు మనకు దగ్గరగా ఉన్న వారితోనే మాట, ఆట కాకుండా..... మనసుకు దగ్గర అయిన బంధు మిత్రులతో, మనవల్లో, వారి వల్లో ఏర్పడిన మానసిక దూరాన్ని తగ్గించుకుని, మనమే ముందుగా ఒక అడుగు వేసి అందరినీ దగ్గర చేసుకుని జీవితాలను వర్ణమయం... రాగ రంజితం చేసుకుందాం. హోలీ పర్వదినాన్ని అందరూ ఆప్యాయతతో కలిసే రంగుల రోజుగా మార్చుకుందాం.

– డి.వి.ఆర్. భాస్కర్

సినిమా

సమయంతో ప్రయాణం

వెండితెరపై కాలచక్రం తిరుగుతోంది. ప్రేక్షకులను విభిన్న కాలాలకు తీసుకుని వెళ్లేందుకు కొందరు హీరోలు సిద్ధం అవుతున్నారు... కాలాన్ని కదిలిస్తున్నారు. టైమ్ ట్రావెల్ బ్యాక్‌డ్రాప్ సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు. ఇలా వెండితెరపై సమయంతో ప్రయాణం చేస్తున్న కొందరు హీరోల గురించి తెలుసుకుందాం.

ఆరువేల సంవత్సరాలు...



● ప్రభాస్

ఆరువేల సంవత్సరాల టైమ్ లైన్‌తో సోషియో ఫ్యాంటసీ అండ్ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ మూవీ 'కల్కి 2898ఏడీ' కథనం సాగుతుందని తెలుస్తోంది. ''ఈ సినిమా కథ మహాభారతం కాలంలో మొదలై, 2898తో పూర్తవుతుంది. అందుకే 'కల్కి 2898ఏడీ' అనే టైటిల్‌ను ఖరారు చేశాం'' అని ఈ చిత్రదర్శకుడు నాగ్ అశ్విన్ ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. దీంతో 'కల్కి 2898 ఏడీ' టైమ్ ట్రావెల్ ఫిల్మ్ అని కన్ఫార్మ్ చేసుకోవచ్చు. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో దీపికా పదుకోన్, దిశా పటానీ, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ ఇతర లీడ్ రోల్స్‌లో కనిపిస్తారు. రాజమౌళి, మలయాళ నటి అన్నా బెన్, దుల్కర్ సల్మాన్, విజయ్ దేవరకొండ అతిథి పాత్రల్లో కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. భైరవ పాత్రలో ప్రభాస్, పద్మావతి పాత్రలో దీపికా పదుకోన్ కనిపిస్తారని తెలిసింది. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. 'కల్కి 2898ఏడీ' సినిమాను మే 9న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ ఈ చిత్రం విడుదల వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని ఫిల్మ్‌నగర్ సమాచారం.

మూడు తరాల నేపథ్యంలో...



● టొవినో థామస్

మలయాళ నటుడు టొవినో థామస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'అజయంతే రండం మోషణం'. ఈ సినిమాలో మణియన్, అజయన్, కుంజికేలు.. ఇలా మూడు పాత్రల్లో నటిస్తున్నారు టొవినో థామస్. పాత్రలకు తగ్గట్లే కథ కూడా మూడు తరాల హీరోల నేపథ్యంలో సాగుతుంది. కథ రీత్యా మూడు తరాల్లోనూ హీరోగా టొవినో థామస్‌నే కనిపిస్తారని తెలుస్తోంది. ఇలా మూడు డిఫరెంట్ టైమ్ లైన్స్‌లో టైమ్ ట్రావెల్‌గా ఈ సినిమా కథనం సాగుతుంది. కృతీ శెట్టి, ఐశ్వర్యా రాజేష్, సురభిలక్ష్మి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు జితిన్ లాల్ దర్శకత్వం వహిస్తున్నారు. కాగా కృతీ శెట్టికి ఇది తొలి మలయాళ చిత్రం. మ్యాజిక్ ఫ్రేమ్స్, యూజీఎమ్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదిలోనే విడుదల కానుంది. తెలుగులోనూ విడుదల చేయాలనుకుంటున్నారు. త్రీడీలోనూ రిలీజ్ చేయాలని ఈ చిత్రం మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని మాలీవుడ్ సమాచారం.

ఆధునిక అశ్వత్థామ

మహాభారతంలో అమరవీరుడిగా చెప్పుకునే అశ్వత్థామ ఇప్పటి ఆధునిక యుగంలోకి వస్తే ఎలా ఉంటుందనే ఇతివృత్తంతో తెరకెక్కుతున్న సినిమా 'అశ్వత్థామ: ది సాగా కంటిన్యూస్'. బాలీవుడ్ హీరో షాహిద్ కపూర్ టైటిల్ రోల్ చేస్తున్నారు. కన్నడ దర్శకుడు సచిన్ రవి ఈ సినిమాకు దర్శకుడు. కాగా ఈ సినిమా టైమ్ ట్రావెల్ బ్యాక్‌డ్రాప్‌తోనే ఉంటుందని బాలీవుడ్ సమాచారం. జాకీ భగ్నానీ, వసుభగ్నాని, దీపికా దేశ్‌ముఖ్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాదిలోనే విడుదల కానుంది.



● షాహిద్ కపూర్

ఐదువందల సంవత్సరాలు...




● సూర్య

టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో సూర్య కెరీర్‌లో రూపొందిన చిత్రం '24'. విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ సైన్స్ ఫిక్షన్ మూవీ 2016లో విడుదలై హిట్ సాధించింది. ఈ జానర్‌లోనే తాజాగా సూర్య నటించిన చిత్రంగా 'కంగువ'ను చెప్పుకోవచ్చు. ఐదువందల (1700 - 2023) సంవత్సరాల టైమ్ పీరియడ్‌లో ఈ చిత్ర కథనం సాగుతుంది. పద్దెనిమిదో శతాబ్దంలో తాను మొదలుపెట్టిన ఓ పనిని పూర్తి చేయలేక మరణించిన ఓ వీరుడు... పునర్జన్మలో ఆ పనిని ఏ విధంగా పూర్తి చేస్తాడు? అన్నదే 'కంగువ' సినిమా కథనం అని కోలీవుడ్ సమాచారం. ఈ చిత్రంలో సూర్య హీరోగా నటించగా, హీరోయిన్‌గా దిశా పటానీ, ఓ కీలక పాత్రలో యోగిబాబు, విలన్‌గా బాబీ డియోల్ కనిపిస్తారు. స్టూడియోగ్రీన్, యూవీ క్రియేషన్స్ పతాకాలపై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా విడుదల కానున్న ఈ సినిమా తొలి భాగం ఈ ఏడాదిలోనే విడుదల కానుందని తెలిసింది.

ఇలా టైమ్ ట్రావెల్ నేపథ్యంలో సాగే చిత్రాలు మరికొన్ని ఉన్నాయి.

మిస్టర్ బచ్చన్ వస్తున్నాడు




● రవితేజ

ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నాడు 'మిస్టర్ బచ్చన్'. రవితేజ టైటిల్ రోల్ చేస్తున్న ఈ సినిమాకు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. 'షాక్', 'మిరపకాయ్' వంటి సినిమాల తర్వాత రవితేజ, హరీష్ కాంబినేషన్‌లో వస్తున్న మూడో చిత్రం ఇది. 'నామ్ తో సునా హోగా' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. ఈ చిత్రంతో భాగ్యశ్రీ బోర్సే తెలుగు పరిశ్రమకు హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. ఇందులో ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్ బచ్చన్ పాత్రలో రవితేజ కనిపిస్తారని ఫిల్మ్‌నగర్ సమాచారం. పనోరమా స్టూడియోస్, టి-సిరీస్ సమర్పణలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా 'మిస్టర్ బచ్చన్' చిత్రాన్ని జూలైలో రిలీజ్ చేసేలా చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోందని సమాచారం. ఈ సినిమాకు మిక్కీ జే మేయర్ స్వరకర్త. మరోవైపు అజయ్ దేవగన్ హీరోగా నటించిన హిందీ హిట్ ఫిల్మ్ 'రైడ్' (2018) చిత్రానికి 'మిస్టర్ బచ్చన్' తెలుగు రీమేక్‌గా తెరకెక్కుతోందనే టాక్ వినిపిస్తోంది.

నెవర్!

ఓవెన్ టీగ్, ఫ్రెయా అల్లన్, కెవిన్ దురాండ్, పీటర్ మకాన్, విలియమ్ హెచ్. మేసీ ప్రధాన పాత్రల్లో నటించిన హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఫిల్మ్ 'కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్'. వెస్ బాల్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం మే 10న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన కొత్త టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'వెల్‌కమ్ టు మై కింగ్‌డమ్', 'బెండ్ ఫర్ యువర్ కింగ్', '..నెవర్' అనే డైలాగ్స్ ఈ టీజర్‌లో ఉన్నాయి. 'ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' రీ బూట్ సిరీస్‌లో వస్తోన్న నాలుగో చిత్రం ఇది. ఈ సిరీస్ నుంచి గతంలో వచ్చిన 'రైజ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్ (2011)', 'డ్వాన్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్ (2014), 'వార్ ఫర్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' (2017) చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి.



'కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' పోస్టర్

ఇక ఉచితంగా మాట్లాడను! - దర్శకుడు అనురాగ్ కశ్యప్



కొందరు వ్యక్తులు తన సమయాన్ని అనవసరంగా వృథా చేస్తున్నారని, అలాంటి వ్యక్తులతో ఇక ఉచితంగా మాట్లాడననీ అంటున్నారు బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్. అందుకే ఇక నుంచి ఎవరికైనా సమయం కేటాయించాలనుకుంటే అందుకు తగ్గట్టుగా 'ఛార్జ్' చేస్తానని అంటున్నారాయన. ఈ విషయంపై అనురాగ్ ఓ నోట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయగా, బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ''కొంతమంది కొత్త వ్యక్తులకు సహాయం చేయాలనుకుని వారితో సమావేశమై నేను నా సమయాన్ని చాలా కోల్పోయాను. ఆ సమావేశాలు నాకు ఏ మాత్రం వర్కౌట్ కాలేదు కూడా. చెప్పాలంటే ఇలా చాలామందితో మాట్లాడి నేను అలసిపోయాను. ఈ విధంగా జీవితంలో చాలా సమయాన్ని కోల్పోయాను. సక్సెస్‌కు షార్ట్ కట్స్ వెతికేవారితో, తాము క్రియేటివ్ జీనియస్‌లా ఫీలయ్యే కొందరు వ్యక్తులతో ఇకపై నేను ఉచితంగా మాట్లాలనుకోవడం లేదు. నేను ఓ స్వచ్ఛంద సేవా సంస్థను కాదలచుకోలేదు. ఇకపై ఎవరైనా నన్ను కలవాలనుకుంటే పది నుంచి పదిహేను నిమిషాలు అయితే లక్ష రూపాయలు, 30 నిమిషాలకు రెండు లక్షలు, గంట అయితే ఐదు లక్షలు చెల్లించాలి. ఒకవేళ ఎవరైనా ఇలా డబ్బులు చెల్లించలేని పక్షంలో వారు నన్ను కలవడానికి ప్రయత్నించవద్దు'' అని ఆ నోట్‌లో పేర్కొన్నారు అనురాగ్ కశ్యప్. ఇక బాలీవుడ్‌లో వచ్చిన 'బ్లాక్ ఫ్రైడే', 'ముంబై కటింగ్', 'బాంబే టాకీస్' వంటి సినిమాలకు అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే.



చాంపియన్ ఆకుల శ్రీజ

లెబనాన్‌లో జరిగిన ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫీడర్ లెవెల్ రెండో టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ చాంపియన్‌గా అవతరించింది. బీరుట్‌లో ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 47వ ర్యాంకర్ శ్రీజ 6–11, 12–10, 11–5, 11–9తో సారా డి నుట్టె (లక్సెంబర్గ్)పై గెలిచింది. విజేతగా నిలిచిన శ్రీజకు 550 డాలర్ల (రూ. 46 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 125 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. డబుల్స్ విభాగంలో శ్రీజ-దియా చిటాలె (భారత్) ద్వయం రన్నరప్‌గా నిలిచింది.

సెమీస్‌లో శ్రీకాంత్ పరాజయం



స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ కిడాంబి శ్రీకాంత్‌కు నిరాశ ఎదురైంది. బాసెల్‌లో జరిగిన ఈ టోర్నీ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ శ్రీకాంత్ 65 నిమిషాల్లో 21–15, 9–21, 18–21తో లిన్ చున్ యి (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు. 16 నెలల తర్వాత ఓ టోర్నీలో శ్రీకాంత్ సెమీఫైనల్ చేరడం గమనార్హం. సెమీఫైనల్లో ఓడిన శ్రీకాంత్‌కు 3,045 డాలర్ల (రూ. 2 లక్షల 54 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 4900 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

విజేత కార్లోస్ సెయింజ్



మెల్‌బోర్న్: ఫార్ములావన్ సీజన్‌లో వరుసగా మూడో విజయం సాధించాలని ఆశించిన వరల్డ్ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్)కు నిరాశ ఎదురైంది. ఆదివారం జరిగిన ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి రేసును ‘పోల్ పొజిషన్’తో ఆరంభించిన వెర్‌స్టాపెన్ కారు ఇంజిన్‌లో సమస్య తలెత్తడంతో నాలుగో ల్యాప్‌లోనే వైదొలిగాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న ఫెరారీ జట్టు డ్రైవర్ కార్లోస్ సెయింజ్ జూనియర్ విజేతగా అవతరించాడు. నిర్ణీత 58 ల్యాప్‌ల రేసును సెయింజ్ అందరికంటే వేగంగా ఒక గంటా 20 నిమిషాల 26.843 సెకన్లలో ముగించి ఈ సీజన్‌లో తొలి విజయాన్ని అందుకున్నాడు. ఫెరారీకే చెందిన చార్లెస్ లెక్‌లెర్క్ రెండో స్థానంలో నిలిచాడు. 2022 బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి తర్వాత ఇద్దరు ఫెరారీ డ్రైవర్లు టాప్-2లో నిలిచారు. సీజన్‌లోని నాలుగో రేసు జపాన్ గ్రాండ్‌ప్రి ఏప్రిల్ 7న జరుగుతుంది.

ఒకరు 6 సెకన్లలో... మరొకరు 7 సెకన్లలో....




క్రిస్టోఫ్ బామ్‌గార్ట్‌నర్ ఫ్లోరియన్ విర్ట్జ్

బ్రాటిస్లావా (స్లొవేకియా): అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో ఆదివారం అద్భుతం జరిగింది. వేర్వేరు వేదికల్లో జరిగిన రెండు అధికారిక ఫ్రెండ్లీ మ్యాచ్‌ల్లో రెండు ఫాస్టెస్ట్ గోల్స్ నమోదయ్యాయి. బ్రాటిస్లావాలో స్లొవేకియాతో జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రియా 2–0తో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ఆట మొదలైన 6 సెకన్లకే ఆస్ట్రియా ప్లేయర్ క్రిస్టోఫ్ బామ్‌గార్ట్‌నర్ గోల్ చేశాడు. మిడ్‌ఫీల్డ్ నుంచి క్షణాల్లో ముగ్గురు డిఫెండర్లను తప్పించుకొని ముందుకు దూసుకెళ్లిన క్రిస్టోఫ్ లాంగ్‌షాట్‌తో బంతిని గోల్‌పోస్ట్‌లోనికి పంపించాడు. మరోవైపు లియోన్‌లో ఫ్రాన్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో జర్మనీ జట్టు 2–0తో నెగ్గింది. ఈ మ్యాచ్‌లో ఆట మొదలైన 7 సెకన్లకే జర్మనీ ప్లేయర్ ఫ్లోరియన్ విర్ట్జ్ గోల్ చేశాడు. ఇన్నాళ్లూ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో ఫాస్టెస్ట్ గోల్ చేసిన రికార్డు లుకాస్ పొడోల్‌స్కీ పేరిట ఉంది. 2013లో ఈక్వెడార్‌తో జరిగిన మ్యాచ్‌లో పొడోల్‌స్కీ 9వ సెకనులో గోల్ సాధించాడు. పొడోల్‌స్కీ 11 ఏళ్ల రికార్డు ఒకేరోజు బద్దలు కావడం విశేషం.

ముంబై మరో‘సారీ’

వరుసగా 12వ ఏడాది ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో ఓటమి

- 6 పరుగులతో గుజరాత్ గెలుపు
- రాణించిన సుదర్శన్, ఉమేశ్, మోహిత్


రోహిత్

అహ్మదాబాద్: కొత్త కెప్టెన్ వచ్చినా... వరుసగా 12వ ఏడాది ముంబై ఇండియన్స్ జట్టుకు ఐపీఎల్ తొలి మ్యాచ్ కలిసి రాలేదు. వరుసగా 12వ సారి ముంబై ఐపీఎల్ సీజన్‌ను ఓటమితో ప్రారంభించింది. 2012 ఐపీఎల్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో నెగ్గిన ముంబై జట్టు ఆ తర్వాత ఇప్పటి వరకు తొలి మ్యాచ్‌లో గెలుపు బోణీ కొట్టలేకపోయింది. కొత్త కెప్టెన్ శుబ్‌మన్ గిల్ సారథ్యంలో ఈ మ్యాచ్‌లో ఆడిన గుజరాత్ టైటాన్స్ జట్టు బౌలర్ల సమష్టి రాణింపుతో ఆఖరిదాకా పోరాడి 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. ఓపెనర్లు సాహా (19), శుబ్‌మన్ గిల్ (22 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) ఎక్కువసేపు నిలువలేదు. వన్‌డౌన్ బ్యాటర్ ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ సాయి సుదర్శన్ (39 బంతుల్లో 45; 3 ఫోర్లు, 1 సిక్స్) పటిష్టమైన ముంబై బౌలింగ్‌కు ఎదురునిలిచి జట్టును నడిపించాడు. అయితే బుమ్రా ఒకే ఓవర్లో మిల్లర్ (17), సుదర్శన్‌లను అవుట్ చేయగా... ఆఖర్లో రాహుల్ తెవాటియా (15 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిని ప్రదర్శించాడు. తర్వాత ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 162 పరుగులే చేయగలిగింది. ఇషాన్ కిషన్ (0), నమన్ ధీర్ (20)లను అవుట్ చేసిన ఒమర్జాయ్ ముంబై ఆరంభాన్ని దెబ్బకొట్టగా, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ (29 బంతుల్లో 43; 7 ఫోర్లు, 1 సిక్స్), డెవాల్డ్ బ్రెవిస్ (38 బంతుల్లో 46; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) జట్టును నడిపించారు. స్వల్పవ్యవధిలో వాళ్లిద్దరు అవుటయ్యాక ఒక్క తిలక్ వర్మ (19 బంతుల్లో 25; 1 ఫోర్, 1 సిక్స్) మెరుగైన స్కోరు చేశాడు. టిమ్ డేవిడ్ (11), కెప్టెన్ హార్దిక్ పాండ్యా (11)లాంటి హిట్టర్లు కూడా తేలిపోవడంతో ముంబై ఓడింది. ఒమర్జాయ్, ఉమేశ్, మోహిత్ శర్మ, స్పెన్సర్ జాన్సన్ తలా 2 వికెట్లు తీశారు. గుజరాత్ మాజీ సారథి పాండ్యా తాజాగా ముంబై కెప్టెన్‌గా టాస్‌కు రాగానే స్టేడియంలోని ప్రేక్షకులు అరచి గోల చేశారు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (బి) బుమ్రా 19; శుబ్‌మన్ (సి) రోహిత్ (బి) చావ్లా 31; సాయి సుదర్శన్ (సి) తిలక్‌వర్మ (బి) బుమ్రా 45; అజ్మతుల్లా (సి) తిలక్‌వర్మ (బి) కొయెట్జీ 17; మిల్లర్ (సి) పాండ్యా (బి) బుమ్రా 12; విజయ్ శంకర్ (నాటౌట్) 6; తెవాటియా (సి) నమన్ ధీర్ (బి) కొయెట్జీ 22; రషీద్ ఖాన్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 168. వికెట్ల పతనం:** 1–31, 2–64, 3–104, 4–133, 5–134, 6–161. **బౌలింగ్:** హార్దిక్ పాండ్యా 3–0–30–0, ల్యూక్ వుడ్ 2–0–25–0, బుమ్రా 4–0–14–3, ములానీ 3–0–24–0, పియూశ్ చావ్లా 3–0–31–1, నమన్ ధీర్ 1–0–13–0, కొయెట్జీ 4–0–27–2.


ఉమేశ్, గిల్

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) సాహా (బి) అజ్మతుల్లా 0; రోహిత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సాయి కిషోర్ 43; నమన్ ధీర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అజ్మతుల్లా 20; బ్రెవిస్ (సి) అండ్ (బి) మోహిత్ 46; తిలక్ వర్మ (సి) సబ్-మనోహర్ (బి) జాన్సన్ 25; డేవిడ్ (సి) మిల్లర్ (బి) మోహిత్ 11; హార్దిక్ (సి) తెవాటియా (బి) ఉమేశ్ 11; కొయెట్జీ (సి అండ్ బి) జాన్సన్ 1; ములానీ (నాటౌట్) 1; చావ్లా (సి) రషీద్ ఖాన్ (బి) ఉమేశ్ 0; బుమ్రా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 162. వికెట్ల పతనం:** 1–0, 2–30, 3–107, 4–129, 5–142, 6–148, 7–150, 8–160, 9–160. **బౌలింగ్:** ఒమర్జాయ్ 3–0–27–2, ఉమేశ్ 3–0–31–2, రషీద్ 4–0–23–0; సాయి కిషోర్ 4–0–24–1, జాన్సన్ 2–0–25–2, మోహిత్ శర్మ 4–0–32–2.

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు X పంజాబ్

వేదిక: బెంగళూరు

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

గెలుపు దిశగా శ్రీలంక

రెండో ఇన్నింగ్స్‌లోనూ ధనంజయ, మెండిస్ సెంచరీలు

సిల్హెట్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో శ్రీలంక జట్టు విజయం దిశగా పయనిస్తోంది. లంక నిర్దేశించిన 511 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన బంగ్లాదేశ్... మూడో రోజు ఆట ముగిసే సమయానికి 47 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 119/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక 110.4 ఓవర్లలో 418 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీలు చేసిన ధనంజయ డిసిల్వా (108; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), కామిందు మెండిస్ (164; 16 ఫోర్లు, 6 సిక్స్‌లు) అనూహ్యంగా రెండో ఇన్నింగ్స్‌లోనూ శతకాలు బాది చరిత్ర పుటల్లోకి ఎక్కారు. టెస్టు క్రికెట్ చరిత్రలో ఒకే టెస్టులో ఇద్దరు బ్యాటర్లు రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీలు చేయడం ఇది మూడోసారి. గతంలో 1974లో న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరిగిన టెస్టులో ఆస్ట్రేలియా బ్యాటర్లు ఇయాన్ చాపెల్ (145, 121), గ్రెగ్ చాపెల్ (247 నాటౌట్, 133)...2014లో అబుదాబిలో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ బ్యాటర్లు మిస్బా ఉల్ హక్ (101, 101 నాటౌట్), అజహర్ అలీ (109, 100 నాటౌట్) ఈ ఘనత సాధించారు.


మెండిస్, ధనంజయ

రాజస్తాన్ గెలుపు బోణీ...

- సామ్సన్ కెప్టెన్ ఇన్నింగ్స్
- 20 పరుగులతో లక్నో ఓటమి
- కేఎల్ రాహుల్, పూరన్ శ్రమ వృథా

జైపూర్: ఈ ఐపీఎల్‌లో చెన్నై, పంజాబ్, కోల్‌కతా లాగే సొంతగడ్డపై రాజస్తాన్ రాయల్స్ కూడా విజయంతో సీజన్‌కు శ్రీకారం చుట్టింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ కెప్టెన్ సంజూ సామ్సన్ (52 బంతుల్లో 82 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) చెలరేగడంతో రాయల్స్ 20 పరుగుల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌పై గెలిచింది. టాస్ నెగ్గిన రాజస్తాన్ ముందుగా 20 ఓవర్లలో 4 వికెట్లకు 193 పరుగులు చేసింది. తర్వాత లక్నో 20 ఓవర్లలో 6 వికెట్లకు 173 పరుగులే చేసి ఓడిపోయింది. నికోలస్ పూరన్ ((41 బంతుల్లో 64 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), కేఎల్ రాహుల్ (44 బంతుల్లో 58; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు.

సంజూ... ఓ రేంజ్‌లో!

ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (12 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్), జోస్ బట్లర్ (11; 2 ఫోర్లు)ల వేగానికి ఆదిలోనే సీమర్లు మోసిన్, నవీనుల్ కళ్లెం వేశారు. మూడో ఓవర్లో క్రీజులోకి వచ్చిన సామ్సన్‌కు ఆరో ఓవర్లో రియాన్ పరాగ్ (29 బంతుల్లో 43; 1 ఫోర్, 3 సిక్స్) జతయ్యాక రాజస్తాన్ ఆట మారిపోయింది. ఇద్దరు కలిసికట్టుగా లక్నో బౌలర్లపై వేగంగా పరుగులు రాబట్టారు. యశ్ ఠాకూర్, రవి బిష్ణోయ్ బౌలింగ్‌లో చూడచక్కని సిక్సర్లతో అలరించారు. 33 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్న సామ్సన్ ఆఖరిదాకా క్రీజ్ వీడలేదు, వేగం మానలేదు. మూడో వికెట్‌కు సామ్సన్, పరాగ్ 93 పరుగులు జోడించాక పరాగ్ అవుటయ్యాడు. హెట్‌మైర్ (5) నిరాశపరచగా, డెత్ ఓవర్లలో కెప్టెన్‌తో కలిసి ధ్రువ్ జురెల్ (12 బంతుల్లో 20 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) ధాటిగా ఆడాడు.

ఆరంభంలోనే...

భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన సూపర్ జెయింట్స్ ఆరంభంలోనే కష్టాల పాలైంది. ఓపెనర్ డికాక్ (4), దేవదత్ పడిక్కల్ (0), ఆయుశ్ బదోని (1)లను బౌల్ట్, బర్గర్ పడగొట్టేశారు. అపుడు లక్నో స్కోరు 11/3. ఈ దశలో ఓపెనర్, కెప్టెన్ రాహుల్ అడపాదడపా షాట్లతో ఇన్నింగ్స్‌ను నడిపిస్తుంటే... దీపక్ హుడా (13 బంతుల్లో 26; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచేసే పనిలో చహల్ మ్యాజిక్‌కు బోల్తా పడ్డాడు. రాహుల్, పూరన్ చాలాసేపు క్రీజులో నిలవడంతో 16వ ఓవర్ వరకు 145/4 స్కోరు వద్ద లక్నోకు గెలిచే చాన్స్ కనిపించింది. 24 బంతుల్లో 49 పరుగుల సమీకరణం వద్ద రాహుల్‌ను సందీప్... మరుసటి ఓవర్లో హిట్టర్ స్టొయినిస్ (3)ను అశ్విన్ అవుట్ చేయడంతో సూపర్ జెయింట్స్ లక్ష్యానికి దూరమైంది.


సామ్సన్

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) కృనాల్ (బి) మోసిన్ 24; బట్లర్ (సి) రాహుల్ (బి) నవీనుల్ 11; సామ్సన్ (నాటౌట్) 82; పరాగ్ (సి) సబ్-హుడా (బి) నవీనుల్ 43; హెట్‌మైర్ (సి) రాహుల్ (బి) బిష్ణోయ్ 5; జురెల్ (నాటౌట్) 20; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 193. వికెట్ల పతనం:** 1–13, 2–49, 3–142, 4–150. **బౌలింగ్:** మోసిన్ 4–0–45–1, నవీనుల్ 4–0–41–2, కృనాల్ పాండ్యా 4–0–19–0, రవి బిష్ణోయ్ 4–0–38–1, యశ్ ఠాకూర్ 3–0–43–0, ఆయుశ్ 1–0–6–0.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి) బర్గర్ (బి) బౌల్ట్ 4; రాహుల్ (సి) జురెల్ (బి) సందీప్ 58; పడిక్కల్ (బి) బౌల్ట్ 0; బదోని (సి) బట్లర్ (బి) బర్గర్ 1; హుడా (సి) జురెల్ (బి) చహల్ 26; పూరన్ (నాటౌట్) 64; స్టొయినిస్ (సి) జురెల్ (బి) అశ్విన్ 3; కృనాల్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 173. వికెట్ల పతనం:** 1–4, 2–10, 3–11, 4–60, 5–145, 6–154. **బౌలింగ్:** బౌల్ట్ 4–0–35–2, బర్గర్ 3–0–30–1, అశ్విన్ 4–0–35–1, అవేశ్ ఖాన్ 3–0–21–0, చహల్ 3–0–25–1, సందీప్ శర్మ 3–0–22–1.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

సెబీలో 97 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

ముంబైలోని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ).. వివిధ విభాగాల్లో ఆఫీసర్ గ్రేడ్-ఎ(అసిస్టెంట్ మేనేజర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 97
» **పోస్టుల వివరాలు:** జనరల్–62, లీగల్–05, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ–24, ఇంజనీరింగ్ (ఎలక్ట్రికల్)–02, రీసెర్చ్–02, అఫీషియల్ లాంగ్వేజ్–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.03.2024 నాటికి అభ్యర్థుల వయసు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
» **ప్రారంభ వేతనం:** నెలకు రూ.44,500 నుంచి రూ.89,150.
» **ఎంపిక విధానం:** ఫేజ్–1, ఫేజ్–2 ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **గమనిక:** పూర్తి వివరాలు 13.04.2024న వెల్లడి కానున్నాయి.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.sebi.gov.in

ఏపీ ఈసెట్-2024

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి(ఏపీఎస్సీహెచ్ఈ).. ఏపీ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీ ఈసెట్-2024) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఈ /బీటెక్ /బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ విధానంలో రెండో సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఈ పరీక్షను జేఎన్‌టీయూ అనంతపురం నిర్వహించనుంది.

» **అర్హత:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారై ఉండాలి. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు, బీఎస్సీ మ్యాథ్స్ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులు.
» **ఎంపిక విధానం:** ఏపీఈసెట్‌లో వచ్చిన ర్యాంక్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ప్రశ్నాపత్రం 200 ప్రశ్నలతో మొత్తం 200 మార్కులకు ఉంటుంది. కోర్సుకు అనుగుణంగా ప్రశ్నాపత్రాలు ఉంటాయి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తులకు చివరి తేది:** 15.04.2024.
» **పరీక్ష తేది:** 08.05.2024
» **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

ఇండియన్ బ్యాంక్, చెన్నైలో 146 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

ఇండియన్ బ్యాంక్ దేశవ్యాప్తంగా ఉన్న ఐబీ శాఖల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 146
» **పోస్టుల వివరాలు:** చీఫ్ మేనేజర్, సీనియర్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్,మేనేజర్.
» **విభాగాలు:** క్రెడిట్, ఎన్ఆర్ బిజినెస్ రిలేషన్‌షిప్, సెక్యూరిటీ, ఎంఎస్ఎంఈ రిలేషన్‌షిప్, డిజిటల్ మార్కెటింగ్, ఎస్ఈవో అండ్ వెబ్‌సైట్ స్పెషలిస్ట్, సోషల్ మీడియా స్పెషలిస్ట్, క్రియేటివ్స్ ఎక్స్‌పర్ట్, ఫారెక్స్/ట్రేడ్ ఫైనాన్స్, ట్రెజరీ డీలర్, ట్రేడింగ్/ఆర్బిట్రేజ్ ఇన్ కరెన్సీ ఫ్యూచర్స్, ట్రేడింగ్ ఇన్ ఇంటర్ బ్యాంక్, మేనేజర్–డీబీఏ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో సీఏ/సీడబ్ల్యూఏ/ఐసీడబ్ల్యూఏ, డిగ్రీ, పీజీ డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, రాతపరీక్ష/ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.04.2024
» **వెబ్‌సైట్:** www.indianbank.in

యూపీఎస్సీలో 28 పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 28
» **పోస్టుల వివరాలు:** ఆంత్రోపాలజిస్ట్(ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా)–08, అసిస్టెంట్ కీపర్(ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా)–01, సైంటిస్ట్ బి(కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)–03, రీసెర్చ్ ఆఫీసర్/ప్లానింగ్ ఆఫీసర్(డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్)–01, అసిస్టెంట్ మైనింగ్ జియాలజిస్ట్(ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్)–01, అసిస్టెంట్ మినరల్ ఎకనామిస్ట్(ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్)–01, ఎకనామిక్ ఆఫీసర్(రూరల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్)–09, సీనియర్ లెక్చరర్/అసిస్టెంట్ ప్రొఫెసర్(అనెస్తీషియాలజీ)–03, సీనియర్ లెక్చరర్/అసిస్టెంట్ ప్రొఫెసర్(రేడియో–డయాగ్నోసిస్)–01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.03.2024
» **వెబ్‌సైట్:** https://upsc.gov.in

మేటి సంస్థల్లో ఎంసీఏ

పీజీ స్థాయిలో కంప్యూటర్ స్పెషలైజేషన్‌తో.. సాఫ్ట్‌వేర్ రంగంలో కెరీర్ కోరుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. దేశంలోని ప్రముఖ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్స్ నిట్‌ల్లో ఎంసీఏలో అడ్మిషన్స్‌కు నోటిఫికేషన్ విడుదలైంది. నిట్‌లు నిర్వహించే నిమ్‌సెట్‌లో స్కోర్‌తో ప్రవేశం సొంతం చేసుకోవచ్చు. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి నిమ్‌సెట్-2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. నిమ్‌సెట్ ప్రత్యేకత, ఎంపిక విధానం, పరీక్ష ప్యాట్రన్, సిలబస్ విశ్లేషణ, ఎంసీఏతో కెరీర్ అవకాశాలు తదితర వివరాలు..

» నిట్ క్యాంపస్‌ల్లో ఎంసీఏ ప్రవేశాలకు నిమ్‌సెట్
» నిట్‌ల్లో ఎంసీఏతో ఐటీలో దీటైన కెరీర్ అవకాశాలు
» నిమ్‌సెట్-2024 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్.. సంక్షిప్తంగా ఎంసీఏ. ఈ కోర్సు బ్యాచిలర్ డిగ్రీ తర్వాత కంప్యూటర్ పీజీకి చక్కటి మార్గం. ఎంసీఏను బెస్ట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో చదివేందుకు అవకాశం కల్పిస్తుంది నిమ్‌సెట్. దేశంలో ఇంజనీరింగ్ కోర్సులను అందించడంలో మంచి పేరున్న నిట్‌లు.. పీజీ స్థాయిలో మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సును అందిస్తున్నాయి. ఈ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షనే.. నిట్ ఎంసీఏ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (నిమ్‌సెట్).

11 క్యాంపస్‌లు.. 1,033 సీట్లు

నిమ్‌సెట్ ర్యాంకు ఆధారంగా ప్రస్తుతం 11 నిట్ క్యాంపస్‌ల్లో ఎంసీఏలో ప్రవేశం కల్పిస్తున్నారు. అగర్తల–30 సీట్లు, అలహాబాద్–116 సీట్లు, భోపాల్–115, జంషెడ్‌పూర్– 115, కురుక్షేత్ర–64, కురుక్షేత్ర (సెల్ఫ్ ఫైనాన్సింగ్) 32, రాయ్‌పూర్ 110, సూరత్‌కల్–58, తిరుచిరాపల్లి–115, వరంగల్–58, భోపాల్ –60, పాట్నా (డేటా సైన్స్, ఇన్ఫర్మాటిక్స్– 40, పాట్నా (ఏఐ అండ్ ఐఓటీ)–40 సీట్లు ఉన్నాయి. వీటితోపాటు నిట్ పాట్నాలో డేటా సైన్స్ అండ్ ఇన్ఫర్మాటిక్స్‌లో సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానంలో 40; అదే విధంగా ఐఏ అండ్ ఐఓటీలోనూ సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానంలో మరో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి. నిట్ సూరత్‌కల్, నిట్-వరంగల్ క్యాంపస్‌లు మూడేళ్ల వ్యవధిలో ఎంసీఏ ప్రోగ్రామ్‌ను అందిస్తూ.. రెండో ఏడాది తర్వాత ఎగ్జిట్ అవకాశాన్ని కల్పిస్తున్నాయి. రెండేళ్ల తర్వాత మానేయాలనుకునే వారికి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ సర్టిఫికెట్‌ను అందిస్తారు.

అర్హతలు

మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్‌లలో ఏదో ఒకటి ప్రధాన సబ్జెక్ట్‌గా 60 శాతం మార్కులు/ 6.5 సీజీపీఏతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 55 శాతం మార్కులు లేదా 6 జీపీఏ పొందాలి) ఉండాలి. (లేదా) బీఈ/బీటెక్ చదివిన వారు కూడా నిమ్‌సెట్–2024కు దరఖాస్తు చేసుకోవచ్చు. బీబీఏ కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సు ఉత్తీర్ణులు కూడా దరఖాస్తుకు అర్హులే. అదే విధంగా అర్హత కోర్సు చివరి సంవత్సరం/సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు సెప్టెంబర్ 30 లోపు సర్టిఫికెట్లు పొందాల్సి ఉంటుంది.

3 విభాగాలు.. 1000 మార్కులు

నిమ్‌సెట్ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో మొత్తం మూడు విభాగాల్లో వేయి మార్కులకు ఉంటుంది. మొదటి విభాగంలో మ్యాథమెటిక్స్ నుంచి 50 ప్రశ్నలు–600 మార్కులకు అడుగుతారు. రెండో విభాగంలో అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 40 ప్రశ్నలు–240 మార్కులకు ఉంటాయి. మూడో విభాగంలో కంప్యూటర్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలు–120 మార్కులకు; జనరల్ ఇంగ్లిష్ 10 ప్రశ్నలు–40 మార్కులకు అడుగుతారు. నెగెటివ్ మార్కుల విధానం ఉంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు.



ఉమ్మడి కౌన్సెలింగ్ అడ్మిషన్

నిమ్‌సెట్ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు కల్పించే 11 నిట్‌లు ఆన్‌లైన్ విధానంలో ఉమ్మడి కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయిస్తాయి. అభ్యర్థులు నిమ్‌సెట్ ర్యాంకు ఆధారంగా నిమ్‌సెట్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ అడ్మిషన్ అప్లికేషన్‌ను పూర్తి చేయాలి. ఇలా అప్లికేషన్ పూర్తి చేసే సమయంలోనే ప్రాధాన్యతా క్రమంలో తమకు ఆసక్తి ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లను పేర్కొనాలి. ఆ తర్వాత అభ్యర్థులకు వచ్చిన ర్యాంకు, ఎంచుకున్న ఇన్‌స్టిట్యూట్‌లు, అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా ఆన్‌లైన్‌లోనే సీట్ అలాట్‌మెంట్ చేస్తారు.

ఉజ్వల అవకాశాలు

నిమ్‌సెట్ ద్వారా నిట్‌ల్లో ఎంసీఏలో ప్రవేశం పొందితే ఉజ్వల భవిష్యత్తుకు మార్గం ఏర్పడినట్లే!. ఈ కోర్సు బోధనలో నిట్‌లు అనుసరిస్తున్న ప్రమాణాలు, నాణ్యత కారణంగా విద్యార్థులకు కంప్యూటర్ అప్లికేషన్స్, ఇతర సాఫ్ట్‌వేర్ అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. దీంతో వీరికి సీఎస్ఈ అభ్యర్థులకు దీటుగా అవకాశాలు లభిస్తున్నాయి. గత మూడేళ్ల గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే.. సదరు నిట్‌ల్లో ఎంసీఏ పూర్తి చేసుకున్న వారిలో నూటికి తొంభై శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఖరారవుతున్నాయి. అదే విధంగా వేతనాలు కూడా సగటున రూ.ఆరు లక్షల నుంచి ఎనిమిది లక్షల వరకు లభిస్తున్నాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 2024, ఏప్రిల్ 20.
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** 2024, ఏప్రిల్ 24–ఏప్రిల్ 26.
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** మే 28 – జూన్ 8.
- **నిమ్‌సెట్ పరీక్ష తేదీ:** 2024,జూన్ 8
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.nimcet.in

బెస్ట్ స్కోర్‌కు మార్గాలు

మ్యాథమెటిక్స్

ఈ విభాగానికి సంబంధించి విద్యార్థులు తమ బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలోని మ్యాథమెటిక్స్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా సెట్ థియరీ, ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్, అల్జీబ్రా, కో ఆర్డినేట్ జామెట్రీ, కాలిక్యులస్, వెక్టార్స్, ట్రిగ్నోమెట్రీలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలి. వీటిలో సంబంధిత అంశాల కాన్సెప్ట్‌లు, అప్లికేషన్స్‌పై పట్టు సాధించాలి.ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. అదే విధంగా సైంటిఫిక్ కంప్యూటర్ కాలిక్యులేటర్‌పై అవగాహన పెంచుకోవాలి.

అనలిటికల్ ఎబిలిటీ,లాజికల్ రీజనింగ్

అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్.. నిమ్‌సెట్‌లో మరో కీలక విభాగం. ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడిగే విభాగం ఇది. ఇందులో రాణించాలంటే.. అభ్యర్థులు విశ్లేషణ నైపుణ్యాలను, అదే విధంగా తార్కిక ఆలోచనను పెంచుకోవాలి.

ఇందుకోసం ప్రామాణిక పుస్తకాలను చదువుతూ ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా నిమ్‌సెట్ గత ప్రశ్న పత్రాల సాధన కూడా ఉపకరిస్తుంది.

కంప్యూటర్ అవేర్‌నెస్

అభ్యర్థుల్లోని కంప్యూటర్ బేసిక్ నైపుణ్యాలను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌కు సంబంధించి బేసిక్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా డేటా రిప్రజెంటేషన్ అంశాలపైనా పట్టు సాధించాలి.

జనరల్ ఇంగ్లిష్

అభ్యర్థుల్లోని ఇంగ్లిష్ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందులో మంచి మార్కులు పొందడానికి కాంప్రహెన్షన్, వొకాబ్యులరీ, బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్ అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం కాంపిటీటివ్ ఇంగ్లిష్ టెస్ట్ బుక్స్‌ను అధ్యయనం చేయాలి. వీటితోపాటు కాంప్రహెన్షన్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లను చదవడం మంచిది.

ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం

అభ్యర్థులు రీడింగ్‌తో పాటు ప్రాక్టీస్‌కు కూడా ప్రిపరేషన్‌లో ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి రోజు తాము చదివిన అంశాలకు సంబంధించి ప్రశ్నార్థమైన వాటిని గుర్తించి సెల్ఫ్ టెస్ట్‌లు రాసుకోవాలి. అదే విధంగా మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లు రాయడం కూడా ఎంతో మేలు చేస్తుంది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	191	72,832
నిఫ్టీ ▲	83	22,097

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	16,429	▲	27
డోజోన్స్	39,476	▽	305
ఎఫ్‌టీఎస్ఈ 100	7,931	▲	48
డాక్స్	18,213	▲	33
హాంగ్‌సెంగ్	3,048	▽	29
నికాయ్	40,897	▲	62


•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.88	83.90
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.10	106.66
€	యూరో	ఎస్‌బీఐ	89.19	91.57
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.43	55.65
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.52	55.42
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.46	64.27
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.31	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.79	23.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.41	12.51

మీ పెట్టుబడులకు రక్షణ ఉందా?


స్మాల్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌కు స్ట్రెస్ టెస్ట్ • ప్రతి నెలా డేటా విడుదల • పెట్టుబడుల్లో రిస్క్‌లు తెలుసుకునే చాన్స్



రిటైల్ ఇన్వెస్టర్లకు చిన్న కంపెనీలంటే చెప్పలేనంత ఆకర్షణ. అందుకే నేరుగా స్టాక్స్‌లో లేదంటే మ్యూచువల్ ఫండ్స్ రూపంలో స్మాల్, మిడ్‌క్యాప్ కంపెనీల్లోనే ఎక్కువగా ఇన్వెస్ట్ చేస్తుంటారు. పెద్ద కంపెనీలతో పోల్చి చూస్తే, దీర్ఘకాలంలో చిన్న, మధ్యస్థాయి కంపెనీల్లో అధిక రాబడులు వారిని ఆకట్టుకుంటున్నాయి. కానీ, పెద్ద కంపెనీలతో పోలిస్తే వీటిల్లో రిస్క్ పాళ్లు అధికం. ఈ రిస్క్‌ను రిటైల్ ఇన్వెస్టర్లలో అధిక శాతం మంది పట్టించుకోవడం లేదు. ఫలితం మార్కెట్ దిద్దుబాట్లలో తప్పటడుగుల కారణంగా భారీగా నష్టపోవాల్సి వస్తోంది. ఈ రిస్క్‌ను ఇన్వెస్టర్లు అర్థం చేసుకునేందుకు తీసుకొచ్చిందే స్ట్రెస్ టెస్ట్.

గడిచిన మూడేళ్ల డేటాను గమనించినట్టయితే స్మాల్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి భారీ మొత్తంలో పెట్టుబడులు వచ్చినట్టు తెలుస్తోంది. ఒక్క 2023 సంవత్సరంలోనే మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.23,000 కోట్లు వస్తే.. చిన్న కంపెనీల్లో పెట్టుబడులు పెట్టే స్మాల్ క్యాప్ పథకాలు రూ.41,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. 2022లోనూ మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.20,500 కోట్లు, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.19,795 కోట్ల చొప్పున వచ్చాయి. కానీ, అస్థిరతలు తక్కువగా ఉండే లార్జ్‌క్యాప్ పథకాల నుంచి 2023లో ఇన్వెస్టర్లు రూ.3,000 కోట్లను ఉపసంహరించుకోవడం గమనార్హం. మూడేళ్ల కాలంలో స్మాల్ క్యాప్ ఫండ్స్ ఏటా 24 శాతం చొప్పున రాబడిని ఇవ్వగా, మిడ్‌క్యాప్ ఫండ్స్ ఏటా 22 శాతం చొప్పున ఇన్వెస్టర్లకు పెట్టుబడులపై ప్రతిఫలాన్ని అందించాయి. ఈ స్థాయి రాబడిని చూసి ఇన్వెస్టర్లు మరింతగా పెట్టుబడులను ఈ పథకాల్లోకి కుమ్మరిస్తున్నారు. వచ్చే పెట్టుబడుల ప్రవాహానికి తగ్గట్టు ఫండ్స్ సంస్థలు చిన్న, మధ్య స్థాయి కంపెనీల్లో ఆ మేరకు పెట్టుబడులు పెట్టాల్సి వస్తుంది. ఇవన్నీ కలసి స్టాక్స్ వ్యాల్యుయేషన్లు ఓ బుడగ మాదిరి తయారవుతున్నట్టు క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ ఆందోళన చెందింది. ఫలితంగా కొన్ని అసాధారణ నిర్ణయాలు తీసుకుంది. చిన్న, మధ్య స్థాయి కంపెనీల్లో ఉండే రిస్క్ నుంచి ఇన్వెస్టర్ల ప్రయోజనాల రక్షణకు కార్యాచరణ రూపొందించుకోవాలని, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి పెట్టుబడులను నియంత్రించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు, అన్ని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌కు సంబంధించి 'స్ట్రెస్ టెస్ట్' నిర్వహించాలని ఫండ్స్ సంస్థలను (ఏఎంసీలు) ఆదేశించింది. లిక్విడిటీ స్ట్రెస్ టెస్ట్ ఫలితాలను మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు ప్రకటిస్తున్నాయి. వీటి గురించి తెలుసుకోవడం అవసరం.

ఏమిటీ ఈ స్ట్రెస్ టెస్ట్?



పైకి ఎలాంటి అనారోగ్య సమస్యలూ కనిపించకపోవచ్చు. మరి అనూహ్యంగా హార్ట్ ఎటాక్‌తో చిన్న వయసులోనే కొందరు ఎందుకు మరణిస్తున్నట్టు? గుండె సామర్థ్యాన్ని, సమీప కాలంలో వచ్చే ముప్పును తెలుసుకునేందుకు వైద్యులు ట్రెడ్ మిల్ టెస్ట్ (టీఎంటీ) నిర్వహిస్తుంటారు. మెషిన్‌పై శ్రమతో నడుస్తున్న సమయంలో గుండె స్పందనలు ఎలా ఉన్నాయనే దాని ఆధారంగా భవిష్యత్ రిస్క్‌లను వైద్యులు అంచనా వేస్తారు. మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించిన స్ట్రెస్ టెస్ట్ కూడా ఇదే మాదిరి అనుకోవచ్చు. 2020 కరోనా సమయంలో స్టాక్ మార్కెట్ క్రాష్ గుర్తుండే ఉంటుంది. ఈ తరహా పతనాల్లో మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు తమ నిర్వహణలోని పెట్టుబడుల (ఏయూఎం)ను ఎంత సమర్థవంతంగా నిర్వహిస్తాయి? రిస్క్‌ను ఎలా ఎదుర్కొంటాయి? ఇన్వెస్టర్ల ప్రయోజనాలను ఎంత మేరకు కాపాడగలవు? ఇన్వెస్టర్లు ఒక్కసారిగా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకునేందుకు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తే తిరిగిచ్చే సామర్థ్యం ఫండ్స్ సంస్థలకు ఉంటుందా? ఇత్యాది అంశాలన్నీ తెలుసుకోవడానికి ఈ స్ట్రెస్ టెస్ట్ ఉపకరిస్తుంది.

మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించి ఇది కొత్తగా విని ఉండొచ్చేమో..! కానీ ఆర్‌బీఐ ప్రతి ఆరు నెలలకు ఒకసారి బ్యాంక్‌లకు సంబంధించి లిక్విడిటీ స్ట్రెస్ టెస్ట్‌ను నిర్వహిస్తుంటుంది. బ్యాంకుల్లో నగదు లభ్యత ఎలా ఉంది? కొరతను ఎదుర్కొంటున్నాయా? అన్నది ఆర్‌బీఐ మదింపు చేస్తుంటుంది.

దీని అవసరం..?



బాండ్ల మార్కెట్లలో మాదిరే ప్రతికూల సమయాల్లో స్మాల్, మిడ్‌క్యాప్ పథకాలకు సంబంధించి కూడా లిక్విడిటీ సమస్య ఏర్పడుతుంటుంది. ఒక మోస్తరు ఆస్తులను (పెట్టుబడులు/ఏయూఎం) నిర్వహిస్తున్నంత వరకు ఈ లిక్విడిటీ అనేది మ్యూచువల్ ఫండ్స్‌కు పెద్ద సమస్య కాబోదు. కానీ, గడిచిన ఏడాది రెండేళ్లలో స్మాల్, మిడ్ క్యాప్ పథకాల్లోకి వస్తున్న భారీ పెట్టుబడులు లిక్విడిటీ పరంగా కొంత ఆందోళన కలిగిస్తున్నాయి. 2024 ఫిబ్రవరి నాటికి అన్ని స్మాల్‌క్యాప్ ఫండ్స్ నిర్వహణలోని ఏయూఎం రూ.2.49 లక్షల కోట్లకు చేరితే, మిడ్‌క్యాప్ ఫండ్స్ ఏయూఎం రూ.2.95 లక్షల కోట్లకు చేరుకోవడాన్ని ఇక్కడ గమనించాలి. ఇప్పుడు ఈ విభాగాల్లోని పెద్ద పథకాలు ఒక్కో దాని నిర్వహణలోని ఆస్తులు రూ.25,000–60,000 కోట్లకు చేరాయంటే ఏ స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. రూ.60,000 కోట్ల ఆస్తులు నిర్వహించే పథకం ఒక శాతం (రూ.600 కోట్లు) మేర స్టాక్స్‌ను విక్రయించినా దాన్ని మార్కెట్ సర్దుబాటు చేసుకోవడం కష్టంగానే ఉంటుంది. ముఖ్యంగా లిక్విడిటీ తక్కువగా ఉండే స్టాక్స్‌లో (తక్కువ వ్యాల్యూమ్ ట్రేడ్ అయ్యేవి) ఈ రిస్క్ ఇంకా ఎక్కువ. కొద్ది అమ్మకాలకే స్టాక్ ధరలు నేలచూపులు చూస్తాయి. దీంతో ఆయా పథకాల యూనిట్ నెట్ అస్సెట్ వ్యాల్యూ (ఎన్‌ఏవీ) అదే స్థాయిలో పడిపోతుంది.

స్ట్రెస్ టెస్ట్ డేటాతో ఇన్వెస్టర్లకు తాము ఇన్వెస్ట్ చేసిన పథకాల్లో ఉండే రిస్క్ ఎంతన్నది తెలుస్తుంది. ఎన్ని రోజుల్లో పెట్టుబడులను ఫండ్ మేనేజర్లు నగదుగా మార్చుకుంటున్నారన్నది ఇందులో కీలకమైన అంశం. ఇప్పటి వరకు విడుదలైన స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ స్ట్రెస్ టెస్ట్ ఫలితాలను ఒక్కసారి తప్పకుండా గమనించాలి. స్మాల్‌క్యాప్ పథకాలు తమ పెట్టుబడుల్లో 50 శాతాన్ని విక్రయించి నగదుగా మార్చుకునేందుకు సగటున 22 నుంచి 60 రోజులు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. అదే 25 శాతం పెట్టుబడులను విక్రయించేందుకు 11–30 రోజుల సమయం పడుతోంది. మొత్తం ఒకే రోజు విక్రయించేందుకు ఇక్కడ అవకాశాలు పరిమితం. ఎందుకంటే ఆయా స్టాక్స్‌లో లిక్విడిటీ (ట్రేడింగ్ వ్యాల్యూమ్) చాలా తక్కువగా ఉంటుందన్న అంశాన్ని గుర్తు పెట్టుకోవాలి. సాధారణంగా స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ పథకాల వద్ద నగదు నిల్వలు 4.5 శాతం నుంచి 11 శాతం మధ్య ఉన్నాయి. ఒకేసారి అమ్మకాల ఒత్తిడి ఎదురైతే తొలుత ఈ నగదు నిల్వలతో ఫండ్స్ గట్టెక్కగలవు. అప్పటికీ రిడెంప్షన్ (ఉపసంహరణ) ఒత్తిడి ఆగకపోతే పెట్టుబడులను విక్రయించాల్సి వస్తుంది.

స్ట్రెస్ టెస్ట్ ఎలా నిర్వహిస్తారు?

పథకాల పోర్ట్‌ఫోలియోలో 50, 25 శాతం మేర స్టాక్స్‌ను విక్రయించేందుకు వీలుగా మ్యూచువల్ ఫండ్స్ సంస్థల మేనేజర్లు కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. తమ స్టాక్స్‌కు సంబంధించి గడిచిన మూడు నెలల్లో సగటు ట్రేడింగ్ వ్యాల్యూమ్‌ను పరిశీలిస్తారు. లిక్విడిటీ (వ్యాల్యూమ్) చాలా తక్కువగా ఉన్న దిగువ స్థాయి 20 శాతం స్టాక్స్‌ను మినహాయిస్తారు. మిగిలిన స్టాక్స్ వాల్యూమ్ మార్కెట్లు ఆటుపోట్లను ఎదుర్కొనే సమయంలో ఏ మేరకు పెరుగుతుందన్నది ఊహాత్మక గణాంకాల ఆధారంగా అంచనా వేస్తారు. ఈ గణాంకాల ఆధారంగా పోర్ట్‌ఫోలియోలోని స్టాక్స్ (హోల్డింగ్స్)ను ఎన్ని రోజుల్లో విక్రయించగలమనే అంచనాకు వస్తాయి. ఒక పథకం తన పెట్టుబడుల్లో 25 శాతాన్ని, 50 శాతాన్ని ఎన్ని రోజుల్లో విక్రయించగలదన్నది దీని ద్వారా తెలుస్తుంది. సెబీ ఆదేశాల ప్రకారం ఫండ్స్ ప్రతి నెలా ఈ విధమైన స్ట్రెస్ టెస్ట్ నిర్వహించి, ఫలితాలను తర్వాతి 15 రోజుల్లోపు ఆన్‌లైన్ పోర్టల్‌పై వెల్లడించాలి. ఆయా పథకాల్లో పెట్టుబడులు పెట్టిన టాప్–10 ఇన్వెస్టర్ల వివరాలను కూడా ఫండ్స్ వెల్లడించాల్సి ఉంటుంది.

వర్రీ అక్కర్లేదు..

ఒక పథకం తన నిర్వహణ పెట్టుబడుల్లో 50 శాతం విక్రయించేందుకు 60 రోజుల సమయం పడుతుందని వెల్లడించిన సందర్భాల్లో.. ఇన్వెస్టర్ల ఉపసంహరణ క్లెయిమ్‌లు ఒకే సారి ఎక్కువ మొత్తంలో వస్తే ఆమోదిస్తుందా? అన్న సందేహం అక్కర్లేదు. ఈ స్ట్రెస్ టెస్ట్ ఫలితాలు అన్నీ కూడా వాస్తవంగా మార్కెట్లో విక్రయించి, వెల్లడించిన డేటా కాదు. మార్కెట్ పతనాల్లో ఎన్ని రోజుల్లో విక్రయించగలమో ఊహాత్మకంగా వేసిన అంచనాలే. ఆయా సమయంలో ఫండ్స్ పెట్టుబడుల్లో ఉండే రిస్క్‌ల గురించి తెలుసుకునేందుకు ఈ డేటా ఇన్వెస్టర్లకు సాయంగా ఉంటుంది. ముఖ్యంగా పెట్టుబడుల్లో 25 శాతం నుంచి 50 శాతం మేర ఉపసంహరణ ఒత్తిళ్లు రావడం అన్నది చాలా అరుదుగానే ఉంటుంది. ఎక్కువ సందర్భాల్లో పెట్టుబడుల ఉపసంహరణ ఒత్తిళ్లు 10 శాతం మించవు. దీనికంటే కూడా మార్కెట్లు పడడం మొదలైన తర్వాత ఇన్వెస్టర్లు తాజా పెట్టుబడులు నిలిపివేయడం మన దేశంలో ఎక్కువగా కనిపిస్తుంది. అంతే కానీ అప్పటికే చేసిన ఫండ్స్ పెట్టుబడులను ఉపసంహరించుకోవడం అరుదు. నష్టభయమే దీనికి కారణం. నిజానికి మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ సంస్థలైన అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీలు) లిక్విడిటీ రిస్క్ విషయంలో తగిన సన్నద్ధంగానే ఉంటాయి. అందుకే స్మాల్‌క్యాప్ అయినా, మిడ్‌క్యాప్ అయినా పెట్టుబడుల్లో 35 శాతం వరకు తీసుకెళ్లి లార్జ్‌క్యాప్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ఎదురైతే ముందుగా లార్జ్‌క్యాప్ పెట్టుబడులనే నగదుగా మార్చుకుంటాయి. దీనికి తోడు పథకంలో కొంత మేర నగదు నిల్వలు కూడా ఉంటాయి. వీటికి అదనంగా పథకం మొత్తం పెట్టుబడుల విలువలో 20 శాతం మేర రుణం తీసుకుని స్వల్పకాల అమ్మకాల ఒత్తిడిని అధిగమించేందుకు సెబీ నిబంధనలు అనుమతిస్తున్నాయి.

విశ్లేషణకు కీలక డేటా

ఆయా పథకంలో కేవలం కొద్ది మంది ఇన్వెస్టర్లే ఎక్కువ పెట్టుబడులు కలిగి ఉన్నారా? లేదా అన్నది తెలుస్తుంది. ఉదాహరణకు ఒక పథకం నిర్వహణలో రూ.2,000 కోట్ల పెట్టుబడులు ఉన్నాయని అనుకుందాం. కేవలం ఐదు, పది మంది ఇన్వెస్టర్లకు సంబంధించే రూ.500 కోట్ల పెట్టుబడులు ఉంటే, అది రిస్క్‌కు దారితీస్తుంది. ఆ స్థాయిలో పెట్టుబడులు కలిగి ఉన్నవారు స్మార్ట్ ఇన్వెస్టర్ల కిందకే వస్తారు. మార్కెట్ పతనం మొదలైన వెంటనే, ముందుగా వారు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నిస్తే పథకం ఎన్‌ఏవీ దారుణంగా పడిపోతుంది. ఇది మిగిలిన ఇన్వెస్టర్ల పెట్టుబడుల విలువను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. అయితే, తాజా స్ట్రెస్ టెస్ట్ ఫలితాలను గమనిస్తే ఈ రిస్క్ దాదాపు లేనట్టేనని తెలుస్తోంది. ఒక పథకం పెట్టుబడుల విలువలో టాప్–10 ఇన్వెస్టర్లకు సంబంధించి పెట్టుబడుల విలువ 0.61–2.1 శాతం మించి లేదు.

స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ పథకాలు అయినప్పటికీ లార్జ్‌క్యాప్ కంపెనీలకు సైతం చెప్పుకోతగ్గ మేర కేటాయింపులు చేసిన పథకాల్లో లిక్విడిటీ రిస్క్ చాలా తక్కువ. ఎందుకంటే లార్జ్‌క్యాప్‌లో లిక్విడిటీ సమస్య ఉండదు. కావాలంటే ఒకే రోజు మొత్తం పెట్టుబడులను విక్రయించుకోగలవు. ఇక స్మాల్‌క్యాప్ ఫండ్స్‌తో పోలిస్తే మిడ్‌క్యాప్ ఫండ్స్ లిక్విడిటీ మెరుగ్గా ఉంది. స్మాల్‌క్యాప్ పథకాలతో పోలిస్తే సగం వ్యవధిలోనే మిడ్‌క్యాప్ ఫండ్స్ తమ పెట్టుబడులను విక్రయించుకోగలవని స్ట్రెస్ టెస్ట్ డేటా తెలియజేస్తోంది. కాకపోతే మిడ్‌క్యాప్ పథకాల్లో టాప్–10 ఇన్వెస్టర్లకు సంబంధించిన పెట్టుబడులు 1.3–4.9 శాతం మధ్య ఉన్నాయి. అంటే కొంచెం కాన్సన్‌ట్రేషన్ రిస్క్ ఉన్నట్టు. అవసరమైతే డేటా విశ్లేషణకు నిపుణుల సలహాలు తీసుకోవచ్చు.

సంక్షోభాల్లో ఎలా..?

తీవ్ర ప్రపంచ ప్రతికూల పరిణామాల్లో మార్కెట్లు కుప్పకూలితే, ఫండ్స్ పథకాలు లిక్విడిటీ రిస్క్‌ను గట్టెక్కుతాయా? అంటే అవుననే చెప్పుకోవాలి. కానీ, వాస్తవ పరిస్థితుల్లో ఫలితాలు ఇలానే ఉండాలని లేదు. అప్పుడు ఇన్వెస్టర్లు ఎలా ప్రతిస్పందిస్తారు..? ప్రతికూల పరిణామాలు స్వల్ప కాలమా? లేక దీర్ఘకాలమా? తదితర అంశాలు అప్పటి వాస్తవ లిక్విడిటీ రిస్క్‌ను ప్రభావితం చేస్తాయి. ఎలాంటి ప్రతికూల పరిణామాలు అయినా సరే తమ పెట్టుబడులను వెనక్కి ఇవ్వాలని ఇన్వెస్టర్లు కోరితే.. ఫండ్స్ సంస్థలు తప్పకుండా అనుసరించాల్సిందే. నష్టానికి అయినా అవి అమ్మి చెల్లింపులు చేస్తాయి.

మార్గం ఏంటి?

స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఫండ్స్ లిక్విడిటీ తక్కువగా ఉండే స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. అంతేకానీ, పెట్టుబడుల ఉపసంహరణకు ఇది సంకేతం కాదు. రిస్క్‌లను అర్థం చేసుకోలేని వారు, ఎన్‌ఏవీలు గణనీయంగా పడిపోయినప్పుడు ఓపిక పట్టలేని వారు ఈ తరహా పెట్టుబడులను తగ్గించుకోవాలి. దీర్ఘకాల లక్ష్యాల కోసం ఉద్దేశించిన పెట్టుబడులను స్వల్పకాలిక ఆటుపోట్లను చూసి విక్రయించుకోవడం సరైన నిర్ణయం అనిపించుకోదు. అంత రిస్క్ వద్దనుకుంటే లార్జ్‌క్యాప్‌నకు ఎక్కువ కేటాయింపులు చేసుకోవాలి. ఒకేసారి ఒక పథకం నుంచి 25–50 శాతం పెట్టుబడులు బయటకు వెళ్లిపోవడం సాధారణంగా జరగదు. కనుక స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ పెట్టుబడులకు దూరంగా ఉండాల్సిన అవసరం ఏమీ లేదు.

ఇవీ ఉదాహరణలు

- రూ.46,000 కోట్ల పెట్టుబడులను నిర్వహించే నిప్పన్ ఇండియా స్మాల్‌క్యాప్ ఫండ్. తన పెట్టుబడుల్లో 50 శాతాన్ని నగదుగా మార్చుకునేందుకు 27 రోజులు, 25 శాతం పెట్టుబడుల విక్రయానికి 13 రోజులు పడుతుందని స్ట్రెస్ టెస్ట్ ఫలితాలను విడుదల చేసింది.
- రూ.17,193 కోట్ల పెట్టుబడులను నిర్వహించే క్వాంట్ స్మాల్‌క్యాప్ ఫండ్ తన పెట్టుబడుల్లో 50 శాతం విక్రయించేందుకు 22 రోజులు, 25 శాతాన్ని విక్రయించేందుకు 11 రోజులు తీసుకుంటుందని తెలిపింది.
- రూ.25,500 కోట్లు నిర్వహించే ఎస్‌బీఐ స్మాల్ క్యాప్ ఫండ్ 50 శాతం పెట్టుబడుల విక్రయానికి 60 రోజులు పడుతుందని వెల్లడించింది.
- క్వాంట్ మిడ్‌క్యాప్ ఫండ్ 100% పెట్టుబడుల విక్రయానికి 10 రోజులు, 25% పెట్టుబడుల అమ్మకానికి 5 రోజులు చాలని ప్రకటించింది.
- అదే యాక్సిస్ మిడ్‌క్యాప్ ఫండ్ 50 % పెట్టుబడులను 12 రోజుల్లో, 25% పెట్టుబడులను 6 రోజుల్లో నగదుగా మార్చుకోగలనని పేర్కొంది.



సీజీ కన్జూమర్ | ఎలారా సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 269 టార్గెట్: రూ. 325



ఎందుకంటే: ఎలక్ట్రికల్ అప్లయెన్సెస్ దిగ్గజం క్రాంప్టన్ గ్రీవ్స్ కన్జూమర్ ఎలక్ట్రికల్స్ ఈ ఏడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో స్టాండెలోన్ ఆదాయం వార్షికంగా 15 శాతం ఎగసి రూ. 1,460 కోట్లకు చేరింది. ఇది మా అంచనాలకంటే 6 శాతం అధికంకాగా.. కొత్త ప్రొడక్టుల విడుదల, ఊపందుకున్న డిమాండ్ ఇందుకు దోహదపడ్డాయి. విభాగాలవారీగా చూస్తే ఎలక్ట్రికల్ కన్జూమర్ డ్యూరబుల్స్ అమ్మకాలు 19 శాతం పుంజుకున్నాయి. ప్రత్యర్థి కంపెనీలలో హావెల్స్ 3 శాతం, వీగార్డ్ 11 శాతం వృద్ధి చూపగా.. కొన్ని త్రైమాసికాల వెనకడుగు తదుపరి కంపెనీ(సీజీ) లైటింగ్ విభాగం 1 శాతం మెరుగుపడింది. హావెల్స్ లైటింగ్ విభాగం 2 శాతం బలపడింది. క్యూ3లో ఆల్టర్నేట్ చానల్స్ విక్రయాలు 38 శాతం జంప్‌చేశాయి. ప్రధానంగా ఈకామర్స్ అమ్మకాలు రెట్టింపయ్యాయి. బటర్‌ఫ్లై గంధిమతి ఆర్థిక పనితీరును సైతం కంపెనీకి జత చేసి మదింపు చేస్తే ఈ ఆర్థిక సంవత్సరం (2023–24)లో షేరువారీ ఆర్జన(ఈపీఎస్) అంచనాలు 7 శాతం తగ్గవచ్చని భావిస్తున్నాం. ఇదేవిధంగా వచ్చే ఏడాది(2024–25)లో ఈపీఎస్ 4 శాతం నీరసించే వీలుంది. గంధిమతి బ్రేక్‌ఈవెన్ ఆలస్యం కావడం, వ్యయాలు కొనసాగడం మార్జిన్లపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముంది. అయితే డిమాండ్ పరిస్థితులు మెరుగుపడితే కంపెనీకున్న బ్రాండ్ విలువ లబ్ధిని చేకూర్చగలదు. పరిశ్రమలోనే అత్యధిక నిర్వహణ లాభ మార్జిన్లు సాధించే కంపెనీకి బటర్‌ఫ్లై కొనుగోలు అదనపు బలాన్నివ్వనుంది. ఈపీఎస్ మెరుగుపడే వీలుంది. వెరసి 2023–26 కాలంలో ఆర్జన 17 శాతం చొప్పున వృద్ధి నమోదుకాగలదని అంచనా వేస్తున్నాం. సగటున ఆర్‌వోఈ 30 శాతం, ఆర్‌వోసీఈ 28 శాతానికి చేరే వీలుంది.

సన్ టీవీ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 587 టార్గెట్: రూ. 750



ఎందుకంటే: ఈ ఏడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో మీడియా దిగ్గజం సన్ టీవీ నెట్‌వర్క్ లిమిటెడ్ నిర్వహణ లాభం(ఇబిటా) వార్షిక ప్రాతిపదికన పెద్దగా వృద్ధిలేకుండా రూ. 570 కోట్లుగా నమోదైంది. ఇది అంచనాలకు అనుగుణంగానే ఉన్నప్పటికీ మార్జిన్లు 2% క్షీణించాయి. ఇందుకు ఆదాయం నెమ్మదించడంతోపాటు.. అధిక నిర్వహణ వ్యయాలు కారణమయ్యాయి. అయితే ఆదాయం వార్షికంగా అంచనాలకు తగ్గట్లుగా 3.3 శాతం బలపడి రూ. 890 కోట్లను తాకింది. క్రికెట్ వరల్డ్ కప్ నేపథ్యంలో ప్రకటనల ఆదాయం నీరసించడం టర్నోవర్‌పై ప్రభావం చూపింది. కొంతకాలంగా ప్రకటనల ఆదాయంలో మందగమనం కొనసాగడంతో టర్నోవర్‌సైతం ప్రభావితమవుతోంది. ప్రకటనల వ్యయాలు పుంజుకోవడం.. ప్రధానంగా ఎఫ్‌ఎంసీజీ విభాగం నుంచి రికవరీ కనిపించడం కంపెనీకి కొంతమేర ప్రోత్సాహాన్నివ్వనుంది. ఓటీటీ విభాగంలో పెట్టుబడుల విషయంలో కంపెనీ ఆచితూచి వ్యవహరించడం, సినిమాల నిర్మాణానికే ప్రాధాన్యత ఇవ్వడం, కంపెనీకిగల ప్రస్తుత లైబ్రరీని ఆదాయ వనరుగా(మానిటైజింగ్) మార్చుకోవడం వంటి అంశాల నేపథ్యంలో వేగంగా విస్తరిస్తున్న ఓటీటీ విభాగంతో రిస్కులు తలెత్తే అవకాశముంది. అయితే కంపెనీకిగల పటిష్ట లిక్విడిటీ పరిస్థితులు, 2023 మార్చికల్లా కంపెనీ చేతిలోగల రూ. 490 కోట్ల నగదు నిల్వలు.. అత్యధిక సంస్థలతో, అత్యంత పోటీగల ఓటీటీ విభాగంలో తగినన్ని పెట్టుబడులు చేపట్టేందుకు దన్నుగా నిలవనున్నాయి. అధిక డివిడెండ్ చెల్లింపులు, సహేతుక విలువ.. కంపెనీ షేరుకి మద్దతిస్తున్నాయి. 2023–25లో ఆదాయం, లాభాల్లో 8% వృద్ధి అంచనా వేస్తున్నాం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

పెళ్లి కోసం పెట్టుబడి ఎక్కడ?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా సోదరి వివాహం కోసం ప్రతి నెలా రూ.45,000 చొప్పున ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ లేదా డెట్ మ్యూచువల్ ఫండ్స్ లేదా సార్వభౌమ బంగారం బాండ్లలో ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి? – జ్యోతి

మన దేశంలో వివాహాలు సాధారణంగా చూస్తే తక్కువ ఖర్చుతో ముగిసేవి కావు. మీరు అనుకుంటున్నట్టు ప్రతి నెలా రూ.45,000 చొప్పున వచ్చే ఆరేళ్ల పాటు ఇన్వెస్ట్ చేసినట్టయితే గణనీయమైన మొత్తమే సమకూరుతుంది. వివాహం లక్ష్యం విషయంలో రాజీపడలేం. అనుకున్న సమయానికి కావాల్సినంత చేతికి అందాల్సిందే. వాయిదా వేయడానికి ఉండదు. తక్కువ రిస్క్ కోరుకునే వారు మధ్యే మార్గాన్ని అనుసరించాలి. 50 శాతాన్ని డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీని వల్ల పెట్టుబడికి రిస్క్ ఉండదు. మిగిలిన 50 శాతాన్ని వృద్ధి కోసం ఈక్విటీలకు కేటాయించుకోవాలి. డెట్ విషయంలో షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ లేదా టార్గెట్ మెచ్యూరిటీ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఈక్విటీ పెట్టుబడులకు లార్జ్‌క్యాప్ ఫండ్స్ లేదా లో కాస్ట్ ఇండెక్స్ ఫండ్స్ నుంచి ఎంపిక చేసుకోవాలి. ఒకవేళ అధిక రిస్క్ తీసుకునే సామర్థ్యం ఉంటే.. అప్పుడు కాస్త దూకుడుగా పెట్టుబడుల సాధనాలను ఎంపిక చేసుకోవచ్చు. ఆటుపోట్లను తట్టుకునేట్టు అయితే ఈక్విటీలకు 65 శాతం నుంచి 80 శాతాన్ని కేటాయించుకోవచ్చు. మిగిలిన మొత్తాన్ని డెట్ సాధనాలకు కేటాయించుకోవాలి. బంగారం కోసమే అయితే సార్వభౌమ బంగారం బాండ్లలో (ఎస్‌జీబీలు) కొంత మొత్తాన్ని ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. బంగారం విలువ పెరుగుదలకు తోడు, పెట్టుబడి విలువపై ఏటా 2.5 శాతం వడ్డీ రేటు లభిస్తుంది. ఈ బంగారంతో సోదరి పెళ్లి కోసం కావాల్సిన ఆభరణాలు చేయించొచ్చు.

డెట్ ఫండ్స్‌లో పెట్టుబడులకు అనుకూల సమయం అంటూ ఉంటుందా? – వికాస్ రాజ్

డెట్ ఫండ్స్ పథకాల్లో పెట్టుబడులు పెట్టుకునేందుకు సరైన సమయం అంటూ ఏదీ ఉండదు. డెట్ ఫండ్స్‌లో మీ పెట్టుబడుల కాల వ్యవధికి అనుకూలమైన పథకాన్ని ఎంపిక చేసుకోవడం కీలకమవుతుంది. చాలా మంది ఇన్వెస్టర్లు దీర్ఘకాలం కోసం డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. మీరు ఎంపిక చేసుకునే పథకం భద్రత ఎక్కువగా ఉండే సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసేలా ఉండాలి. ఈక్విటీ మార్కెట్లు పడినప్పుడు కొనుగోలు చేసే మాదిరి అని అన్నారు. కానీ, అదేమంత సులభం కాదు. ఎందుకంటే ఈక్విటీ మార్కెట్లు పడిపోతున్నప్పుడు దిద్దుబాటు చివరికి వచ్చిందా.. ఇంకా కరెక్షన్ మిగిలి ఉందా అన్నది ఎవరికీ తెలియదు. అందుకని ఇన్వెస్టర్లు క్రమశిక్షణతో కూడిన విధానాన్ని ఆచరించాలని చెబుతుంటాను. మీరు ప్రతి నెలా నిర్ణీత మొత్తం ఇన్వెస్ట్ చేస్తున్నట్లయితే కొంత మొత్తాన్ని మార్కెట్లు పడినప్పుడు పెట్టే విధంగా లక్ష్యాన్ని నిర్దేశించుకోవచ్చు. కనిష్ట స్థాయిల్లో పెట్టుబడి పెట్టాలన్న దానిపై దృష్టి పెట్టడం వల్ల మంచిగా పెరిగే వాటిల్లో పెట్టుబడుల అవకాశాలను కోల్పోవాల్సి వస్తుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-3-2024	
విశాఖ	415–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400–00
విజయవాడ	400–00
రిటైల్ ధర (డజను)	72.00
24-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	395–00
వరంగల్	397–00
రిటైల్ ధర	4.25

క్లుప్తంగా...

ఆన్‌లైన్‌లో రామయ్య కల్యాణం టికెట్లు

భద్రాద్రి వెబ్‌సైట్ ద్వారా నేటి నుంచి బుకింగ్

భద్రాచలం టౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 17న జరగనున్న రామయ్య కల్యాణం (శ్రీరామనవమి), 18న స్వామివారి మహా పట్టాభిషేకం కార్యక్రమాలకు సెక్టార్ టికెట్లను ఆన్‌లైన్ ద్వారా భక్తులు పొందే అవకాశం కల్పించినట్లు ఈవో రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణ మహోత్సవానికి రూ.7,500 (దంపతులు), రూ.2,500, రూ.2 వేలు, రూ.1000, రూ.300, రూ.150, పట్టాభిషేకం టికెట్లు రూ.1,500, రూ.500, రూ.100గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రామయ్య కల్యాణానికి రాలేని భక్తుల గోత్ర నామాలతో కల్యాణం జరిపించేలా పరోక్ష సేవలు సైతం అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇందు కోసం రూ.5 వేలు, రూ.1,116 టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. భక్తులు భద్రాద్రి దేవస్థానం వెబ్‌సైట్ https://bhadradritemple.telangana.gov.in ద్వారా సోమవారం నుంచి బుక్ చేసుకోవచ్చని వివరించారు. దేవస్థానంలో నేరుగా టికెట్లు పొందాలనే భక్తులకు ఆలయం వద్ద, తానీషా కల్యాణ మండపం, బ్రిడ్జి పాయింట్ సీఆర్‌వో కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. భక్తులు గుర్తింపు కార్డు సిబ్బందికి చూపించి టికెట్లు పొందవచ్చని ఈవో సూచించారు.

కాపులకు వైఎస్సార్‌సీపీ సీట్ల కేటాయింపు చరిత్రాత్మకం



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలోని కాపు సామాజిక వర్గానికి సీట్ల కేటాయింపులో వైఎస్సార్‌సీపీ అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం చారిత్రక అంశంగా జాతీయ కాపు సమాఖ్య అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి పేర్కొన్నారు. గతంలో ఏ రాజకీయ పార్టీ ఇంత పెద్ద సంఖ్యలో కాపులకు సీట్లు కేటాయించిన దాఖలాలు లేవన్నారు. అసెంబ్లీకి సంబంధించి 30 సీట్లు కేటాయించడం అపూర్వమని, లోక్‌సభకు ఐదు సీట్లు కేటాయించడం అద్భుతమన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో కాపులను గుర్తించి చట్టసభలకు పంపేందుకు సీఎం వైఎస్ జగన్ చొరవ చూపడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, నాయకులు మాటలకు మాత్రమే పరిమితమై కాపులను వాడుకుంటున్నారన్నారు. కానీ సీఎం జగన్ మాత్రం కాపులను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసే దిశగా చర్యలు చేపట్టడం కాపు జాతి తప్పనిసరిగా గుర్తుంచుకుని, వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సి బాధ్యత ఉందని స్పష్టం చేశారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

తెలంగాణ

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా జేగురుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హోడి తూమ్నార్ - గొండపల్లి గ్రామాల అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఆదివారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో భద్రతా బలగాలు గాలిస్తుండగా తారసపడిన మావోయిస్టులు పోలీసులపైకి కాల్పులు జరిపారు. పోలీసులు సైతం ఎదురుకాల్పులు ప్రారంభించారు. అనంతరం ఘటనా స్థలంలో ఓ మావోయిస్టు మృతదేహంతో పాటు తుపాకీ, సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడిని బీజాపూర్ జిల్లా గంగలూర్ ఏరియా కమిటీ సభ్యుడు అవలం పాడియగా పోలీసులు గుర్తించారు.

మొసలి ఎముకలైనా.. 30 సెకన్లలో మటాష్!



ప్రమాదకరమైన చేపలు అనగానే.. షార్క్‌లు, పిరానాలు గుర్తుకురావడం కామనే. కానీ వాటికన్నా ప్రమాదకరమైన ఓ చేప గురించి తెలుసా? పెద్ద పెద్ద కోరల్లాంటి పదునైన పళ్లతో, దొరికితే చాలు చీల్చిపడేసే ఆ చేపలు 'టైగర్ ఫిష్'లు. ఆఫ్రికా ఖండంలోని సరస్సులు, నదుల్లో కనిపించే ఈ చేపలు టార్గెట్ చేశాయంటే.. ఎంత పెద్ద చేప అయినా నిమిషాల్లో మటాష్ అవ్వాల్సిందే. ఈ చేపలు మరీ క్రూరంగా, దూకుడుగా వ్యవహరిస్తాయి. కేవలం 30 సెకన్లలో మొసళ్ల ఎముకలను కూడా కొరికి పడేయగలవు. చూడటానికి కూడా కాస్త భయం గొలిపేలా ఉన్న ఈ చేపలు.. మందలు మందలుగా వేటాడుతాయి.

నీటి కోసం వచ్చే పక్షులను పట్టేసి..

ప్రపంచంలో అత్యంత క్రూర ప్రవృత్తి ఉన్న చేపలుగా టైగర్ ఫిష్‌లకు పేరుంది. అడుగు నుంచి మూడు అడుగుల వరకు ఉండే ఈ చేపలు సరస్సులు, నదుల్లో ఉపరితలానికి కాస్త కింద మాటు వేస్తాయి. నీళ్లు తాగడానికి వచ్చే పక్షులు, చిన్నపాటి జంతువులను చటుక్కున పట్టేసి కొరికి తినేస్తాయి.

పిడుగెప్పుడు పడుతుంది?



చెప్పడం కష్టం కదా.. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మాత్రం మరీ అంత కష్టం కాదని చెబుతోంది. మీ తల వెనకాల, మెడకు పైభాగంలో వెంట్రుకలు కాస్త నిక్కబొడిచినట్లు పైకి లేచినట్టు అయిదంటే.. మీకు అతి దగ్గరలో పిడుగు పడే అవకాశం చాన్స్ ఉందని అర్థమట. అలాగే వాన రాకడ.. ప్రాణం పోకడ కూడా ఎవరికీ తెలియదనేది సామెత. అయితే ఉరుములు మెరుపులతో జడి వాన కురిసే పరిస్థితిని కొన్ని అంశాలతో ముందే గుర్తించవచ్చని ఐఎండీ పేర్కొంది. ఈ మేరకు 'ఎక్స్'లో సూచనలు చేసింది. ఈ సమయంలో ఆకాశంలో బాగా ఎత్తుగా కాలీఫ్లవర్ వంటి ఆకృతిలోని దట్టమైన నల్లటి మేఘాలు.. అలాగే నిలువుగా మేఘాలు కమ్ముకుంటాయట. అప్పటికప్పుడు చల్లటి గాలి వీయడం మొదలవుతుందని ఐఎండీ తెలిపింది.

ఇన్ ఫ్రంట్ క్రొకడైల్ ఫెస్టివల్ కాకపోతే మొసలికి...



నీ ఇంటికొచ్చా.. నీ నట్టింటికొచ్చా టైపులో ఈ జాగ్వార్ ఏకంగా మొసలి సామ్రాజ్యంలోకి అడుగుపెట్టి మరీ దాని పని పట్టింది. మడుగులోకి దిగి.. మొసలిని తన పళ్లతో పట్టుకుని ఇచ్చిన ఆ లుక్ చూడండి. ఈ చిత్రం సోనీ వరల్డ్ ఫొటోగ్రఫీ అవార్డ్-2024లో నాచురల్ వరల్డ్ అండ్ వైల్డ్ లైఫ్ విభాగంలో విజేతగా నిలిచింది. బ్రెజిల్‌లోని పంటనల్ ప్రాంతంలో ఇయాన్ ఫోర్డ్ అనే ఫొటోగ్రాఫర్ క్లిక్‌మనిపించారు.

అరకు అందాలకు 'అమెరికా' ఫిదా

- తూర్పు కనుమల్లో పర్యటించిన అమెరికా రాయబారి
- విశాఖ తీరంలో రెండు వారాలపాటు భారత్–అమెరికా సైనిక విన్యాసాలు
- ఈ నెల 18 నుంచి కొనసాగుతోన్న త్రివిధ దళాల విన్యాసాలు



అరకు అందాలను తన సెల్ ఫోన్‌లో బంధిస్తున్న అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి

మహారాణిపేట(విశాఖ దక్షిణ): తూర్పు కనుమల్లో అమెరికా రాయబార ప్రతినిధులు ఎరిక్ గార్సెట్టి తదితరులు ఆదివారం పర్యటించారు. విశాఖలోని కైలాసగిరి, ఆర్కే బీచ్‌తోపాటు అరకు పరిసరాల్లోని పచ్చదనం, ప్రకృతి ఒడిలో అక్కడి ప్రజల జీవన విధానం చూసి ముగ్ధులైయ్యారు. విశాఖ నుంచి అరకు వెళ్లే మార్గంలో చిలకల గెడ్డ వద్ద ప్రకృతి అందాలతో పాటు పచ్చదనం లోయల్లో నీటి ప్రవాహాన్ని చూసి పరవశించిపోయారు. విశాఖ పరిసరాలు పర్యావరణానికి దగ్గరగా ఆరోగ్యకరమైన జీవనానికి చేరువగా ఉన్నట్టు యూఎస్ కాన్సులేట్ ప్రతినిధులు పేర్కొన్నారు. కాగా, భారత్–అమెరికా సైనిక సంబంధాలు, సంయుక్త విన్యాసాల ప్రదర్శనలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి విశాఖ తీరంలో త్రివిధ దళాల సంయుక్త కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా భారత్ స్వయం సమృద్ధిగా రూపొందించిన ఐఎన్ఎస్ జలస్వ నౌకతోపాటు అమెరికాకు చెందిన యుద్ధ నౌకలపై త్రివిధ దళ సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించారు. దీనిలో భాగంగా ఇప్పటికే విశాఖ చేరుకున్న బాహుబలి నౌక యూఎస్ కాన్సులేట్ భారత–అమెరికా సైనిక సిబ్బంది వివిధ అంశాలపై అవగాహన పొందారు. ప్రపంచంలోనే అతిపెద్ద యుద్ధనౌకగా గుర్తింపు పొందిన సోమర్ సెట్‌లో 25 యుద్ధ ట్యాంకులు, నాలుగు హెలికాప్టర్లు, అన్నివైపులా ఆయుధ ట్యాంకులు, 1000 మంది సిబ్బంది ఈ నౌకలో ఉండడం విశేషం. 2001 సెప్టెంబర్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్ర దాడుల స్మారకంగా నిర్మించిన ఈ యుద్ధనౌకను విపత్తుల సమయంలో రక్షణ దళాలకు ఆస్పత్రిగా సేవలు అందిస్తుంది. టైగర్ ట్రయాంఫ్ పేరిట ఈ నెల 31వ తేదీ వరకు సముద్రంపై విన్యాసాలు కూడా రెండు దేశాల త్రివిధ దళాలు చేయనున్నాయి.

ఉచిత విద్యకు దరఖాస్తు గడువు పెంపు

- ఈ నెల 31 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- ఇప్పటివరకు 49,208 దరఖాస్తులు.. 38,150 మంది పాఠశాలల ఎంపిక



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి (2024–25) విద్యాహక్కు చట్టం కింద దరఖాస్తు గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. నిజానికి ఈ గడువు సోమవారంతో ముగుస్తుండగా, విద్యాశాఖాధికారులు మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ప్రతికూల పరిస్థితుల్లోని పిల్లలైన అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల పిల్లలకు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు కల్పించాలి. వీరికి విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూళ్లల్లో 25 శాతం సీట్లు కేటాయించాలి. దీనిప్రకారం ఇప్పటివరకు 49,208 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 38,150 మంది పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు. విద్యార్థుల నివాసాలకు సమీపంలో ఉన్న ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్‌ను బోధిస్తున్న స్కూళ్లలోను పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని సమగ్రశిక్ష ఎస్పీడీ బి. శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థుల తల్లిదండ్రులు తమ నివాసాలకు సమీపంలోని సచివాలయం లేదా ఇంటర్నెట్, ఎంఈవో కార్యాలయం, మీ–సేవా కేంద్రాల్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళల్లో సమగ్రశిక్షా పాఠశాల విద్యాశాఖ (టోల్ ఫ్రీ) 18004258599 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు. అర్హతగల పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని శ్రీనివాసరావు సూచించారు.

ఆధార్ నంబర్‌తో రిజిస్ట్రేషన్..

ఇక ఆసక్తిగల పిల్లల తల్లిదండ్రులు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో విద్యార్థి పేరు, ఇతర వివరాలు నమోదుచేసి ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. పిల్లల ఆధార్ నంబర్, లేదా తల్లిదండ్రుల ఆధార్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం ఆన్‌లైన్‌లో కనిపించే స్కూళ్లలో నచ్చిన వాటిని ఎంపిక చేసుకోవాలి. వచ్చిన దరఖాస్తులకు ఆన్‌లైన్ లాటరీ ద్వారా స్కూళ్లను కేటాయిస్తారు. http://cse.ap.gov.in/RTE వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

కుల బంధంతోనే బాబుకు జేపీ భజన

▶ మొదటి పేజీ తరువాయి

ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. మేధావి ముసుగు వేసుకున్న జేపీని ప్రజలు నమ్మొద్దు. తన కులానికి చెందిన వ్యక్తి కాబట్టి చంద్రబాబుకు జేపీ మద్దతిస్తున్నారు. అవినీతి చక్రవర్తి చంద్రబాబు పాలనలో టీడీపీ అందినకాడికి దోచుకుతింది. మళ్లీ చంద్రబాబుకు అధికారమిస్తే రాష్ట్రాన్ని పాతాళానికి తొక్కేస్తారు. బాబు మోసాలను గమనించే గత ఎన్నికల్లో ప్రజలు చావుదెబ్బ కొట్టారు. ఇప్పుడు సంక్షేమంతో పాటు అభివృద్ధిలోనూ ఆంధ్రప్రదేశ్ ముందుకెళ్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా జేపీ వ్యాఖ్యానించడం సిగ్గుచేటు.

ఏది విజనరీ జేపీ?

చంద్రబాబు దొంగైనా, వెన్నుపోటుదారుడైనా అందులోనూ జేపీకి విజన్ కనిపించడం గొప్ప విషయం. 2014–19లో టీడీపీ, జనసేన, బీజేపీ మూడూ కలిసి పొత్తులతో అధికారంలోకి వచ్చాయి. చంద్రబాబు 600 హామీలు ఇచ్చి.. ఐదేళ్లలో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్న విషయం జేపీకి తెలిసి కూడా మరోసారి కూటమికి వంతపాడటం దారుణం. ప్రజలంతా దీన్ని గమనించారు కాబట్టే 2019 ఎన్నికల్లో 151 సీట్లు జగన్‌కు ఇచ్చి.. 23 సీట్లకు టీడీపీని తొక్కేశారు. చంద్రబాబులో విజన్ ఉంటే ప్రజలెందుకు ఓడిస్తారు? ప్రధానిని నోటి కొచ్చినట్లు మాట్లాడి.. ఇప్పుడు కీర్తించే వ్యక్తి మీ దృష్టిలో విజనరీ. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడవటం.. సొంత మామను చెప్పుతో కొట్టి కుర్చీ నుంచి కిందకి నెట్టేయడం.. రామారావు చనిపోతుంటే చంద్రబాబు సీఎం సీటులో పైశాచికానందం పొందడం.. హరికృష్ణ, దగ్గుబాటి వెంకటేశ్వరావును వాడుకుని వదిలేడం.. ఇవన్నీ విజనరీనే. మీరు చెప్పిన విజనరీ అధికారం వచ్చిన ప్రతిసారీ ప్రజలను పట్టి పీడించాడు. ఇవన్నీ తెలిసినా.. అనర్హుడైనప్పటికీ సొంత కులం వ్యక్తిని సీఎం సీటులో కూర్చోపెట్టడానికి దిగజారొద్దు జేపీ.

అందరినీ నీచంగా తిట్టిన వ్యక్తి బాబు..

2014–19 వరకు చంద్రబాబు అండ్ కో పందికొక్కులా ప్రజాధనాన్ని మింగేసిన పాపాలు ఇప్పట్లో పోవు. ఎస్సీ, ఎస్టీ, బీసీ.. ఇలా ఒకటేమిటి మనిషన్న ప్రతి ఒక్కరినీ నీచంగా తిట్టిన వ్యక్తి చంద్రబాబు. ఇక వంగవీటి రంగాను అన్యాయంగా చంపించిన వ్యక్తితో కాపులు వెళ్లొద్దు. సీఎం జగన్ బటన్‌నొక్కితే పేదల ఖాతాల్లో డబ్బులు పడతాయి. అదే చంద్రబాబు బటన్ నొక్కితే సామాన్యుల ప్రాణాలు బలైపోతాయి. దేశంలోనే బెస్ట్ సీఎం అయిన జగన్ పేదల కోసం నిలబడ్డారు. ఏపీ ప్రజలు చంద్రబాబు వంటి దుర్మార్గుడికి ఓటు వేయొద్దు.

కార్మికుల పక్షపాతి సీఎం జగన్

- వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి



సాక్షి, అమరావతి: పాదయాత్రలో కార్మికుల సమస్యలు తెలుసుకుని అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరించి కార్మికుల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్ నిలిచిపోయారని వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతమ్ రెడ్డి కొనియాడారు. రానున్న ఎన్నికల్లో కార్మికులంతా సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌టీయూసీ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు 2018 నాటికి కార్మికులకు ఇవ్వాల్సిన రూ.3,490 కోట్లను ఎగ్గొట్టారని, కార్మికులకు అన్నివిధాలా వెన్నుదన్నుగా నిలుస్తున్న సీఎం జగన్‌ను మారోమారు సీఎం చేద్దామని పిలుపునిచ్చారు. సీఎం జగన్ అమలు చేసిన అభివృద్ధి–సంక్షేమ కార్యక్రమాలను తన పాలనలో చంద్రబాబు ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. ఈ వర్గం ప్రజలకు ఫలానా మేలు చేశాను.. అని చెప్పుకొనేందుకు చంద్రబాబు వద్ద ఒక్క పథకం కూడా లేదని ఎద్దేవా చేశారు. అధికారం కోసం ఎన్ని కుట్రలు చేయడానికైనా చంద్రబాబు వెనుకాడరని, కార్మికులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. విశాఖ డ్రగ్స్ కంటైనర్ చంద్రబాబు బంధువులదేనని, ఈ కేసులో దొంగే.. దొంగ దొంగ.. అన్నట్టుగా చంద్రబాబు అండ్ కో అరుపులు ఉన్నాయన్నారు. చంద్రబాబు అవినీతిపరుడే కాదని, ఈ ఘటనతో నేరగాడయ్యారని ఆరోపించారు. పురందేశ్వరి కుమారుడు కూడా ఆ కంపెనీలో భాగస్వామేనన్నారు. మీడియాను అడ్డుపెట్టుకుని అసత్యాలను ప్రచారం చేయడంలో చంద్రబాబు దిట్టని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీని అన్ని తిట్లూ తిట్టి.. తిరిగి ఆయనతోనే పొత్తు పెట్టుకోవడం చంద్రబాబుకే సాధ్యమన్నారు. సంతకాలు ఫోర్జరీ చేసి.. బోగస్ సబ్ కాంట్రాక్టుతో రూ.450 కోట్లు స్వాహా చేసిన వ్యక్తి సీఎం రమేష్.. చంద్రబాబుకు కుడి భుజమన్న విషయం అందరికీ తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ న్యాయ విభాగం అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర నేతలు నారాయణమూర్తి, బద్రీనాథ్, అజయ్‌రాజారెడ్డి, ప్రదీప్ పాల్గొన్నారు.

మాదిగ ద్రోహి చంద్రబాబుకు మద్దతు ఎలా పలుకుతావ్ ?

- మాదిగల్ని చంద్రబాబు దగ్గర గంపగుత్తగా విక్రయించే హక్కు నీకెవరిచ్చారు
- మంద కృష్ణపై మాదిగ సంఘాల ఫైర్



సాక్షి, అమరావతి: 'మాదిగల్ని ఎన్నిసార్లు తాకట్టు పెడతావ్. చంద్రబాబు లాంటి మాదిగ ద్రోహికి మద్దతు పలకడానికి నీకు బుద్ధిలేదా. అసలు ఎన్నికలప్పుడే మాదిగల సమస్యలు నీకు గుర్తుకొస్తాయా. ఇందుకు నీకు అందుతున్న ప్యాకేజీ ఏమిటి' అంటూ మాదిగ సంఘాలు వేర్వేరు ప్రకటనల్లో విరుచుకుపడ్డాయి. ఆదివారం చంద్రబాబును కలిసిన మంద కృష్ణ మాదిగ మరోసారి టీడీపీ కూటమికి మాదిగలు ఓట్లు వేసి గెలిపిస్తారని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. నవ్యాంధ్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు విడుదల చేసిన ప్రకటనలో 'మాదిగల్ని చంద్రబాబుకు గంపగుత్తగా విక్రయించే హక్కు నీకు ఎవరిచ్చారు. అసలు ఆంధ్రప్రదేశ్‌కు నీకు ఏమిటి సంబంధం. ఇక్కడ మాదిగల తరఫున ఎలా వకాల్తా పుచ్చుకుంటావ్. ఎస్సీలలో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా.. ఎస్సీలంటేనే తనకు అసహ్యం అని చెప్పిన చంద్రబాబుకు మద్దతు పలకడం అంటే ఎస్సీల ఆత్మగౌరవాన్ని అతని కాళ్ల దగ్గర పెట్టినట్టే కదా' అని మండిపడ్డారు. చంద్రబాబుకు ఇచ్చిన మద్దతును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రంలోని ప్రతి మాదిగ మంద కృష్ణను వెంటపడి తరిమికొడతారని హెచ్చరించారు.

బాబుకు ఓటేయమని చెప్పడానికి సిగ్గుండాలి

'ఏపీలో పెద్ద మాదిగ నేతనంటూ మాదిగలను నమ్మించి మోసం చేయడమే కాకుండా.. 2014–19 కాలంలో రాష్ట్ర పర్యటనలో నిన్ను అరెస్ట్ చేసిందుకు చంద్రబాబుకు మద్దతు ఇవ్వాలా' అని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ప్రశ్నించారు. 'సీఎంగా చంద్రబాబు ఉన్న కాలంలో మాదిగలు, మాదిగ ఉపకులాలను తీవ్రంగా అణచివేసి వందలాది మాదిగ విద్యార్థులు, మాదిగ యువతపై కేసులు పెట్టించిన బాబుకు ఓటు వేయమని చెప్పడానికి నీకు కొంచెమైనా సిగ్గు ఉండాలి. మరోసారి సంతలో పశువులను అమ్మినట్టు మాదిగలను కృష్ణమాదిగ చంద్రబాబుకు గంపగుత్తగా అమ్మకానికి పెడితే రాష్ట్రంలోని మాదిగలు, ఉప కులాల వారందరూ తిరగబడతారు' అని హెచ్చరించారు.



విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఏలూరు పార్లమెంటు బీజేపీ నాయకులు

ఎల్లో కల్లోలం

▶ మొదటి పేజీ తరువాయి

జనసేన, బీజేపీకి కేటాయించిన 31 స్థానాల్లోనూ అనేక చోట్ల టీడీపీ నేతలు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

అభ్యర్థులను ఓడిస్తాం.. మా సత్తా చూపిస్తాం..

టికెట్లు దక్కించుకున్నవారిని ఓడించి తమ సత్తా చూపిస్తామని పలువురు నేతలు బాహాటంగానే సవాల్ విసురుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండిలో మాజీ ఎమ్మెల్యే శివరామరాజు, ఏలూరు జిల్లా నూజివీడులో ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఇండిపెండెంట్‌గా ప్రచారం ప్రారంభించగా... విజయనగరం జిల్లా గజపతినగరంలో కె.అప్పలనాయుడు, విజయనగరంలో మీసాల గీత, కురుపాంలో వైరిచర్ల వీరేశ్‌దేవ్, శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో కలమట వెంకటరమణ, తునిలో సీనియర్ నేత యనమల రామకృష్ణుడి సోదరుడు కృష్ణుడు తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. చింతలపూడి, తిరువూరు, పెడన, పామర్రు, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో అధికారికంగా ప్రకటించిన అభ్యర్థులకు పూర్తి స్థాయి మద్దతు దొరకడంలేదు. కొవ్వూరు సీటు తనకు కేటాయించకపోవడంతో మాజీ మంత్రి కె.ఎస్.జవహర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వ్యతిరేకంగా పని చేసేందుకు సిద్ధమవుతున్నారు. గోపాలపురం సీటును మద్దిపాటి రాజుకు ఇవ్వడాన్ని అంగీకరించని అక్కడి పార్టీ సీనియర్ నేతలు ముళ్లపాటి బాపిరాజు తదితరులు తమను కాదని టీడీపీ ఎలా గెలుస్తుందో చూస్తామని హెచ్చరిస్తున్నారు. దెందులూరు సీటును చింతమనేని ప్రభాకర్‌కు ఇవ్వడం చలుమోలు అశోక్‌గౌడ్, ఈడ్పుగంటి నాగేశ్వరరావు, మాగంటి రవళితోపాటు అక్కడి పార్టీ సీనియర్ నేతలకు సుతరామూ ఇష్టం లేదు. వారంతా చింతమనేనికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు.

అభ్యర్థులకు గడ్డు పరిస్థితి

నెల్లూరు జిల్లా ఉదయగిరి స్థానాన్ని ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్‌కి ఇవ్వడాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, ఆత్మకూరు సీటును ఫిరాయింపు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి ఇవ్వడాన్ని కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కావలి సీటును బడా కాంట్రాక్టర్ కావ్య కృష్ణారెడ్డికి దక్కడాన్ని మాలేపాటి సుబ్బానాయుడు, బీద రవిచంద్ర వ్యతిరేకిస్తున్నారు. ఈ నియోజకవర్గాల్లో అభ్యర్థులకు వ్యతిరేకంగా అసమ్మతి గట్టిగా పనిచేస్తోంది. శ్రీకాళహస్తిలో ఎస్.సి.వి.నాయుడు, సత్యవేడులో జె.డి.రాజశేఖర్ తమను చంద్రబాబు మోసం చేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం జిల్లా కల్యాణదుర్గం సీటును అక్కడి పార్టీ సీనియర్ నాయకులు ఉమామహేశ్వరనాయుడు, ఉన్నం హనుమంతరాయచౌదరికి కాకుండా కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబుకు ఇవ్వడంతో పార్టీ క్యాడర్ అంతా భగ్గుమంటోంది. కదిరిలో అత్తార్ చాంద్‌బాషా తనకు సీటు ఇవ్వలేదని తన అనుచరులతో చంద్రబాబు ఇంటి వద్దే ఆందోళన చేయించారు. చివరికి బాలకృష్ణకూ అసమ్మతి తప్పలేదు. కర్నూలు జిల్లా మంత్రాలయంలో తిక్కారెడ్డి, నంద్యాలలో భూమా బ్రహ్మానందరెడ్డి, డోన్‌లో ధర్మవరం సుబ్బారెడ్డి, వైఎస్సార్ జిల్లా రాయచోటిలో రమేష్‌కుమార్‌రెడ్డి అలుక వీడటం లేదు. తంబళ్లపల్లె, అమలాపురం, గుంటూరు వెస్ట్, కోవూరు, ప్రొద్దుటూరు, పుట్టపర్తి నియోజకవర్గాల్లోనూ అసమ్మతి బెడద ఎక్కువగానే ఉంది.



నల్లజర్లలో మద్దిపాటికి వ్యతిరేకంగా ప్లకార్డులను చూపి, నిరసన తెలుపుతున్న నియోజకవర్గ టీడీపీ నేతలు

శ్రీకాకుళం ఆగని ఆందోళనలు

శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో టికెట్ రాని టీడీపీ నాయకులు అధిష్టానంపై దుమ్మెత్తిపోతున్నారు. శ్రీకాకుళంలో సమావేశం నిర్వహించిన గుండ లక్ష్మీదేవి, అప్పల సూర్యనారాయణ దంపతులు అచ్చెన్నకు తమపై ఎందుకంత కక్ష అని సూటిగా ప్రశ్నించారు. అధిష్టానం తీరు మారకుంటే స్వతంత్రంగా పోటీ చేస్తామని చెప్పారు. అలాగే కొత్తూరు మండలం నివగాం వద్ద అనుచరులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ రాష్ట్ర, జిల్లా పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు, కూన రవికుమార్‌లపై పరోక్షంగా విమర్శలు చేశారు. సైట్లు ఇస్తామని చెప్పి కొన్ని వేలమంది నుంచి డబ్బులు తీసుకుని మోసం చేసిన ఒక 420 అయిన మామిడి గోవిందరావుకు ఎమ్మెల్యేగా గెలిపించమంటే ఒప్పుకునేది లేదన్నారు.

మద్దిపాటిపై సీనియర్ల మండిపాటు

తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం స్థానాన్ని గ్రాఫ్ పడిపోయిన మద్దిపాటికి కేటాయించడంపై అక్కడి సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నల్లజర్లలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నాలుగు రోజుల క్రితం నియోజకవర్గంలోని అసమ్మతి నాయకులు సమావేశమై మద్దిపాటి తప్ప వేరెవ్వరైనా తమకు ఓకే అని తేల్చిచెప్పారు. గ్రాఫ్ పడిపోయిన వ్యక్తిని గెలిపించమంటే తమ వల్ల కాదని వారు చేతులెత్తేశారు. ఇక్కడ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తానేటి వనితను ప్రకటించారనీ, ఆమెను ఢీకొనాలంటే గట్టి క్యాండిడేట్ అవసరమని తెలిపారు. దీనిపై పునరాలోచన చేయాలని కోరారు. ఇదే సందర్భంలో మద్దిపాటి వెంకట్రాజు నాలుగు రోజులుగా చేపట్టిన పాదయాత్రకు ఒక వర్గం నాయకులు, కార్యకర్తలు దూరంగానే ఉన్నారు.

ఏలూరు ఎంపీ సీటుపై వెనక్కి తగ్గని బీజేపీ

ఏలూరు పార్లమెంటు సీటు స్థానిక నేత గారపాటి చౌదరికే ఇవ్వాలని జిల్లా బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి ఆదివారం చేరుకుని ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. కడప నాయకుడికి అక్కడ సీటు కేటాయించడం సరికాదని వారు పట్టుపడుతున్నారు. రాష్ట్ర కార్యాలయానికి వెళ్లిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు బి.నిర్మలా కిశోర్, ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కె.కృష్ణప్రసాద్, వివిధ అసెంబ్లీ కన్వీనర్లు శరణాల మాలతీరాణి, నడపన దాన భాస్కరరావు, నగరపాటి సత్యనారాయణ, గుమ్మడి చైతన్య, యేసు వరప్రసాద్, గాది రాంబాబు, రామకృష్ణ తదితరులున్నారు.

దేవినేని ఉమాపైనా పెరుగుతున్న అనుమానాలు



రెడ్డిగూడెంలో ర్యాలీగా వెళ్తున్న దేవినేని ఉమా

ఉమ్మడి కృష్ణా జిల్లా మైలవరం సీటును ఫిరాయింపు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కి ఖరారు చేయడంతో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సహించలేకపోతున్నారు. పార్టీకి కట్టుబడి ఉన్నట్లు పైకి చెబుతున్నా వసంతను ఓడించడమే తన ధ్యేయమని ఆయన అంతర్గతంగా పార్టీ క్యాడర్‌కూ సంకేతాలు ఇస్తున్నారు. అంతేనా... ఆదివారం రాత్రి ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం గ్రామంలో బల ప్రదర్శన నిర్వహించారు. రెండు రోజుల క్రితం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోనూ బలప్రదర్శన చేపట్టారు. అంటే ఆయన ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగుతారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం రాత్రి రెడ్డిగూడెం వచ్చిన దేవినేని ఉమా టీడీపీ మండల పార్టీ కార్యాలయం నుంచి రాఘవాపురంలోని పద్దమ్మ గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. ఇందులో సుమారు 500 మంది పాల్గొన్నారు. టీడీపీ జెండాలు లేకుండానే సాగిన ర్యాలీలో దేవినేని ఉమా నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణకు టికెట్ ఇవ్వడాన్ని కోడెల శివప్రసాద్ తనయుడు శివరాం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. నర్సరావుపేటలో కడియాల వెంకటేశ్వరరావు, నల్లపాటి రాము తదితరులు అరవింద్‌బాబు అభ్యర్థిత్వాన్ని ఒప్పుకోవడం లేదు. పెదకూరపాడు సీటును పారాచూట్ నేత భాష్యం ప్రవీణ్‌కు కేటాయించడంతో అక్కడి ఇన్‌చార్జి కొమ్మాలపాటి శ్రీధర్ అలకబూని పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తానని చెబుతున్నారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో బూదాల అజితారావు, మన్నె రవీంద్ర అసమ్మతి స్వరం వినిపిస్తున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

ఓటుహక్కుపై ప్రచారం



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఈఓ

రాయచూరు రూరల్: మే 7న జరగనున్న రాయచూరు లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ తుకారం పాండే పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా ఆరోగ్య అధికారి కార్యాలయం వద్ద జిల్లా స్వీప్ సమితి ఏర్పాటు చేసిన జాతాకు శ్రీకారం చుట్టి మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జాతాలో జిల్లా ఆరోగ్య అధికారి సురేంద్రబా బు, వైద్యాధికారులు గణేష్, షాకీర్, రమేష్, విజయ శంకర్ పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

రాయచూరు రూరల్: నగరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని యువ స్వచ్ఛ అభియాన్ నేత రవిబోస్ రాజ్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో ఒకటో వార్డులో స్వచ్ఛ అభియాన్‌కు శ్రీకారం చుట్టి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల ముందు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఘనంగా శ్రీరామలింగ కామదేవర ఉత్సవాలు



పూజలందుకుంటున్న కామదేవుడు

హుబ్లీ: హోళీ పండుగ నేపథ్యంలో నవలగుంద శ్రీరామలింగ కామదేవుడి దర్శనానికి జిల్లాలో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆదివారం సెలవు రోజు కావడంతో తెల్లవారు జామునుంచే ప్రజలు బారులు తీరి రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. శనివారం కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వేసవి నేపథ్యంలో ఆలయ ట్రస్ట్ కమిటీ రెండు ఎకరాల స్థలంలో ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేసి భక్తులకు వసతి కల్పించింది. భక్తులకు తాగునీరు, మజ్జిగ, పానకం, పెరుగుతో కూడిన అవలక్కి, ద్రాక్షపండ్లను అందజేశారు. 24 గంటల పాటు గత ఐదు రోజులుగా ఈప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. తొలిరోజు గోధుమ పాయసం, మరుసటి రోజు శెనగ బ్యాళ్ల పాయసం, మూడవ రోజు పెసరబ్యాళ్ల పాయసం, నాలుగవ రోజు షేమియా పాయసం, పండుగను పురస్కరించుకొని చివరి రోజు కేసరిబాత్, అన్నదానం, సాంబార్ పంపిణీ చేస్తారు.

కుటుంబ సభ్యుల కోసం సమయం కేటాయించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నిత్యం ఒత్తిళ్ల మధ్య విధులు నిర్వహించే పోలీసులు కుటుంబ సభ్యుల కోసం కొంత సమయాన్ని కేటాయించాలని జిల్లా ఆరోగ్య అధికారి సురేంద్ర బాబు పేర్కొన్నారు. శనివారం రాత్రి నగరంలోని జిల్లా జైలు వసతి సముదాయంలో కుటుంబ కళ్యాణ సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. 24 గంటలు విధి నిర్వహణలో వుండే జైలు అధికారులు, సిబ్బంది కుటుంబాలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మానసిక వైద్యుడు మనోహర్, స్వామి వివేకానంద రామకృష్ణ ఆశ్రమం సంచాలకుడు వేణుగోపాల్, జిల్లా జైలు సూపరింటెండెంట్ అందాని, సీఐ ఉమేష్ కాంబ్లే, జిల్లా గ్రంథాలయాధికారిణి నిర్మల, జైలర్లు భాగ్యశ్రీ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరు తాగి అస్వస్థత



కొళాయి నీటిని పరిశీలిస్తున్న అధికారులు

హొసపేటె: తాలూకా నల్లాపూర్ గ్రామంలో కలుషిత నీరు తాగి పలువురు అస్వస్థతకు గురైన ఘటన ఆదివారం జరిగింది. మంచి నీటి కొళాయిలో కలుషిత నీరు సరఫరా కావడంతో ఆ నీటిని సేవించిన గ్రామస్తులు వాంతులు, విరోచనాలకు గురయ్యారు. ఓవర్ హెడ్ ట్యాంక్ శుభ్రం చేయక పోవడమే ఘటనకు కారణమని గ్రామస్తులు ఆరోపించారు. 18 మందికి అస్వస్థతకు గురికాగా వారిలో ఇద్దరు మాత్రమే ఆస్పత్రిలో చేరారు. విజయనగరం జీపీఎం సీఈఓ సదాశివ ప్రభు, డీహెచ్ఓ శంకర్ నాయక్ గ్రామాన్ని సందర్శించారు. నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు.

మిర్చిలో రారాజు బ్యాడిగ



మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



మార్కెట్‌లో మిర్చి రాశులు పోసిన దృశ్యం



హావేరి మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

- రుచి, రంగు, సువాసనతో ఆకట్టుకుంటున్న బ్యాడిగి మిర్చి
- పుట్టినిల్లు మెక్సికో
- 15వ శతాబ్దంలో గోవాకు పరిచయం చేసిన పోర్చుగీసు దేశస్తులు
- హెచ్చు, తగ్గు ధరలతో మిర్చి రైతు కుదేలు

సాక్షి,బళ్లారి: మిర్చిలో రారాజు బ్యాడిగ రకం. సాధారణ ఎండు మిరపతో పోలిస్తే ఈ రకాలకు రేటు అధికంగా రావడంతో వీటి సాగుపై రైతులు మొగ్గుచూపుతున్నారు. బ్యాడిగి మిరపకు పుట్టినిల్లు మెక్సికో దేశం. ఈ బ్యాడిగి మిర్చిని 15వ శతాబ్దం ఆఖరులో గోవాకు పరిచయం చేసింది పోర్చుగీసువాసులు. దీంతో అప్పట్లో ఈ బ్యాడిగి కర్ణాటకలో అడుగు పెట్టింది. అప్పటి వరకు ఇక్కడ నలుపు సుందరిదే హల్‌చల్. (నల్ల మిరియాలు). ఎప్పుడైతే ఇక్కడి ఎర్రమందారానికి బ్యాడిగి మిర్చికి రంగు రుచి, సువాసనకు మైమరిచిపోయారో అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ మిర్చి ఘాటు ఒక్క కర్ణాటకలోనే కాదు పొరుగున ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తర కర్ణాటక పరిధిలో పలు రాష్ట్రాలకు చేరింది. చందన సీమలో బ్యాడిగి మిర్చి ఘాటుకు మరోపేరు డబ్బీ మిర్చి, ఎర్ర మిర్చి. వేరుశనగతో చట్నీతో మొదలై పిజ్జా, బర్గర్లు, రుచికరమైన సాంబరు, పప్పు, రసం తదితర వాటితో పాటు ఊరగాయలకు ఈ బ్యాడిగి మిర్చిని వాడకం తప్పనిసరి. ఆహారం, ఔషధ రంగానికే కాకుండా కాస్మెటిక్ ఉత్పత్తుల్లో ప్రధానంగా నెయిల్ పాలిష్, లిప్‌స్టిక్‌లలో వినియోగిస్తారు. 2011లో భౌగోళికంగా మరింత ఖ్యాతిని దక్కించుకుంది.

ఈ మిర్చికి భలే గిరాకీ:

ప్రారంభంలో హావేరి జిల్లా వర్షాధారిత ప్రాంతమైన హిరేకెరూరు, రట్టిహళ్లి ప్రాంతాలల్లో అనుకూలమైన వాతావరణం ఉండటంతో ఈ పంట ప్రవర్ధమానానికి వచ్చింది. హావేరి ప్రాంతంలో సాగు అత్యధికంగా విస్తరించడటంతో బ్యాడిగి పట్టణం వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతోంది. ఇక్కడి మార్కెట్‌లో కడ్డీ, డబ్బీ రకాలు మిర్చికి బ్యాడిగి అనే పేరు వచ్చింది. ఈ సంవత్సరం ఒక రోజు బ్యాడిగి మార్కెట్‌లో దాదాపు ఐదు లక్షలు సంచులు మిర్చి వచ్చి చేరుతోంది. అమెరికా, రష్యా, మలేషియా, సింగపూర్, ఇండోనేషియా, శ్రీలంక, అరబ్ తదితర దేశాలకు బ్యాడిగి మిర్చి ఎగుమతి అవుతోంది. ఈసారి మిర్చి ధరలు పతనం కావడంతో పెట్టుబడులు కూడా దక్కకపోవడంతో బ్యాడిగిలో రైతులు ఇటీవల పెద్ద ఎత్తున విధ్వంసం చేసిన సంగతి తెలిసిందే.

హావేరిలో బ్యాడిగ కనుమరుగు :

బ్యాడిగి మిర్చి పంట హావేరి జిల్లాల్లో ఇటీవల కొన్ని సంవత్సరాలుగా చాలా వరకు కనుమరుగవుతోంది. హావేరి రైతులు పండించడం దూరమైనప్పటికి, బ్యాడిగికి ఇతర ప్రాంతాలు నుంచి పెద్ద సంఖ్యలో మిర్చి తరలిస్తుండటంతో బ్యాడిగి మార్కెట్ మాత్రం ఉనికిని ఏటేటా పెంచుకుంటోంది. కాగా మిర్చి వచ్చే రోగాలు, చీడ బాధలు, వాతావరణ మార్పులతో విసిగిన హావేరి జిల్లాకు చెందిన అత్యధిక అన్నదాతలు మొక్కజొన్నను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో హైబ్రీడ్ వంగడాలు కూడా వస్తున్నాయి. సంస్కరించిన వంగడాల్లో అతికారం, అతిగా రంగు, అధిక దిగుబడి అవుతున్నాయి. అయితే రుచి రంగు, సువాసన తదితర సమపాళ్లలో ఉన్న మూల వంగడం నాణ్యత మరే రకంలోను లభించడం లేదు. దీంతో బ్యాడిగి, డబ్బీ, కడ్డీ రకం కొనుగోళ్లకు వ్యాపారులతో పాటు, మసాల పదార్థాలు తయారీదారులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అవసాన దశలో మూల వంగడమైన కడ్డీ, డబ్బీ రకాలు మిర్చి వివిధ సమస్యలతో సతమతమవుతోంది.

కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా రావు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

హొసపేటె: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పార్టీ ఈసారి దేశంలో 400 సీట్లకు పైగా గెలుస్తుందని, కాంగ్రెస్ 50 సీట్లు కూడా దాటదని బళ్లారి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బీ.శ్రీరాములు తెలిపారు. విజయనగర జిల్లా కూడ్లిగి పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బూత్ స్థాయి విజయ అభియాన్ సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. పదేళ్ల పాలనలో ప్రపంచం మెచ్చిన నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ అని అన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలంటే రాష్ట్రంలోని 28 నియోజక వర్గాల్లో విజయం సాధించాలి. ఈసారి కూడ్లిగి నియోజకవర్గాన్ని ఆశీర్వదిస్తే రానున్న అసెంబ్లీ నియోజక వర్గానికి స్థానికులకే టిక్కెట్ ఇస్తానన్నారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు రవికుమార్, చిన్నబసన్న గౌడ పాటిల్, సిద్దార్థసింగ్, బంగారు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి తిరుమలేశ్

సిరుగుప్ప: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తాలూకా ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి తిరుమలేశ్ తెలిపారు. ఆదివారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కొప్పళ పార్లమెంట్ నియోజక వర్గం రెండవ విడతలో పోలింగ్ అంటే మే 7న జరుగుతుందని చెప్పారు. పోలింగ్ శాతాన్ని పెంచాలని, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాలూకాలో 228 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ శంశలం, ఈఓ పవన్ కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి పది పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ



కేంద్రంలో నెంబర్లు వేస్తున్న సిబ్బంది

కోలారు: జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి (సోమవారం) 65 కేంద్రాలలో మొత్తం 20,479 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. దీంతో అన్ని భద్రతా చర్యలు తీసుకున్నారు. 2250 మంది సిబ్బందిని నియమించినట్లు డీఈఓ కృష్ణమూర్తి తెలిపారు. ప్రశ్న పత్రాల తరలింపు నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ ఉంటుంది. ఇక మధ్యాహ్నం వరకు జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని ఆదేశించార

పశుగ్రాసం సరఫరాకు చర్యలు

హొసపేటె: కూడ్లిగి తాలూకా గుడేకోటలో పశుగ్రాస కేంద్రాన్ని తహసీల్దార్ రాజు పిరంగి ప్రారంభించి రైతులకు దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూడ్లిగి తాలూకాలో పశువులు వేల సంఖ్యలో ఉన్నాయని, గ్రాసం లేక పశువులు ఆకలితో అల్లాడి పోతున్నాయని, దీంతో పశుగ్రాస పంపిణీ కేంద్రం ప్రారంభించమన్నారు. తాలూకాలో సరిగా వర్షం కురవక పోవడంతో పశువులు, వన్యప్రాణులకు తాగునీటి సమస్య తలెత్తడంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. అందుకనుగుణంగా పశువులకు మేత కొరత ఏర్పడటంతో గుడేకోటలో పశుగ్రాసం బ్యాంక్‌ను ప్రారంభించామని తెలిపారు. ప్రస్తుతం 15 టన్నుల పశుగ్రాసం నిల్వ ఉందని, ఎక్కువ మేత కొనుగోలు చేసి రైతులకు సరఫరా చేస్తామన్నారు. రానున్న రోజుల్లో జిల్లా కలెక్టర్ మార్గదర్శనం మేరకు గండబొమ్మ గ్రామంలో గోవుల పాఠశాలను ప్రారంభించేందుకు చర్య లు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్.లోహితకుమార్ గుడేకోట, అరుణ కుమార్ రాథోడ్ డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చౌడప్ప, దేవాదాయ శాఖ మరుల సిద్దప్ప, యశ్వంత్, వీరేష్, ప్రహ్లాద్, శ్రీదేవి, అమిత్ పాల్గొన్నారు.

గుంపు ఘర్షణ, పోలీసుల లాఠీచార్జ్

గంగావతి: పేకాటలో ఇద్దరి మధ్య గొడవ గుంపు ఘర్షణగా మారడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి స్వల్పంగా లాఠీచార్జ్ చేసి పరిస్థితిని అణిచివేశారు. ఈ ఘటన నగరంలోని ఏపీఎంసీ వద్ద జరిగింది. ఏపీఎంసీ మూడో గేట్ వద్ద ఇస్పేట్ ఆటలో పాల్గొన్న సందర్భంగా ఇరువురి వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. ఇది గుంపు ఘర్షణగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగి రెండు వర్గాలను చెదరగొట్టారు. అనంతరం మహమ్మద్ ఇలియాస్ ఫిర్యాదు మేరకు లింగరాజ్ క్యాంప్‌కు చెందిన మల్లికార్జున, గంగావతికి చెందిన మనోహర్ తదితరులపై కేసు నమోదు చేసుకున్నారు. అదే విధంగా మల్లికార్జున, సిద్దప్ప ఫిర్యాదు మేరకు మహమ్మద్ గౌస్, మహమ్మద్ ఇలియాస్, గుండమ్మ క్యాంప్ చెందిన వారిపై గంగావతి టౌన్ పోలీస్‌స్టేషన్ కేసు నమోదైంది.

నగదు స్వాధీనం

హుబ్లీ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల్లో ఎన్నికల అధికారులు నిఘా పెంచారు. అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా ఆదివారం అలియాళ చెక్‌పోస్టులో అధికారులు ఓ కారును తనిఖీ చేయగా అందులో రూ.1.49 లక్షల నగదు గుర్తించారు. ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును ఖజానాలో డిపాజిట్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. అదే విధంగా గోకాక్ నుంచి కుర్తికోటికి వెళ్లె గూడ్స్ వాహనాన్ని తనిఖీ చేయగా రూ.73,670 నగదు పట్టుబడింది.



చుక్క మంచినీరు లభిస్తే అదే గగనం. పిడచకట్టుకుపోయే గొంతుకు అదే అమృతం. బెంగళూరు ఉత్తరహళ్లిలో ఓ కొళాయిలో కారే నీటితో దాహం తీర్చుకుంటున్న పిట్ట



రాయల నగరి హంపీలో కొళాయిల నుంచి దాహం తీర్చుకుంటున్న వానరాలు

మౌలిక సదుపాయాలపై సీఈఓ ఆరా



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఈఓ సదాశివ ప్రభు

హొసపేటె: జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి సదాశివ ప్రభు ఆదివారం వివిధ ప్రాంతాల్లో పర్యటించి మౌలిక వసతులపై ఆరా తీశారు. మధ్యాహ్నం తంబ్రహళ్లి గ్రామంలోని సంఘిక సంక్షేమ శాఖ ప్రీ మెట్రిక్ విద్యార్థి వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ టాయిలెట్ పైప్‌లైన్ పగిలి నీరు బయటకు వస్తుండటాన్ని గమనించారు. వెంటనే సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. అదే విధంగా హాస్టల్ విద్యార్థులతో సీఈఓ మాట్లాడారు. పది పరీక్షలను ధైర్యంగా రాయాలన్నారు. ఆయన వెంట హగరిబొమ్మనహళ్లి టీపీఈఓ పరమేశ్వర్ పాల్గొన్నారు.

అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం



నూతన అధ్యక్షుడిని సన్మానించిన దృశ్యం

కోలారు: కర్ణాటక ప్రింటర్స్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ మండలికి నిర్వహించిన అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా కోలారుకు చెందిన అబ్బణి శంకర్, ఉపాధ్యక్షుడిగా బెంగుళూరుకు చెందిన ఎస్ శివరాంలు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. కాగా సంఘం డైరెక్టర్లుగా మిరయప్ప, ఎల్ మురళీకృష్ణ, జెఎస్ వీరణ్ణ, కె శంకర్, బి సునీల్, మంజులా శంకర్, శంకరాచారి, పి సుధాకర్, పి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం మాట్లాడిన అధ్యక్షుడు అబ్బణి శంకర్ డైరెక్టర్‌ల సహకారంతో సంఘాన్ని ఆర్థికంగా బలపరుస్తానని సభ్యులు ఆర్థిక అభివృద్ధికి అవసరమైన సలహాలు ఇవ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను, డైరెక్టర్‌లను పలువురు అభినందించారు.

కోలారు కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు

- కొలిక్కిరాని అభ్యర్థి ఎంపిక
- నన్నగిల్లుతున్న విజయావకాశాలు
- విఫలమవుతున్న అధిష్టానం బుజ్జగింపులు

కోలారు: జిల్లా కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు తగ్గడం లేదు సరికదా నానాటికి అధికమవుతోంది. 2019 లోక్‌సభ ఎన్నికలలో గ్రూపు విభేధాల కారణంగానే కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి ఎరుగని కెహెచ్ మునియప్ప ఘోరపరాజయం పాలై తొలిసారిగా బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. కోలారు కాంగ్రెస్ గత రెండు దశాబ్దాలుగా గ్రూపు తగాదాలు ఉన్నాయి. సీనియర్ నాయకుడు మాజీ స్పీకర్ ఒక వర్గం కాగా కేంద్ర మాజీ మంత్రి ప్రస్తుత రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కెహెచ్ మునియప్పది మరొక వర్గం. జిల్లా కాంగ్రెస్‌లో కెహెచ్ మునియప్ప - కె ఆర్ రమేష్‌కుమార్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కెహెచ్ మునియప్ప సొంత పార్టీ అభ్యర్థులనే ఓడించే ప్రయత్నం చేశారని ప్రత్యర్థులతో చేతులు కలిపి కాంగ్రెస్ అభ్యర్థులకు వెన్నుపోటు పొడిచారనేది కెహెచ్ మునియప్ప వ్యతిరేక వర్గం ఆరోపణ. ఇదే కారణంతో గత 2019 లోక్‌సభ ఎన్నికలలో కెఆర్ రమేష్‌కుమార్, అప్పటి ముళబాగిలు ఎమ్మెల్యేగా ఉన్న కొత్తూరు మంజునాథ్, బంగారుపేట ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తదితరులు కక్షగట్టి కెహెచ్ మునియప్ప ఓటమికి కారణమయ్యారు. పైగా ఇదంతా తాము కెహెచ్ మునియప్పనే నుంచే నేర్చుకున్నామని బంగారుపేట ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి బహిరంగంగా తెలిపారు. నెల రోజుల క్రితం కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఇరు వర్గాల వారు కొట్టుకోవడంతో రెండు వర్గాల మధ్య దూరం మరింత అధికమైంది. గ్రూపు తగాదాలు తారస్థాయికి చేరుకుంది.

కుదరని సయోధ్య :

జిల్లా కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాల కారణంగా లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా పరిణమించింది. ఏడుసార్లు నియోజకవర్గం నుంచి విజయం సాధించిన కెహెచ్ మునియప్పకు ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా ఉండడంతో టికెట్ తనకు కాకుండా తన అల్లుడు చిక్క పెద్దయ్యకు ఇవ్వాలని హైకమాండ్ వద్ద డిమాండ్ ఉంచారు. అయితే దీనిని కెహెచ్ వ్యతిరేకవర్గం పూర్తిగా వ్యతిరేకిస్తోంది. కెహెచ్ కుటుంబంలో ఎవరికి టికెట్ ఇచ్చినా తమ సహకారం ఉండదని తెగేసి చెబుతున్నారు. ఇరువురి మధ్య సయోధ్య కుదర్చడానికి హైకమాండ్ చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక చిక్కుముడిగా మారింది. కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలు జేడీఎస్ అనుకూలంగా మారుతున్నాయి. గత ఎన్నికలలో గ్రూపు తగాదాల వల్లనే ఓడిన కాంగ్రెస్ మళ్లీ అదే తప్పు చేస్తూ జేడీఎస్‌కు మేలుచేస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనేది చూసి అభ్యర్థిని ప్రకటించే ఆలోచనలో జేడీఎస్ ఉంది.

సిట్టింగ్ ఎంపీ ఆశలపై నీళ్లు :

బీజేపీ అధిష్టానం ఈసారి తనకే టికెట్ కేటాయిస్తుందని గంపెడు ఆశలతో ఉన్న సిటింగ్ ఎంపీ ఎస్ మునిస్వామి ఆశలపై బీజేపీ అధిష్టానం నీళ్లు చల్లింది. కోలారును జేడీఎస్‌కు వదలి పెట్టడంతో ముని స్వామి కోలారు టికెట్‌పై ఆశలు వదులుకున్నారు. మరో వైపు మునిస్వామి స్వతంత్ర అభ్యర్థిగా నిలబడాలని, లేదా జేడీఎస్ టికెట్‌ను మునిస్వామికే ఇవ్వాలని ఆయన అభిమానులు డిమాండ్ చేసినా ఇదంతా ఆయన తోసిపుచ్చారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు.

నరసింహ ద్వాదశి వ్రతం ఆచరణ



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కెజీఎఫ్: నగరంలోని కోరమాండల్ స్వామినాథపురంలో ఉన్న తిరువెంగడ ముదియన్ దేవాలయంలో నరసింహ స్వామికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ధర్మదర్శి మహేంద్రన్ మాట్లాడుతూ... నరసింహ ద్వాదశ వ్రతాన్ని ఆచరించడం ద్వారా తమ జీవితంలోని అన్ని అవరోధాలను అధిగమించడానికి సాధ్యమవుతుందని, భగంతుడి కృపా కటాక్షాలకు పాత్రులు కావచ్చని తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి దివ్య ప్రబంధ సేవలు, 10 గంటల నుంచి విశ్వక్సేన ఆరాధన, మహా లక్ష్మీనారాయణ హోమం, సత్యనారాయణ స్వామి పూజా కార్యక్రమాలు జరిగాయి.

ఉపాధి కోసం వచ్చి మృత్యువాత

ఇంకొల్లు (చినగంజాం): అకస్మాత్తుగా హార్వెస్టర్ తగిలి వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన ఇంకొల్లు మండలం భీమవరం గ్రామం పొలాల్లో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. రాయచూరు మండలం గుడిహాల్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మ (64) బతుకుదెరువు కోసం గ్రామానికి వచ్చింది. పొలాల్లో శనగనూర్పిడి కోసం పనికి వెళ్లింది. పొలంలో పిచ్చి కంపను పీకుతున్న సమయంలో హార్వెస్టర్ వాహనం తగిలి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. కుమారుడు గురుస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సిద్దేశ్వరుడికి విశేష పూజలు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన శ్రీ సిద్దేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి ఉదయం సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. ఆదివారం సెలవు దినం కావడంతో మడకశిర నియోజకవర్గం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కన్యకా పరమేశ్వరి ఆలయాలకు చీరలు



ఆలయానికి చీర అందజేస్తున్న ఆర్యవైశ్య కమిటీ

శ్రీనివాసపురం: ఉగాది పండుగను పురస్కరించుకుని 300 వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాల అమ్మవార్లకు పట్టు చీరులను అందిస్తున్నట్లు జిల్లా ఆర్యవైశ్య మండలి అధ్యక్షుడు కెఆర్ శివకుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి పట్టు చీరను బహుకరించి మాట్లాడారు. బెంగుళూరు గ్రామీణ జిల్లా నెమంగల తాలూకా దాబస్ పేటలో ఆర్యవైశ్య సముదాయం ఆధ్వర్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సముదాయ విద్యార్థుల కోసం నర్సరీ నుంచి డిగ్రీ వరకు ఉత్తమ విద్యా సంస్థను స్థాపించాలనే ఉద్దేశం కలిగి ఉన్నట్లు తెలిపారు. సంస్థ అభివృద్ధి కోసం ఇప్పటికే సుమారు 50 మంది నుంచి షేరు మొత్తాన్ని సంగ్రహించినట్లు తెలిపారు. శ్రీ వాసవి ఎడ్యుకేషన్ కో ఆపరేటివ్ సొసైటీ నుంచి వేల మంది సముదాయం వారు షేర్లను కొనుగోలు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవశ్య మండలి జిల్లా డైరెక్టర్ ఎంఆర్ ఆనంద్, ఎస్ఆర్ అమరనాథ్, జిల్లా ఆర్యవైశ్య మండలి డైరెక్టర్ వైవి రమేష్, తాలూకా అధ్యక్షుడు వైఆర్ శివప్రకాష్ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న కరగ ఉత్సవం



కరగ నృత్యం చేస్తున్న పూజారి

మాలూరు: తాలూకాలోని కోడిహళ్లి గ్రామంలో శ్రీ ద్రౌపతాంబ దేవి ఆలయ 3వ కరగ మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కరగ ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. పోతురాజు, భరత పూజారి వేద మంత్రాలను పఠించిన అనంతరం కరగ ఉత్సవాన్ని ప్రారంభించారు. శనివారం రాత్రి 11.30 గంటలకు కరగ పూజారి సురేష్ కరగను మోస్తూ చేసిన నృత్యం ఆకట్టుకుంది. తమ ఇంటి ముంగిటకు వచ్చిన కరగను గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

క్షయవ్యాధిపై ప్రచార జాతా

రాయచూరు రూరల్: క్షయరహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పంచాయతీ సీఈఓ రాహుల్ తుకారం పాండే పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లారోగ్య అధికారి కార్యాలయం వద్ద జాతాకు శ్రీ కారం చుట్టి మాట్లాడారు. 2035 నాటికి క్షయరహిత దేశంగా మార్చాలన్నారు. వ్యాధి వచ్చిన వెంటనే ఆరు నెలల పాటు చికిత్స పొందాలన్నారు. మంచి మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. జాతాలో జిల్లా ఆరోగ్య అధికారి సురేంద్రబాబు, వైద్యాధికారులు గణేశ్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.